ముహూర్తం

శ్రీ విళంబి నామ సంవత్సరం, దక్షిణాయణం,
హేమంత ఋతువు, పుష్యమాసం;
తిథి: శుద్ధపాడ్యమి (పూర్తి); నక్షత్రం: పూర్వాషాఢ
సా.4.55 వరకు, అనంతరం ఉత్తరాషాఢ;
అమృతకాలం: మ.12.00 నుండి 1.40 వరకు;
వర్జ్యం: రా.1.41 నుండి 3.26 వరకు;
దుర్ముహూర్తం: సా.4.24 నుండి 5.12 వరకు;
రాహుకాలం: సా.4.30 నుండి 6.00 వరకు;
యమగండం: మ.12.00 నుండి 1.30 వరకు

Estd 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!

సంపుటి: 63 • సంచిక: 358 • ఆదివారం 6 జనవరి 2019 • విజయవాడ * పేజీలు: 14 • వెల: 6.00 • Published from: Vijayawada | Kurnool | Hyderabad | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Suryapet | Anantapur | Nellore | Nizamabad

చిరు ధాన్యాలతో ఆరోగ్య సిరి

8 లో

• రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రల విస్తృత వినియోగం • పోషక విలువలు పుష్కలం • లాభాల సాగంటూ ప్రోత్సహిస్తున్న నిపుణులు





జోడు గుర్రాలు

• వృత్తి- ప్రవృత్తికి న్యాయం చేస్తున్న కుర్రకారు • చదువుకు తగ్గ ఉద్యోగం... మనసుకు నచ్చిన వ్యాపకం • సృజనే ఆయుధం... సంతులనమే సాధనం • రెండింటినీ పెనవేసుకుని సాగిపోతున్న కొత్తతరం

9 లో



మోడీ... నీ గారడీ చెల్లదు!

• మీ అబద్ధాలతో ఓట్లు రాలవ్
• అవార్డులిస్తూ ఆరోపణలా?
• హామీల అమలు అడిగితే కక్ష సాధిస్తారా?
• జగన్ కేసులో ఎన్ఐఏ పేరుతో నాటకం
• అవినీతిపరులతో ప్రధాని స్నేహం
• శ్రీకాకుళం జన్మభూమిలో చంద్రబాబు

శ్రీకాకుళం, ప్రభ న్యూస్ బ్యూరో: వచ్చే ఎన్నికల్లో మోడీ మాటలగారడీ మరి చెల్లదని, వచ్చే ఎన్నికల్లో బీజేపీ ఓటమి ఖాయమని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జోస్యం చెప్పారు. ఆరవ విడత జన్మభూమి కార్యక్రమంలో భాగంగా శనివారం శ్రీకాకుళం జిల్లా రాజాం మండలం పొగిరి గ్రామంలో నిర్వహించిన జన్మభూమి సభలో చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్రంలోని మోడీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆంధ్రప్రదేశ్‌కు విభజన బిల్లులో ఇచ్చిన హామీలు, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయమని తాను కేంద్రాన్ని డిమాండ్ చేస్తుంటే, మనల్ని అణగదొక్కేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని చంద్రబాబునాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం చేసిందని,

2వ పేజీలో...



సంక్రాంతి తర్వాత సంపూర్ణ రుణమాఫీ

• రైతులకు 9 గంటల విద్యుత్ సరఫరా • బోరుబావులకు సోలార్ విద్యుత్ • జన్మభూమి సభలో చంద్రబాబు

2



కాంగ్రెస్ దృష్టిలో ఓటు బ్యాంకు మాకు అన్నదాత

• ఎన్నికలప్పుడే గుర్తొస్తారా? • రుణమాఫీతో సమస్యలు పరిష్కారం కావు • అలా జరిగితే ప్రతి రైతుకూ రూ.లక్ష మాఫీ చేస్తాం • రైతన్న ఆదాయం రెట్టింపే లక్ష్యం: ప్రధాని

5 లో

కులాల రాష్ట్రానికి చుక్కానిగా జనసేన

గేలిచేసిన చోట... గెలుపుబాట!

• తొలిమెట్టు ఎక్కేశాం.. • ప్రధాన పక్షాల చూపు మనవైపే... • యువత నాకు వెన్నెముక • స్వచ్ఛతకు చిరునామాగా ఎదుగుతున్నాం • ప్రకాశం, చిత్తూరు జిల్లాల సమీక్షల్లో జనసేనాని

అమరావతి, ఆంధ్రప్రభ : "మన అండతో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ గానీ, ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ గానీ మనల్ని రాజకీయ పార్టీగా గుర్తించడానికి ఇష్టపడని స్థాయి నుంచి జనసేన పార్టీ మాతో కలసి వస్తుందని ప్రచారం చేసుకునే స్థాయికి వెళ్లడం మన విజయానికి తొలి మెట్టు" అని జనసేన అధినేత కొణిదెల పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. వాళ్లకి మన అవసరం ఉందేమోగానీ మనకు మాత్రం వాళ్ల అవసరం లేదన్నారు. తెలియకుండానే మనకు సామాన్యులు వాడే గ్లాసు ఎన్నికల గుర్తుగా వచ్చిందని, కాలం మనకు అనుకూలంగా ఉందనడానికి ఇదే నిదర్శనమని

3వ పేజీలో...



జెండారే... జెండా పవనన్న జెండా!

• ఉర్రూతలూగిస్తున్న ప్రత్యేక పాట
• పార్టీ మేనిఫెస్టోను ప్రతిబింబిస్తూ రూపకల్పన

3



జగన్@3600

• పాదయాత్రకు తుదిఘట్టం • ఇచ్ఛాపురంలో జననేత • జగన్‌కు జన నీరాజనం • జోరుగా సాగుతున్న వలసలు

ఇచ్ఛాపురం, శ్రీకాకుళం, ప్రభ న్యూస్ బ్యూరో: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప పాద యాత్ర తుది ఘట్టానికి చేరువలో ఉంది. శనివారం 337వ రోజు శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని సోంపేట మండలం తురకశాసనం క్రాస్ నుండి ప్రారంభమైంది. అక్కడి నుండి పాలవలస, కొర్లాం, బారువ జంక్షన్ వద్ద జననేత సుదీర్ఘ పాద యాత్రలో 3,600 కి.మీ. పూర్తి చేసుకున్నారు. రోజంతా ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని సోంపేట మండలంలోనే పర్యటించిన జగన్ అన్ని చోట్లా ప్రజలతో మమేకమై

3వ పేజీలో...

• కేంద్ర హోంశాఖకు ఫిర్యాదు చేస్తా
• పోలీసులతో పాలన సాగిస్తున్నారు
• ఫినిష్ చేస్తామని హెచ్చరిస్తున్నారు
• బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా




నన్ను చంపేందుకు తెదేపా కుట్ర!

గుంటూరు, ప్రభన్యూస్ బ్యూరో: రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదని, పోలీసులతో టీడీపీ పాలన సాగిస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవస్థలను భ్రష్టు పట్టించారని విమర్శించారు. సీఎం కాన్వాయ్‌ను బీజేపీ శ్రేణులు అడ్డుకోవటంపై కన్నా లక్ష్మీనారాయణ ఇంటిముందు శనివారం పలువురు టీడీపీ లీగల్‌సెల్‌కు చెందిన నాయకులు ఆందోళన చేపట్టారు. దీంతో కన్నా లక్ష్మీనారాయణతో పాటు బీజేపీ నేతలు టీడీపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. ఒకానొక పరిస్థితిలో తోపులాటలు కూడా జరిగాయి. దీంతో పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టి గొడవను అదుపులోకి తెచ్చారు. ఈ సందర్భంగా కన్నా లక్ష్మీనారాయణ పాత్రికేయులతో మాట్లాడుతూ కాకినాడ సీఎం పర్యటనలో స్థానిక బీజేపీ నేతలు సమస్యలపై వినతిపత్రం ఇచ్చేందుకు ప్రయత్నించగా

2వ పేజీలో...

యుద్ధానికి సిద్ధంకండి!



• ఏడాది పొడవునా శిక్షణ కొనసాగాలి • ఆర్మీకి చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పిలుపు • సవాళ్లు పొంచివున్నాయంటూ హెచ్చరిక

బీజింగ్: భారత్‌తో సరిహద్దు సమస్య, దక్షిణ సముద్రంలో పొరుగు దేశాలతో ఎదురవుతున్న సాగర ప్రాదేశిక వివాదాల నేపథ్యంలో భవిష్యత్‌లో ఎదురయ్యే ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆదేశ సాయుధ బలగాలకు పిలుపునిచ్చారు. రెండు రోజుల కిందట బీజింగ్‌లో ఆర్మీ అధిపతులతో జిన్‌పింగ్ సమావేశం అయ్యారు. దేశ అత్యున్నత మిలటరీ సంస్థ అయిన సెంట్రల్ మిలటరీ కమిషన్ (సీఎంసీ) సమావేశంలో

5వ పేజీలో...



సమరసన్నాహం 2019

కయ్యాల బరి... జనసేనకు దారి

• ఆసక్తికరంగా సంతనూతలపాడు
• తెదేపాలో కలహాల జోరు
• వైకాపాలో ఎవరికివారే యమునాతీరే • వామపక్షాల అండతో ఎగరనున్న జనసేన జెండా..!



2 లో

చిత్తూరు జిల్లా... ఎవరికో ఖిల్లా!

• ఆధిక్యం కోసం తెదేపా ఆరాటం
• పట్టు నిలుపుకోవడానికి వైకాపా పోరాటం • జనసేన రాకతో ఇద్దరికీ ఇరకాటం • మెజారిటీ స్థానాలలో త్రిముఖ పోటీకి అవకాశం



2 లో



హనుమాన్ చాలీసా పారాయణ విశ్వశాంతి మహాయజ్ఞంలో పాల్గొని పూజలు చేస్తున్న సీఎం

హనుమాన్ చాలీసా మహాయజ్ఞంలో ముఖ్యమంత్రి

అమరావతి, ఆంధ్రప్రభ: అవధూత దత్త పీఠాధిపతి గణపతి సచిదానంద స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన హనుమాన్‌చాలీసా పారాయణ విశ్వశాంతి మహాయజ్ఞంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాల్గొన్నారు. కృష్ణా నదీతీరంలోని పద్మావతి ఘాట్లో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వీర హనువాన్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి సచ్చిదానంద స్వామి ముఖ్యమంత్రికి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విశ్వశాంతి మహాయజ్ఞాన్ని నిర్వహిస్తున్న సచ్చిదానంద స్వామిని అభినందిస్తూ ఘనంగా సత్కరించి జ్ఞాపికను బహూకరించారు.

కయ్యాల బరి... జనసేనకు దారి



- ఆసక్తికరంగా సంతనూతలపాడు
- తెదేపాలో కలహాల జోరు
- వైకాపాలో ఎవరికివారే యమునా తీరే
- వామపక్షాల అండతో ఎగరనున్న జనసేన జెండా...!

ఒంగోలు, ప్రభ న్యూస్ బ్యూరో: ప్రకాశం జిల్లాలో అత్యంత ఆసక్తికరమైన రాజకీయం జరిగే నియోజకవర్గాలలో సంతనూతలపాడు నియోజకవర్గం ఒకటి. పేరుకు ప్రత్యేక నియోజకవర్గంగా కనిపించినా ఇక్కడ రాజకీయమంతా జిల్లా కేంద్రమైన ఒంగోలు పట్టణంతోనే ముడిపడి ఉంటుంది. చీమకుర్తి, సంతనూతలపాడు, మద్దిపాడు, నాగులుప్పలపాడు మండలాలతో పాటు ఒంగోలు కార్పొరేషన్‌లోని నాలుగు డివిజన్లు కలగలిసిన నియోజకవర్గం ఇది. ఇక్కడ మొత్తం 2,01,912 మంది ఓటర్లు ఉన్నారు. ఈ నియోజకవర్గంలో ప్రస్తుతానికి ఇరుప్రధాన పార్టీలు పోటీచేసే అభ్యర్థులను ఖరారు చేయలేదు. వామపక్షాలతో కలిసి పోటీచేయబోతున్న జనసేన అతిపెద్ద ప్రత్యామ్నాయంగా ఓటర్ల ముందుకురానుంది. జనసేన ప్రకాశం జిల్లాలో ప్రభావితం చేయబోయే నియోజకవర్గాలలో సంతనూతలపాడు కూడా ఒకటి.

ప్రకాశం జిల్లాలో 12 నియోజకవర్గాలు ఉంటే అందులో మూడు ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గాలు. సంతనూతలపాడు తొలుతనుంచి ఎస్సీ రిజర్వ్‌డ్‌గానే ఉంది. గత చరిత్ర పరిశీలిస్తే టీడీపీయేతర పార్టీలు ఈ నియోజకవర్గంలో ఎక్కువసార్లు విజయం సాధించాయి. 2009 ఎన్నికల్లో ప్రజారాజ్యం పార్టీ 19, 129 ఓట్లు సాధించింది. టీడీపీ మద్దతుతో పోటీచేసిన సీపీఎం 54,238 ఓట్లు సాధించింది. ఆ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ తరపున బీఎన్ విజయ్‌కుమార్ 63,769 ఓట్లు సాధించి మొట్టమొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2014 ఎన్నికలలో వైసీపీ, టీడీపీ ముఖాముఖి పోటీపడ్డాయి. ఈ ఎన్నికలలో వైసీపీ తరపున ఆదిమూలపు సురేష్ గెలుపొందారు.

సంతనూతలపాడు నియోజకవర్గానికి విజయ్‌కుమార్ టీడీపీ ఇన్‌చార్జ్‌గా ఉన్నా ఆయనపై ఆ పార్టీ నేతలలో తీవ్రమైన అసమ్మతి ఉంది. విజయ్‌కుమార్ టీడీపీలో ఉండే సీనియర్ నేతలను కలుపుకొని పోవడంలో విఫలమవుతున్నారని, 2019 ఎన్నికలలో విజయ్ కుమార్‌కు సీటు ఇవ్వవద్దని ఆ పార్టీ నాయకులు నేరుగా చంద్రబాబు నాయుడుకు పలుసార్లు ఫిర్యాదు చేశారు. దీంతో రానున్న ఎన్నికలలో విజయ్‌కుమార్ సంతనూతలపాడు నుంచి పోటీచేసే అవకాశాలు తక్కువగానే కనిపిస్తున్నాయి. విజయ్‌కుమార్ కాకుంటే అవకాశం ఎవరికి లభిస్తోంది అన్న విషయంపై ఇప్పటివరకు స్పష్టతలేదు. లిడ్‌క్యాప్ చైర్మన్‌గా ఉన్న ఎరిక్షన్‌బాబును సంతనూతలపాడు నుంచి పోటీచేయడానికి ఉత్సాహం చూపిస్తున్నారు. ఎరిక్షన్‌బాబుతోపాటు ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ జూపూడి ప్రభాకర్, ప్రస్తుత యర్రగొండపాలెం శాసనసభ్యులు పాలపర్తి డేవిడ్‌రాజు పేర్లు కూడా పరిశీనలో ఉన్నాయి. ఈ నియోజకవర్గంలో టీడీపీలో వున్నన్ని విభేదాలు బహుశా మరే నియోజకవర్గంలోనూ కనిపించవు.

ఇక వైసీపీ విషయానికి వస్తే గత ఎన్నికలలో ఈ నియోజకవర్గం నుంచి గెలుపొందిన ఆదిమూలపు సురేష్ రానున్న ఎన్నికలలో యర్రగొండపాలెం నియోజకవర్గానికి వలస వెళ్లాలని నిర్ణయించుకున్నారు. వైసీపీ కూడా ఆదిమూలపు సురేష్‌ను యర్రగొండపాలెంనుంచే పోటీ చేయించేందుకు సుముఖంగా ఉంది. సంతనూతలపాడు నియోజకవర్గానికి టీజేఆర్ సుధాకర్‌ను సమన్వయకర్తగా ప్రకటించినప్పటికీ గతకొంతకాలంగా ఆయన నియోజకవర్గ రాజకీయాలకు దూరంగా ఉంటున్నట్లు కనిపిస్తోంది. ఆదిమూలపు సురేష్ తరువాత ఈ నియోజకవర్గంలో సరైన నాయకత్వం లేక పోవడంతో వైసీపీ శ్రేణులు కూడా చిలవలు పలవలుగానే ఉన్నాయి. వైసీపీ తరపున ఎవరు పోటీచేస్తారన్న అంశంపై కూడా స్పష్టత లేదు. ఇరుపార్టీల్లోనూ ప్రస్తుతానికి గందరగోళమే నెలకొని ఉంది.

ఇక జనసేన, వామపక్షకూటమి ఈ నియోజకవర్గంలో తీవ్రమైన ప్రభావం చూపించే అవకాశం ఉంది. ఈ నియోజకవర్గం నుంచి 1994లో తవనం చెంచయ్య సీపీఎం తరపున శాసనసభ్యులుగా పనిచేసి ఆదర్శప్రాయమైన ఎమ్మెల్యేగా గుర్తింపు పొందారు. నియోజకవర్గంలో సీపీఎంకు మంచిపట్టుఉంది. గురువారం నియోజకవర్గంలో నూతన నాయకత్వాన్ని తెరమీదుకు తీసుకు వచ్చేందుకు జనసేన, సీపీఐ, సీపీఎం సంయుక్త సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నాయి.

మంచిబలమున్న సీపీఎంకి, జనసేన, సీపీఐ తోడైతే ప్రధాన పార్టీలకు చెమటలు పట్టడం ఖాయం. 2009లో ప్రజా రాజ్యం పార్టీకి వచ్చిన ఓట్లను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతోంది. ఇరు ప్రధాన పార్టీల్లో ఇప్పటికే గందరగోళం ఉన్న కారణంగా కూటమి తరపున సరైన అభ్యర్థిని రంగంలోకి తెస్తే విజయం నల్లేరు మీద బండి నడకలా ఉండనుందని భావిస్తున్నారు.

సంక్రాంతి తరువాత సంపూర్ణ రుణమాఫీ



- 9 గంటల విద్యుత్‌కు చర్యలు
- బోరుబావులకు సోలార్
- వ్యవసాయరంగంలో తెలంగాణకంటే 50 రెట్లు ప్రగతి
- జన్మభూమి సభలో సీఎం

రాజాం(శ్రీకాకుళం),ప్రభ న్యూస్ బ్యూరో: రాష్ట్రంలో రైతులకు 24 వేల కోట్ల రూపాయిల రుణమాఫీ చేస్తామని తెలుగుదేశంపార్టీ ఇచ్చిన హామీని నిలబెట్టుకుందని, దేశంలో ఏరాష్ట్రప్రభుత్వం చేయని విధంగా రుణమాఫీ చేశామని, 1.5 లక్షలరూపాయిల వరకూ రైతు రుణమాఫీ చేపట్టి, 50 వేల రూపాయిల లోపు రుణాలను ఒకేసారి మాఫీ చేయడం జరిగిందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. శనివారం రాజాం మండలం పొగిరి గ్రామంలో నిర్వహించిన జన్మభూమి-మావూరు కార్యక్రమంలో చంద్రబాబునాయుడు పాల్గొన్నారు. ఈరోజు రైతు జన్మభూమి గా ప్రకటించిన నేపథ్యంలోరైతులకు రాష్ట్రప్రభుత్వం ఇంతవరకూ అమలుచేసిన పథకాలు, కార్యక్రమాలు చంద్రబాబునాయుడు వివరించారు. రైతులకుప్రకటించిన రుణమాఫీకి సంబంధించి సంక్రాంతి తరువాత రుణమాఫీ మొత్తం చేయడం జరుగుతుందని, ఎప్పుడు రుణాలను మాఫీచేస్తున్నదీ తేదీలను కూడా ప్రకటించడం జరుగు తుందని తెలిపారు. 2014 ఎన్నికల సమయానికిరైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని, అటువంటి



పరిస్థితులలోరైతుల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు ప్రభుత్వం ముందుకు వెళుతోందని చంద్రబాబు తెలిపారు. అందుకే కష్టాలున్నా రైతు రుణమాఫీ చేయడం జరిగిందని తెలిపారు.రైతులను అన్ని విధాలా ఆదుకునేందుకు రాష్ట్రప్రభుత్వం అనేక చర్యలు చేపడు తోందని చంద్రబాబు వివరించారు. రాష్ట్రంలో 62 నీటిపారుదల ప్రాజక్టులు చేపట్టడం జరిగిందని, వీటిలో 17 ప్రాజక్టులు పూర్తిచేశామని, 26 ప్రాజెక్టులు ఈ సంవత్సరం జూన్ నాటికిపూర్తి చేసుకోవడం జరిగుతుందని తెలిపారు. అన్ని ప్రాజక్టులను పూర్తిచేసుకుని రాష్ట్రంలో ప్రతి ఒక్క ఎకరానికిసాగునీరు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈసంవత్సరం 34 శాతం వర్షపాతం తక్కువగా ఉందని, ఇటువంటి పరిస్థితులలో కూడా నీరందించేందుకు ప్రభుత్వం నదుల అనుసంధానం కార్యక్రమాన్ని చేపట్టిందని, గోదావరి-కృష్ణాజలాలను అనుసంధానం చేయడం జరిగిందని, నాగావళి-వంశధార నదులను అనుసంధానంచేసే పనులు త్వరలోనే పూర్తిచేయడం జరుగుతుందని, శ్రీకాకుళం జిల్లాలో వంశధార-మహేంద్రతనయ నదులను అనుసంధానం చేసి ఇచ్ఛాపురం వరకూ హైలెవెల్ కెనాల్ నిర్మాణానికి చర్యలు చేపట్టడం జరుగుతోందని తెలిపారు. శ్రీకాకుళం జిల్లా రైతాంగం ఉద్యానవనపంటలకు ముఖ్యంగా పండతోటల పెంపకానికి ముందుకు రావాలని చంద్ర బాబు పిలుపునిచ్చారు. అనంతరపురం, చిత్తూరు జిల్లాలలో వర్షపాతం తక్కువగా ఉన్నప్పటికీ, పంట్లతోటల పెంపకంలో ఈ రెండు జిల్లాలు ముందువరసలో ఉన్నాయని తెలిపారు. రైతులకు సోలార్ విద్యుత్ ఉచితంగా సరఫరా చేసేందుకు ప్రభుత్వం ఆలోచిస్తోందని తెలిపారు.అందుకోసం అవసరమైన ఏర్పాట్లుప్రభుత్వం చేస్తోందన్నారు. పలుప్రాంతాలలోరైతులు తమకు ఏడు గంటల విద్యుత్‌సరఫరా చాలటంలేదని పలు చోట్ల విజ్ఞప్తు చేస్తున్న నేపథ్యంలో రైతులకు 9 గంటలు విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని, సంక్రాంతితరువాత రైతులకు అవసరమైతే 9 గంటలపాటు విద్యుత్ సరఫరా చేయడం జరుగుతుందని చంద్రబాబు ప్రకటించారు. గతంలో మనపూర్వీకులు ప్రకృతి సేద్యం చేసేవారని, ఎరువులుగా పేడ తదితర వాటినే వాడి పంటలుపండించేవారని, దానివల్ల ఆరోగ్యంగా కూడా ఉన్నారని చంద్రబాబు తెలియ చేస్తూ, ఇప్పుడు అంతా ఎరువులపంటలు, పురుగు మందుల పంటలు వేస్తుండటంతో అనారోగ్యంతో ఆసుపత్రిపాలవుతూ ఆర్థికంగా కూడా ఇబ్బందులు పడుతున్నారని చంద్రబాబు ప్రజలకు తెలిపారు. అందువల్ల ప్రకృతి సేద్యంపై రైతులు దృష్టిసారించాలని ఆయన పిలుపునిచ్చారు.ప్రకృతి సేద్యం ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికేపలుప్రాంతాలలో చేస్తుండటం తోప్రపంచ వ్యాప్తంగా గుర్తింపుపొందామని, పారిస్‌లో దీనిపై ఆంధ్రప్రదేశ్ అవార్డు కూడా పొందిందని తెలిపారు. గ్రామాలలో చెత్తనుంచి సంపదను సృష్టించే చర్యలలో భాగంగా ప్రభుత్వమే నేరుగా గ్రామాలలో ఇంటింటికీ సిబ్బందిని పంపించి చెత్తను, పేడను అన్నింటినీ సేకరించి, వాటిని ఎరువుగా తయారుచేసి రైతులకు అందించడం జరుగుతుందని తెలిపారు. వర్షపు నీటిని వృధాగా పోనీయ కుండా కుంటలుతవ్వి భూమిలోకి నీరుపోయే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని, పొలాలలో కూడా ఇందుకోసం ప్రత్యేక కుంటలు తవ్వుకోవాలని పిలుపునిచ్చారు.

గత నాలుగున్నర సంవత్సరాలుగా వ్యవసాయరంగం అభివృద్ధికి తీసుకుంటున్న చర్యల కారణంగా రాష్ట్రం వ్యవసాయరంగంలో గణనీయమైన అభివృద్ధి సాధించిందని, రాష్ట్రం 11 శాతం వృద్ధిరేటు వ్యవసాయరంగంలోసాధించగా, తెలంగాణాలో ఈ రంగంలో వృద్ధిశాతం కేవలం 0.2 శాతంమాత్రమే ఉందని, తెలంగాణాకంటే ఆంధ్రప్రదేశ్ 50 రెట్లు అధికంగా వృద్ధి సాధించామని చంద్రబాబు తెలిపారు. జాతీయస్థాయిలో కూడా వ్యవసాయ రంగంలో వృద్ధిరేటు కేవలం 2.4 శాతంమాత్రమే ఉందని తెలిపారు. రైతులకు ఎంతో చేస్తామని చెప్పిన ప్రధాని మోడీ రైతులకు ఏమీ చేయలేదని, ఇచ్చిన హామీలను చేశారా అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు.

అంతకు ముందు కేంద్ర మాజీ మంత్రి అశోకగజపతి రాజు మాట్లాడుతూ, ప్రపంచంలోని ప్రజాస్వామ్య దేశాలలో ఎక్కడా జరగని విధంగా రాజ్యాంగపరంగా ఇచ్చిన హామీలనుఅమలు చేయాలని ఎంపిలు కోరితే వారిని సస్పెండ్ చేయడం మనదేశంలోనే జరిగిందని కేంద్రప్రభుత్వంపై విమర్శించారు. కేంద్రం ఇచ్చిన హామీలుఅమలు చేయమని తెలుగుదేశం ఎంపిలు ఇంటా, బయటా పోరాడుతున్నారని ఆయన తెలిపారు. కోడికత్తి డ్రామాను మరో మలుపు తిప్పే విధంగా కేంద్రం ఈ కేసును ఎన్ఐఎకు అప్పగించడం విచిత్రంగా ఉందని, రాష్ట్రాల హక్కులను కేంద్రం ఈవిధంగా కాలరాస్తోందని ధ్వజమెత్తారు. రాష్ట్ర మాజీ మంత్రి, రాజాం నియోజక వర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ కోండ్రు మురళీమోహన్ తదితరులు ఈ సభలో ప్రసంగించారు.

నన్ను చంపేందుకు తెదేపా కుట్ర!

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి హోదాలో ఉండి బీజేపీ నేతలను హౌస్‌ఆరెస్ట్‌చేయించి ఓ మహిళను నడిరోడ్డు మీద ఫినిష్ చేస్తామని హెచ్చరించడం ఏమిటని ప్రశ్నించారు. చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు ఒకరోజు గడవక ముందే నన్ను చంపటానికి టీడీపీ వాళ్ళు వచ్చారని ఆరోపించారు. చంద్రబాబు, లోకేష్ ఆదేశాల మేరకే నాపై హత్యాయత్నానికి పాల్పడ్డారని విమర్శించారు. జరిగిన ఘటనపై కేంద్ర హోంశాఖకు ఫిర్యాదు చేస్తామన్నారు. గతంలో అమిత్‌షా, ప్రతిపక్ష నాయకుడు జగన్, పవన్‌లపై కూడా హత్యాయత్నానికి ప్రయత్నించారని విమర్శించారు. గవర్నర్ రాష్ట్ర పరిస్థితులపై దృష్టి సారించి శాంతిభద్రతలు కాపాడాలని కన్నా కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తాళ్ళ వెంకటేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మోడీ... నీ గారడీ చెల్లదు!

(మొదటిపేజీ తరువాయి)



రాష్ట్రప్రజలను మోసగించిందని ధ్వజమెత్తారు. రాష్ట్ర విభజనబిల్లులోని అంశాలను అమలుచేయమని ప్రభుత్వం నాలుగు సంవత్సరాలపాటు కేంద్రాన్ని కోరినా పట్టించుకోలేదని, ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామంటూ చెప్పి, అదికూడా ఇవ్వకుండా రాష్ట్రానికి అన్యాయం చేయడంతోపాటు మనల్ని అవమానపరిచిందని, అందుకే కేంద్ర ప్రభుత్వం నుంచి వైదొలగాలని నిర్ణయించి కేంద్రమంత్రి అశోక్‌గజపతిరాజుకు చెప్పగా, ఒక్క నిమిషం కూడా ఆలోచించకుండా ఆయన పదవికి రాజీనామా చేశారని, అలా నిస్వార్థంగా రాష్ట్రప్రయోజనాల కోసం పదవులను కూడా త్యాగం చేశారని చంద్రబాబునాయుడు అన్నారు. రాష్ట్రానికి న్యాయం చేయమని తెలుగుదేశం ఎంపీలు పోరాడుతుంటే వారి ఇళ్లపై ఐడి దాడులు చేయిస్తున్నారని, రాజ్యాంగ వ్యవస్థలను మోడీ భ్రష్టుపట్టిస్తున్నారని , చివరకు రాష్ట్రాల హక్కులను కూడా కాలరాసే విధంగా జగన్‌పై కోడికత్తి దాడి కేసు ఎన్ఐఎకు అప్పగించారని చంద్రబాబు మండిపడ్డారు. ఇది ఫెడరల్ వ్యవస్థకు విఘాతం కలిగించేచర్య అని బాబు దుయ్యబట్టారు. ప్రధానమంత్రి స్థాయిలో ఉన్నవారు చివరకు అబద్ధాలు కూడా ఆడుతున్నారని ఆయన విమర్శించారు. ఆయన పార్టీ నాయకులు చెప్పింది విని ఇటువంటి స్థాయికి దిగారని విమర్శించారు. పోలవరం ప్రాజక్టు నిర్మాణం 2018లో దేశంలోని ఇతర జాతీయ ప్రాజక్టులకంటే బాగా నిర్మించినందుకు కేంద్రప్రభుత్వ సంస్థ అవార్డు ఇస్తే, పోలవరం నిర్మాణంలో కూడా అవినీతి జరిగినట్లుగా ప్రధానమంత్రి చెపడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇదే కేవలం కక్షసాధింపు చర్యలేనని చంద్రబాబు విమర్శించారు.

కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తామన్నవి ఒక్కటి కూడా అమలుచేయలేదని, ప్రత్యేకహోదా, రైల్వేజోన్, విద్యాసంస్థల ఏర్పాటు, కడప ఉక్కుఫ్యాక్టరీ, వెనుకబడిన జిల్లాలకు ఆర్థిక సహాయం ఇలా ఏఒక్కటీ అమలుచేయకుండా ఇప్పుడు అబద్ధాలు చెప్పేందుకు కూడా వెనుకాడటంలేదని ఆయన మోడీని విమర్శించారు. రఫేల్ యుద్ధవిమానాల కుంభకోణంలో అవినీతి బయట పడుతోందని, బ్యాంకులను లూఠీ చేయించిన వారిని విదేశా లకు పంపించారని,ఇప్పుడు అవినీతి కేసులలో ఉన్నవారితో స్నేహం చేసేందుకు సిద్ధపడుతున్నారని, బిజెపి ప్రభుత్వ తీరు ఏమిటో ప్రజలు అర్థం చేసుకుంటున్నారని ఆయన విమర్శించారు. మోడీ ప్రభుత్వం చేపట్టిన చర్యలుఏమాత్రం కూడా దేశప్రజలకు ఉపయోగపడలేదని, పెద్దనోట్ల రద్దు విషయంలో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని, పెద్దనోట్లు రద్దు చేయమని తాను చెబితే, 2 వేల రూపాయిల నోట్లు కొత్తగా తీసుకురావడం అవినీతిని ప్రోత్సహించడమేనని చంద్రబాబు అన్నారు.

జీఎస్‌టి వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ కుంటుపడిందని విమర్శించారు. పెట్రోలు, డీజిల్ ధరలు పెరిగిపోయాయని, అన్ని వర్గాల ప్రజలు అసంతృప్తితో ఉన్నారని విమర్శించారు. అదే విధంగా త్రిపుల్ తలాక్ విషయంలో కేంద్రం ముస్లింల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరించిందని ఆయన విమర్శించారు.రాష్ట్రాల మధ్య తగవులుపెట్టి ప్రయోజనం పొందాలని మోడీ ప్రభుత్వం చూస్తోందని, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల మధ్య నీటితగవులు, అదే విధంగా తెలంగాణా, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య తగవులుపెట్టేందుకు కూడా కేంద్రం వెనుకాడటంలేదని చంద్రబాబు విమర్శించారు.

సిబిఐ కేసులతో భయపడుతున్న జగన్మోహనరెడ్డిని మోడీ మరింత భయపెడుతూ తమ ప్రభుత్వంపై ఉసిగొలుపుతున్నారని, అందులో భాగమే కోడికత్తి డ్రామా అని ఆయన విమర్శించారు. అది రక్తికట్టకపోవడంతో ఇప్పుడు ఎన్ఐఎతో దర్యాప్తు అంటూ మరో కొత్త డ్రామా ఆడుతున్నారని విమర్శించారు. నరేంద్రమోడీ మాటల గారడీతో 2014 ఎన్నికల్లో కేంద్రంలోబిజెపి అధికారంలోకి వచ్చిందని, ఇప్పుడు ఆ మాటల గారడీ చెల్లదని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు మోడీ మాటలు వినే పరిస్థితి లేదని చంద్రబాబు తెలిపారు.

ఈ సభలో కేంద్ర మాజీ మంత్రి అశోకగజపతిరాజు, రాజాం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్, మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్ ప్రసంగించారు. సభలో మంత్రులు అచ్చెన్నాయుడు, కళావెంకటరావు, ఎంపి రామ్మోహన నాయుడు, జిల్లా కలక్టర్ ధనంజయరెడ్డి, శ్రీకాకుళం డివిజన్ జన్మభూమి ప్రత్యేక అధికారి పి.లక్ష్మీనృశింహం తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు జిల్లా... ఎవరికో ఖిల్లా!


- ఆధిక్యం కోసం తెదేపా ఆరాటం
- పట్టు నిలుపుకోవడానికి వైకాపా పోరాటం
- జనసేన రాకతో ఇద్దరికీ ఇరకాటం
- మెజారిటీ స్థానాలలో త్రిముఖ పోటీకి అవకాశం

తిరుపతి , ప్రభ న్యూస్ రాయలసీమ బ్యూరో: గత శతాబ్దకా లంలో ఇద్దరు ముఖ్యమంత్రులను రాష్ట్రానికి అందించిన చిత్తూరు జిల్లా కీలక రాజకీయ సమరానికి సన్నద్ధమౌతోంది. జిల్లాపై 20 ఏళ్ళక్రితం కోల్పోతిన ఆధిక్యాన్ని సాధించడానికి అధికార తెలుగుదేశం పార్టీ ఆరాటపడుతుండగా, కొనసాగుతున్న పట్టును నిలుపుకోవడానికి ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పోరాటానికి సిద్ధమౌతోంది. అనూహ్యంగా చాపకింద నీరులా విస్తరిస్తున్న జనసేన పార్టీ ఎన్నికల నాటికి ఈ రెండు పార్టీలను ఇరకాటంలో పడేలా చేయగలిగే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ క్రమంలో జిల్లాలోని మెజారిటీ నియోజకవర్గాలలో ఈ మూడు పార్టీల నడుమ త్రిముఖ పోరు తపనిసరయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలోని పలు జిల్లాల లాగే తొలి నుంచి కాంగ్రెస్ పార్టీ కంచుకోటగా పేరొందిన చిత్తూరు జిల్లాను 80వ దశకం ఆరంభంలో పుట్టిన తెలుగుదేశం పార్టీ తన అధీనంలోకి తెచ్చుకోగలిగింది.




అమరనాథ్‌రెడ్డి

1983 ఎన్నికలలో జిల్లాలోని 15 స్థానాల్లో గెలిచిన తెలుగుదేశం పార్టీ బలం 1985 ఎన్నికలలో 10కి తగ్గినా ఆధిక్యతను కొనసాగించింది. 1989 ఎన్నికలలో 10 స్థానాలను గెలుచుకున్న కాంగ్రెస్ పార్టీని 1994వ ఎన్నికలలో ఒక స్థానానికి పరిమితం చేయగలిగింది. కానీ వరుసగా 1999, 2004, 2009 సంవత్సరాలలో జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని అధిగమించలేక పోయింది. చివరిగా 2014లో జరిగిన ఎన్నికలలో మొత్తం 14 స్థానాలలో 8 స్థానాలను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గెలుచుకోగలిగింది. ఒక విధంగా 1994 ఎన్నికల తర్వాత నుంచి జిల్లాలో మెజారిటీ స్థానాలను దక్కించుకోవడానికి తెలుగుదేశం పార్టీ ప్రయత్నించి విఫలమౌతూనే ఉంది. ఈ నేపథ్యంలో 2019 లో జరగనున్న ఎన్నికలలో ఆధిక్యాన్ని సాధించాలనే ఆరాటంతో ఆ పార్టీ సర్వశక్తులను ఒడ్డేందుకు సిద్ధమౌతోంది. తాజా రాజకీయ పరిణామాల ప్రకారం నగిరి, శ్రీకాళహస్తి, చంద్రగిరి, పీలేరు, మదనపల్లె, చిత్తూరు, పుంగనూరు, మదనపల్లె, పూతలపట్టు నియోజకవర్గాలలో కొత్తముఖాలు ఆ పార్టీ తరపున పోటీ చేసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. తంబళ్ళపల్లె, సత్యవేడు, తిరుపతి స్థానాలలో గణనీయమైన డిమాండ్ కనిపి స్తోంది. మిగిలిన రెండు స్థానాలలో పలమనేరు నుంచి మంత్రి అమ నాథరెడ్డి పోటీ ఖరారు కాగా, కుప్పం నుంచి చంద్రబాబునాయుడు కానీ, ఆయన కుమారుడు లోకేష్ కానీ పోటీ చేస్తారనే ప్రచారం వినిపిస్తోంది. దాదాపు 6 రకాల మార్గాలలో సర్వేలు చేయిస్తున్న తెలుగు దేశం అధినేత చంద్రబాబు అభ్యర్థుల ఎంపికలో ఆచితూచి వ్యవహరించడం పై దృష్టి సారిస్తున్నారు. ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్ఆర్, కాంగ్రెస్ పార్టీ విషయానికి వస్తే కుప్పం నియోజకవర్గం నుంచి గత ఎన్నికలలో పోటీ చేసిన చంద్రమౌళి అభ్యర్థిత్వాన్ని ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ ఇదివరకే ప్రకటించారు. తాజాగా సత్యవేడు నియోజకవర్గ అభ్యర్థిత్వానికి గతంలో పోటీ చేసి ఓడిపోయిన ఆదిమూలం పేరును ఖరారు చేసినట్లు ఆ పార్టీ పరిశీలకుడు నేదుమల్లి రామ్ కుమార్‌రెడ్డి ప్రకటించారు. ఇతర స్థానాలలో పుంగనూరు, చంద్రగిరి, నగిరి, పీలేరు, మదనపల్లె, గంగాధర్‌నెల్లూరు, తిరుపతి, చిత్తూరు స్థానాలలో పాతవారే తిరిగి పోటీ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. పూతలపట్టు, తంబళ్ళపల్లె, పలమనేరు, శ్రీకాళహస్తి స్థానాలలో కొత్తవారు పోటీ చేస్తారనే ప్రచారం కనిపిస్తుంది. ఎట్టి పరిస్థితుల్లో



పెద్దిరెడ్డి



చంద్రబాబు స్వంత జిల్లా పై తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడంతో పాటు పెంచుకోవాలనే లక్ష్యంతో ఆ పార్టీ ప్రతి ష్టాత్మంగా పోరాడేందు కు సన్నాహాలు చేస్తోంది. ఇక పవన్‌కల్యాణ్ నేతృత్వంలోని జనసేన పార్టీ జిల్లా వ్యాప్తంగా చాపకిందనీరులా విస్తరిస్తోంది. ఆ పార్టీ తరపున జరిగే కార్యక్రమాల ద్వారా తిరుపతి, శ్రీకాళహస్తి, పీలేరు, మదనపల్లె, చిత్తూరు, చంద్రగిరి, తంబళ్ళపల్లె నియోజకవర్గాలలో జనసేన పట్టు విస్తరిస్తోంది. ఇతర స్థానాలలో కూ డా తమ బలాన్ని పెంచు కోగలమనే ధీమా ఆ పార్టీ వర్గంలో కనిపి స్తోంది. జిల్లా వ్యాప్తంగా త్వరలో నియమితులయ్యే నియోజకవర్గాల ఇన్‌చార్జిల నేతృత్వంలో తమ బలాన్ని ప్రదర్శించడానికి జన సైనికులు ఉత్సాహపడుతున్నారు. ఆశించిన రీతిలో ఆ పార్టీకి పెరిగే వర్గబలం మెజారిటీ స్థానాలలో అటు తెలుగుదేశం పార్టీని ఇటు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని ఇరకాటంలో పెట్టే సూచనలు మాత్రం స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో జిల్లాలోని 14 స్థానాలలో కనీసం 10 స్థానాలలో తీవ్రమైన త్రిముఖ పోటీ అనివార్యంగా కనిపిస్తోంది. ఇతర పార్టీల విషయానికి వస్తే జనసేన పొత్తుతో ఒకటి రెండు స్థానాలను గెలుచుకోగలమనే ధీమాను వామ పక్షాలు వ్యక్తం చేస్తుండగా పూర్వ వైభవాన్ని సంతరించుకోవ డానికి కాంగ్రెస్ పార్టీ అదృష్టాన్ని మరోసారి పరీక్షించుకోవడానికి బీజేపీ కూడా స్వరసన్నద్ధమౌతున్నాయి. మొత్తం మీదు మరో మూడు నాలుగు నెలలో ఎన్నికలు జరిగే అవకాశాలున్నా ప్రస్తుత నేపథ్యంలో జిల్లాలోని మెజారిటీ స్థానాలలో తెలుగుదేశం, వైఎస్ఆర్ కాంగ్రెస్, జనసేన పార్టీల మధ్య గట్టి పోటీ తీవ్రంగా సాగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.



సీఎస్ దంపతులకు అమ్మవారి నూతన సంవత్సర క్యాలెండర్ బహూకరిస్తున్న ఆలయ ఈవో

ఇంద్రకీలాద్రిపై సరస్వతీ యాగం

అమరావతి, ఆంధ్రప్రభ : బెజవాడ ఇంద్రకీలాద్రిపై శనివారం సరస్వతీ యాగాన్ని వైభవంగా నిర్వహించారు. దేవస్థానం మెట్ల వద్ద యాగశాలలో వైభవంగా ప్రత్యేక పూజలను నిర్వహించారు.ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు విద్యార్థులకు కలం,అమ్మ వారి పాకెట్ ఫోటో,కంకణం,ప్రసాదం అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వి.కోటేశ్వరమ్మ, వేద పండితులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

భవానీ దీక్షల హుండీల లెక్కింపు

భవానీ దీక్షలకు సంబంధించిన హుండీలను (రెండో రోజు) శనివారం ఈవో కోటేశ్వరమ్మ ,పాలక మండలి చైర్మన్ గౌరంగబాబు పర్యవేక్షణలో సిబ్బంది లెక్కించారు. రూ.1,32,73,265 నగదు, 265 గ్రాముల బంగారం, 13.100 గ్రాముల వెండి లభించిందని ఈవో కోటేశ్వరమ్మ తెలిపారు.

అమ్మ వారి సేవలో సీఎస్ దంపతులు

మూల నక్షత్రం రోజును పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్‌చంద్ర పునేఠ దంపతులు, కుటుంబ సభ్యులు శనివారం కనక దుర్గమ్మ ఆలయాన్ని సందర్శించి, ప్రత్యేకపూజలు నిర్వహించారు. ప్రకారం పునేఠ దంపతులకు ఈవో, అధికారులు స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఈవో , అనిల్‌చంద్ర పునేఠ దంపతులకు అమ్మ వారి క్యాలెండర్,ప్రసాదం అందజేశారు.



గేలిచేసిన చోట... గెలుపుబాట!

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. రిస్క్ చేయకపోతే కొత్తదనం రాదని, అటువంటి రిస్క్ జనసేన పార్టీ చేస్తుందన్నారు. జిల్లాల వారీ సమీక్షా సమావేశాల్లో భాగంగా శనివారం విజయ వాడలోని జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ప్రకాశం, చిత్తూరు జిల్లాల నాయకులు, కార్యకర్తలతో పవన్ కల్యాణ్ విడివిడిగా సమావేశమై దిశానిర్ధేశం చేశారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ '' వస్తున్న ఎన్నికలు మనకు మొదటి ఎన్నికలో, చివరి ఎన్నికలో కాదు..ప్రారంభం మాత్రమే, భవిష్యత్ మాత్రం జనసేన పార్టీదేనని స్పష్టంచేశారు. '' ప్రజారాజ్యం పార్టీ ఆవిర్బావానికి బలమైన పాత్ర పోషించిన వారిలో నేనూ ఒకడిని.. డబ్బు ప్రభావం లేని రాజకీయాలు చేయాలన్న లక్ష్యంతోనే పార్టీ ఏర్పాటయింది. చిరంజీవి లాంటి ప్రజాధరణ ఉన్న వ్యక్తి వస్తే అవినీతి అంతమవుతుందని, సామాజిక న్యాయం జరుగుతుందని ఆనాడు ప్రజలు ఆకాంక్షించారు..అయితే అదిపక్క దారి పట్టిందని అన్నారు. ఆనాడు పీఆర్పీలోకి వచ్చిన వారంతా పదవీ వ్యామోహంతో వచ్చిన వారే.. అందు వల్ల జనసేన పార్టీ నిర్మాణంలో నేను ఆచితూచి ముందుకు వెళ్తున్నానని స్పష్టంచేశారు. ప్రజారాజ్యం పార్టీ పీఆర్పీ అనుభవాలు దృష్టిలో ఉంచుకుని నేను పార్టీ కమిటీల నియామకానికి తొందరపడలేదన్నారు. రాత్రికి రాత్రే రాజకీయాల్లో ఎవరూ ఎదగలేరు..కనీసం పాతికసంవత్సరాలు ఓపిక పట్టాలి..సమస్యలు, అవసరాలు ఎక్కడ ఉంటాయో ఆ ప్రాంతంలో మనం ప్రజలకు అండగా నిలబడితే ప్రజలే మనల్ని ఆదరిస్తారన్నారు.

జనసేన ఇంకా ప్రారంభ దశలోనే ఉంది..సంస్థాగతంగా గట్టి పడడానికి మరింత సమయం పడుతుందని పేర్కొన్నారు. నీటి కోసం బోరు వేసినప్పుడు తొలుత రాళ్లు,మట్టి, బురద నీరే వస్తాయి. ఆ తర్వాతే స్వచ్ఛమైన నీరు వస్తుంది.. అదే విధంగా కాలం గడుస్తున్న కొద్దీ జనసేన మరింత స్వచ్ఛత సంతరించు కుంటుందని స్పష్టంచేశారు. పాలకులు చేసిన తప్పిదాల వల్ల తెలంగాణ ఉద్యమం ఉద్భవించి రాష్ట్రం రెండుగా విడిపో యిందీ..ఎవరెవరో చేసిన తప్పులకి అమాయకులైన ప్రజలు శిక్ష అనుభవిస్తున్నారని అన్నారు. సొంత రాష్ట్రంలోనే పరా యివాళ్లుగా మిగిలిపోయే పరిస్దితులు వచ్చాయి.. ఫలితంగానే జనసేన ఆవిర్బవించిందని అన్నారు. భావజాలం లేని పార్టీలు రాజ్యాలు ఏలుతున్న తరుణంలో కొత్త పార్టీ పెట్టడానికి సమయం ఆసన్నమైందని నాకు అనిపించింది. నేను సినిమాల్లోకి రాక ముందు నుంచి సమాజాన్ని క్షుణ్ణంగా అర్ధం చేసుకోవడం ప్రారంభించాను.. కళా శాల నుంచి పట్టాలు తీసుకోకపోయినా , పొలిటికల్ సైన్స్, పబ్లిక్ పాలసీలు, దేశంలో కులాలు వాటి ప్రభావం అంబేద్కరిజం వంటి వాటిని సంపూర్ణంగా అర్ధం చేసుకున్నాను.

ఆ తర్వాతే పార్టీని ఏర్పాటు చేశానని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. రాజకీయాలు వ్యాపారంగా మారిపోతే సేవా భావం క్షీణిస్తుంది..ప్రజల పెన్షన్లు,రేషన్‌కార్డులు వంటి సమస్యలు పరిష్కరించే ఓపిక కూడా నేతల్లో కనిపించడంలేదని అన్నారు. ప్రకృతి వైపరీత్యాలు ,కులాలు,మతాల్ని చూసి నష్టాన్ని కలిగించవు.. అన్ని కులాల వారు ప్రకృతి దృష్టిలో సమానమే.. అన్ని కులాలు ఐక్యంగా పనిచేసే సందర్భాలు ఉంటాయి. అటువంటిదే జనసేన అని పేర్కొన్నారు. 2014 ఎన్నికలలో రాష్ట్ర సమగ్రత కోసం తెలుగుదేశాన్ని సపోర్టు చేస్తే 2019 ఎన్నికల్లో రాష్ట్రం లో సమతుల్యత కోసం అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని జనసేనాని స్పష్టంచేశారు. వ్యక్తిగతంగా ప్రజాబలం ఉన్న వ్యక్తులు జనసేనలోకి వస్తే, వారికి జనసేన బలం తోడై విజయానికి చేరువవుతారు.

అటువంటి వారికి నా బలం ఎప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. ప్రస్తుత భారత రాజకీయాల్లో మధ్యే మార్గం (మిడిల్ పాత్) అవసరం..ఆ మిడిల్ పాత్ జనసేన పార్టీ .. ప్రజలందర్నీ కలిపే విధంగా ఒక ఉమ్మడి సిద్దాంతం కావాలన్నారు.. రాజమండ్రి, అనంతపురం కవాతులు అఖండ స్థాయిలో విజయం కావడానికి ప్రజల్లో జనసేన పట్ల ఉన్న ప్రేమాభిమానాలే కారణమని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. అవసరాలు ఎక్కడ ఉంటాయో.. సమస్యలు ఎక్కడా ఉంటాయో అక్కడ మనం ప్రజలకు అండగా ఉంటే ప్రజలు మనల్ని ఆదరిస్తారని అన్నారు. నాకు సినిమాల్లో నటన సంపూర్ణంగా ఎప్పుడూ సంతృ వచ్చే ఎన్నికల్లో 60 శాతం మంది కొత్త వ్యక్తుల్ని ఎన్నికల బరిలోకి నిలుపుతామని అన్నారు. ముఖ్యంగా ప్రకాశం జిల్లా వంటి ప్రాంతంలో దీన్ని తూ.చ. తప్పకుండా పాటిస్తామన్నారు. రాజకీయాలంటే చిన్ననాటి నుంచి ఉన్న మక్కువే దీనికి కారణం అన్నారు. జనసేనను ప్రజల్లోకి తీసుకువెళుతున్న వారు యువకులు, మహిళేనని గట్టిగా చెప్పగలనని పవన్‌కల్యాణ్ అన్నారు.

జెండారే... జెండా
పవనన్న జెండా!

- ఉర్రూతలూగిస్తున్న ప్రత్యేక పాట
- పార్టీ మేనిఫెస్టోను ప్రతిబింబిస్తూ రూపకల్పన



అమరావతి,ఆంధ్రప్రభ: ''జెండరే ..జెండా.. ఇది జనసేన జెండా.. భారత మాత ముద్దు బిడ్డ పవనన్న జెండా..ఇది తెలుగోడి జెండా.. నీతి కొరకు, జాతి కొరకు పుట్టిన జెండా.. తెలంగాణ గడ్డ మీద పాతిన జెండా..ఆంధ్ర రాష్ట్ర అభి వృద్ధికి అండా దండా..నవ సమాజ నిర్మాణానికి పిలుపే ఈ జెండా.. కార్మికుల, కర్షకులకు అండ ..దండా ఈ జెండా.. '' అంటూ సాగిన జనసేన పార్టీ విడుదల చేసిన ప్రత్యేక పాట కార్య కర్తలను అభిమానులను ఉత్తేజపరుస్తోంది.

రాబోయే ఎన్నికల లక్ష్యంగా జనసేన పార్టీ కార్యకర్తలను,అభిమానులను మరింత ఉత్సాహపరిచేందుకు శనివారం ఈ ప్రత్యేక పాటను విడుదల చేసింది. రానున్న ఎన్నికలకు సమరశంఖం పూరించిన పవన్‌కల్యాణ్ ఇప్పటికే పార్టీ బలోపేతానికి రాష్ట్ర మంతటా పర్యటిస్తున్నారు. మరో వైపు జిల్లా నేతలు,కార్యకర్తలతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ ఎన్నికల సమరానికి సన్న ద్ధం చేస్తూ ముందుకు దూసుకు పోతున్నారు.ఈ క్రమంలో విడుదలైన ఈ ప్రత్యేక పాట పార్టీ శ్రేణులను,అభిమానులను విశేషంగా ఆకట్టు కుంటోంది. పార్టీ మేనిఫెస్టోను ప్రతిబింబిస్తూ రూపొం దించిన ఈ పాట జనాలను సైతం విశేషంగా ఆలోచింపజేస్తూ ఆదరగొడుతోంది.

జనసేనలోకి బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి

విశాఖపట్నం, ప్రభన్యూస్ బ్యూరో: ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి, ఆసంఘం పొలిట్ బ్యూరో సభ్యులు ఎన్ని శ్రీనివాసరావు జనసేన పార్టీలో చేరారు. శనివారం విజయవాడలో ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ సారధ్యంలో శ్రీనివాసరావు తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా పవన్‌కళ్యాణ్ మాట్లాడుతూ పార్టీ ఆశయ సిద్దాంతాలకు అనుగుణంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. దీంతో పాటు జనసైనికులను సమన్వయం చేసుకొని ఆయా కార్యక్రమాలను కొనసాగించాలని ఆకాంక్షించారు. తదుపరి ఎన్ని శ్రీనివాసరావు మాట్లాడు తూ అందరి సహాయ సహకారాలుతో జనసేన పార్టీని భీమిలి నియోజకవర్గంలో బలోపేతం చేస్తామన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేయడంతో పాటు ఆయా సమస్యలను ఎప్పటికప్పుడు పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి వాటికి పరిష్కారం చూపించే విధంగా ముందుకు సాగుతామన్నారు. నియోజకవర్గం పరిదిలోని నాలుగు మండలాల్లో పార్టీ అభిమానులు, జనసైనికులను సమన్వయం చేసుకుంటూ అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందన్నారు. ఎన్ని



శ్రీనివాసరావు జనసేన పార్టీలో చేరడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

మన సంస్కృతీ సంప్రదాయాలు...
భవిష్యత్ తరాలకు తరగని సంపద!

- మహనీయుల త్యాగాలను పిల్లలకు వివరించాలి
- గ్రామీణులకు సేవలందించడానికి వైద్యులు ముందుకు రావాలి
- రంగరాయ వైద్య కళాశాల వజ్రోత్సవంలో వెంకయ్యనాయుడు



(కాకినాడ, ఆంధ్రప్రభ ప్రతినిధి): ఆంగ్లేయుల పాలనలో భారతీయ మూలాల్ని వదిలేశాం... దేశానికి స్వాతంత్రమొచ్చి ఏడు దశాబ్దాలు దాటింది ఇంకా మన భారతీయతను విస్మరించడం సహేతుకం కాదని ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. మన భారతీయ మూలాలు, సంస్కృతి, సంప్రదాయాల్ని భవిష్యత్ తరాలకు తెలియజెప్పాలన్నారు. అప్పుడే భారతీయత తరతరాలు ఫరిడవిల్లుతుందన్నారు. కాకినాడ రంగరాయ వైద్య కళాశాల ప్రాంగణంలో శనివారం నిర్వహించిన కళాశాల వజ్రోత్సవం. కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం రామ్ కోసా స్వర్ణోత్సవ వేడుకలకు ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి తల్లి దండ్రులు తమ పిల్లలకు మన సంస్కృతి సాంప్రదాయాలు పాటు మూలాలను తెలియజేస్తూ మన దేశ చరిత్ర మహనీయుల త్యాగాలను పిల్లలకు వివరించాలన్నారు. విద్యావిధానంలో సమూల మార్పులు తీసుకురావాలన్నారు . పూర్వ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ ఆర్ ఎం సి భవనాన్ని ప్రారంభించడం అలాగే ప్రఖ్యాత శాస్త్రవేత్త జేబీఎస్ ఆస్టిన్ తన పార్థివ దేహాన్ని పరిశోధన నిమిత్తం కళాశాలకు అందించడం అపూర్వ ఘట్టాలని ఎంతో ఘన చరిత్ర కలిగిన రంగరాయ కళాశాల వైద్య విద్యలో నాణ్యత నూతన ప్రమాణాలతో ఎన్నో గ్రాడ్యుయేట్ పిజి సూపర్ స్పెషాలిటీ కోర్సులతో ముందుకు సాగడం అభినందనీయమన్నారు. అలాగే ఆర్ఎంసి విద్యార్థులు వైద్య రంగంలోనే కాకుండా రాజకీయ వ్యాపార విద్య రంగాలతోపాటు సివిల్ సర్వీసుల్లో రాణించడం పై హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం చాలామంది సంపాదన ధ్యేయంగా వృత్తి వ్యాపారాలలో అనేక ఒత్తిడితో ఉన్నారని వీటిని అధిగమించేందుకు ప్రతి ఒక్కరూ యోగ ఆటపాటలలో పాల్గొనడం ద్వారా మానసిక ప్రశాంతతకు దోహదపడుతుందన్నారు.

కళాశాలకు చెందిన ఎన్ఆర్ఐ విద్యార్థులు కళాశాల అభివృద్ధికి ఆర్థికంగా సహాయం అందించడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. సమాజ ఏకమై పరమావధిగా గ్రామీణ పేద ప్రజలకు వైద్యులు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని వేంకయ్యనాయుడు ఆకాంక్షించారు. ఉన్నత విద్య ఉద్యోగాల కై విదేశాలకు వెళ్లిన సంపాదించిన అనంతరం వచ్చి స్వదేశంలో ప్రజలకు వారి కుటుంబాలకు సేవలందించాలని విద్యార్థులను కోరారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు న్యాయమైన వైద్య సహాయాన్ని అందించేందుకు వైద్యులు సేవా దృక్పథంతో ముందుకు రావాలని వెంకయ్యా నాయుడు కోరారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల ప్రకారం ప్రతి వెయ్యి మందికి ఒక వైద్యుడు ఉండాలని ఇందుకోసం ప్రతి జిల్లాలో ఒక వైద్య కళాశాల ఒక సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్య లతో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అంటురోగాలను అరికట్టడంలో మనం విజయం సాధించిన జీవనశైలిలో వచ్చే రక్తపోటు డయాబెటిస్ ఒబేసిటీ గుండె జబ్బులు దేశంలో దశాబ్ద కాలంగా పెరగడంతో తీవ్ర ఆందోళన కలిగిస్తుంది అన్నారు. ఆరోగ్యప్రదమైన ఆహార నియమాల వివరాలను ప్రతి ఒక్కరికి తెలియజేస్తూ ప్రతి ఒక్కరిని ఆరోగ్యవంతులుగా చూడాలన్నారు. స్వాతంత్రం వచ్చి 70 ఏళ్లయినా నేటికీ దేశంలో 20 శాతం మంది ప్రజలు పేదరికంలోనే మగ్గుతున్నారని 21 శాతం మంది నిరక్షరాస్యులుగా ఉన్నారన్నారు. వీటన్నింటిపైనా మనమంతా సమిష్టిగా పోరాడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ప్రధాని నరేంద్ర మోడీ చేపట్టిన సరళతర విధానాలతో యావత్ ప్రపంచం దృష్టి భారతదేశం పైనే ఉందని కోరుకుంటూ ప్రపంచ బ్యాంకు ప్రపంచ ఎకనామిక్ ఫారం ఆసియా అభివృద్ధి బ్యాంకు ఐఎంఎఫ్ మూడు రేటింగ్స్ తెలియ చేస్తున్నాయన్నారు.

ప్రతి పని ప్రభుత్వమే చేయాలన్న ధోరణి నుంచి ప్రజలు బయటకు రావాలని సమాజ అభివృద్ధికి మన వంతు బాధ్యతలను గుర్తిస్తూ చిత్తశుద్ధితో పనిచేయడంతో పాటు మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే పర్యావరణాన్ని సంరక్షించుకోవాలని వెంకయ్య నాయుడు సూచించారు. అనంతరం కళాశాల అభివృద్ధికి సేవలు అందించిన డాక్టర్ సుందర శివరావు విగ్రహాన్ని ఆర్ ఎన్ సి రామ్ కోసా జిల్లా రెడ్ క్రాస్ భవనం శిలాఫలకాలను ఆవిష్కరించారు. ముందుగా ఈ ఉత్సవాలపై ప్రత్యేకంగా రూపొందించిన ఆర్ ఎం సి థీమ్ సాంగ్ సి డి తో పాటు వజ్రోత్సవ వేడుకల సీడీని ప్రత్యేకంగా ప్రచురించిన సావనీర్ ను అలాగే డాక్టర్ జి సురేంద్ర రూపొందించిన ఆంధ్ర చరిత్ర డాక్యుమెంటరీని వెంకయ్య నాయుడు ఆవిష్కరించారు.వేద కాలం నుంచీ తోటి వారితో అనురాగాన్ని పంచుకోవడం భారతీయ తత్వ చింతనలో ప్రధానాంశమని అందరూ ఆరోగ్యంగా ఉండాలని కోరే సర్వే సంతు నిరామయ శ్లోకాన్ని కళాశాల లోగో లో పొందుపరచడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. రామ్ కోసా పూర్వ అధ్యక్ష కార్యదర్శులు పి వెంకట రాజు జి పుల్లారావు కె.ఎల్.నారాయణ ఎం చంద్రమౌళీశ్వర రెడ్డి, ఎస్ఎస్‌సి చక్రరావు, కేఎల్ సంపత్ కుమార్, ఎం నగేష్ బాబు, వాడ్రేవు రవిలతోపాటు కార్యక్రమానికి సహకారం అందించిన కే ఎస్ పి ఎల్ ఎం డి కె వి రావు డాక్టర్ గన్ని భాస్కరరావు డాక్టర్ బొల్లినేని భాస్కర్లను సత్కరించారు. ఉత్తమ సేవ పథకాలను డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్ డాక్టర్ వి కే రాజు డాక్టర్ డి రాఘవరావు లకు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కేవీపీ రామచంద్రరావు. ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ రామ్ కోసా అధ్యక్షులు డాక్టర్ జి శేషగిరిరావు డాక్టర్ జొన్నలగడ్డ సూధాకర్ డాక్టర్ ఎం వి వి ఆనంద్ డాక్టర్ సి వి రావు డాక్టర్ వెంకట సుబ్బారావు చౌదరి ఆర్ ఎం సి ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ ఆది మహాలక్ష్మి పూర్వ విద్యార్థుల తో పాటు ప్రస్తుత విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జగన్ @ 3600

(మొదటిపేజీ తరువాయి)

వారి సమస్యలను తెలుసుకున్నారు. బుధవారం సాయంత్రానికి 3,593.6 కి.మీ. నడచిన జగన్ శనివారం మరో 13.6 కి.మీ. నడిచి ఇప్పటివరకూ మొత్తం 3,607.2 కి.మీ పాదయాత్ర పూర్తి చేశారు. శనివారం ఉదయం తురకశాసనం క్రాస్ శిబిరం వద్ద ప్రారంభమైన యాత్రకు పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన అభిమానులు, పార్టీ కార్యకర్తలు సంఘీభావం ప్రకటించారు.

పరిహారంలో రాజకీయం

పాదయాత్ర ప్రారంభంలో మత్స్యకారులు జగన్‌ను కలిసి సమస్యలు ప్రస్తావించారు. తిత్లీ తుఫాను వల్ల నష్టం చలా జరిగినా పరిహారం మాత్రం అందలేదని, ఆ పరిహారం చెల్లింపుల్లో రాజకీయాలు చోటు చేసుకుంటున్నాయని, అందువల్ల బాధితులకు న్యాయం జరగడంలేదని మత్స్యకారులు పేర్కొన్నారు. మరోవైపు సముద్రం ఒడ్డున కూడా అక్రమంగా ఇసుక తవ్వి తీయడంలో నీరు ఉప్పగా మారుతోందని, ఫలితంగా గ్రామాల్లో మంచినీరు కరవవుతోందని టి శాసనాం మత్స్యకారులు తెలిపారు. ఆ తరువాత కాసేపటికే పాదయాత్ర పాలవలస చేరుకోగా స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామంలో పాదయాత్ర సందర్భంగా జగన్‌ను కలిసిన స్థానికులు, పలు సమస్యలను ప్రస్తావించారు. గ్రామంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులు చాలా మంది ఉన్నారని చెప్పారు. వారికి తగిన వైద్య సహాయం అందడంలేదని జగన్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో తామే స్వచ్ఛందంగా ఒక సంస్థ ఏర్పాటుచేసుకుని వైద్య సహాయం పొందే ప్రయత్నంచ చేస్తున్నట్లు వివరించారు. ఈ క్రమంలో తమను ఆదుకోవాలని విన్నవించారు.

ఉల్లి - కన్నీరు

మరో వైపు వైయస్సార్ కడప జిల్లాకు చెందిన ఉల్లి రైతులు కూడా జగన్ మోహన్ రెడ్డిని కలిశారు. ఉల్లి ధరలు గత ఏడాది కంటే దారుణంగా పడిపోయాయని, అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మార్క్‌ఫెడ్ ద్వారా ఉల్లి కొనుగోలు చేసేలా చూడాలని జగన్‌ను వారు అభ్యర్థించారు.

వైకాపాలోకి వలసలు

మరోవైపు పార్టీలోకి జోరుగా వలసలు కొనసాగాయి. ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని మామిడిపల్లితోపాటు పలాస నియోజకవర్గాలకు చెందిన దాదాపు 500 మంది టీడీపీ, సీపీఎం నాయకులు, కార్యకర్తలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి జగన్ పార్టీ సభ్యత్వం ఇచ్చి పార్టీలోకి స్వాగతించారు.

యాత్రకు సంఘీభావం

ఇక పాదయాత్రలో విపక్ష నేతను కలిసిన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు యాత్రకు సంఘీభావం ప్రకటించారు. పార్టీ అధికారంలోకి వస్తే కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు చేస్తాన్న జగన్ ప్రకటనపై హర్షం వ్యక్తం చేశారు. పాదయాత్రకు తమ మద్దతు తెలియజేస్తున్నట్లు ప్రకటించారు. సీపీఎస్ రద్దుపై టీడీపీ తెలంగాణలో ఒక మాట, ఏపీలో మరోమాట మాట్లాడుతోందని, ఆ పథకం రద్దుపై ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేదని ఈ సందర్భంగా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆక్షేపించారు. అనంతరం కొర్లాం చేరుకున్న జగన్ గ్రామంలో పాదయాత్ర తర్వాత శిబారులోని శిబిరం వద్ద మధ్యాహ్న భోజనం ఆగారు. తిరిగి బయలుదేరిన జగన్‌కు ప్రజలు ఘన నీరాజనం పలికారు. ఆయనతో కలిసి అడుగులో అడుగు వేశారు. భోజన విరామం తరువాత బారువా జంక్షన్ చేరుకున్న జగన్ 3,600 కి.మీ. పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ పార్టీ జెండా ఎగురవేశారు. అనంతరం అక్కడే వేప మొక్కను నాటారు. గుంటూరు జిల్లాకు చెందిన చేనేత కారులు, వడ్డెర కులస్థులు జగన్‌ను కలిశారు. జిల్లా ప్రజలకు మహానేత వైయస్ ఆర్‌చేసిన మేలు ప్రజలందరికీ తెలిసేలా ప్రత్యేకంగా రూపొందించిన వెబ్‌సైట్లను జగన్ ఆవిష్కరించారు. అక్కడి నుండి లక్కవరం చేరుకుని శనివారం పాదయాత్రను ముగించారు.



అడుగడుగునా అపూర్వ స్పందన

కాగా, రోజంతా పాదయాత్రలో దారిపొడవునా జననేతను కలిసిన విద్యార్థులు, రైతులు, దివ్యాంగులు తమ సమస్యలు చెప్పుకున్నారు. మరోవైపు రైతులు, మహిలలు, విద్యార్థులు ఆయనతో కలిసి అడుగులు వేశారు.

ట్రాన్స్‌కోకు సీబీఐపీ అవార్డు

- సరఫరా, పంపిణీ నష్టాల్లో రూ.1000 కోట్ల ఆదా
- కేంద్రమంత్రి ఆర్కే సింగ్ నుంచి అవార్డు అందుకున్న జేఎండీ దినేష్



అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ సరఫరా సంస్థ (ఏపీ ట్రాన్స్ కో)కు మరో అవార్డు దక్కింది. అత్యల్ప నష్టాలు, అత్యధిక ట్రాన్స్‌మిషన్ నిర్వ హణతో దేశంలోనే ఉత్తమ పనితీరు కనబర్చిన సరఫరా సంస్థగా గుర్తింపు దక్కిం చుకుంది. కేంద్ర పభుత్వ సంస్థ సాగు నీరు, విద్యుత్ కేంద్రీయ మండలి (సీబీఐపీ) ఈ అవార్డును అందజేసింది. సీబీఐపీ 91వ వార్షికోత్సవం సందర్భంగా ఢిల్లీలో జరి గిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి ఆర్కే సింగ్ చేతుల మీదుగా ట్రాన్స్‌కో సీఎండీ కే విజయానంద్ తరపున జేఎండీ దినేష్ పరుచూరి ఈ అవార్డును అందుకున్నారు. 1927 నుండి దేశంలోని సాంకేతిక సంస్థలకు గొప్ప తోడ్పాటు నందిస్తున్న సీబీఐపీ అధునాతన సాంకేతికత, నవకల్పనలను వినియోగించుకుంటూ విద్యుత్ సరఫరా లో అత్యున్నత ప్రమాణాలను సృష్టించడంతో పాటు దేశంలోనే స్థిరమైన పనితీరు ను ప్రదర్శిస్తున్నందుకు గాను ఏపీ ట్రాన్స్‌కోకు తాజాగా ఈ అవార్డును అందజేసిం ది. ట్రాన్స్‌కో ఇప్పటికే ఉత్తమ ఆర్థిక నిర్వహణకు గానూ గోల్డెన్ పీకాక్ అవార్డు - 2018, గోల్డెన్ పీకాక్ హెచ్ ఆర్ ఎక్సలెన్స్ అవార్డు - 2016, గల్డెన్ పీకాక్ అవార్డ్స్ సెక్రటేరియట్, స్కోచ్ అవార్డు - 2018, ఏపీపీఏఐ - 2016 అవార్డు ఇలా అనేక అవా ర్డులు స్వంతం చేసుకున్న సంగతి తెలిసిందే. సరఫరా, పంపిణీ నష్టాలను తగ్గించ డం ద్వారా ఏపీ ట్రాన్స్‌కో, డిస్కంలు రూ. వెయ్యి కోట్ల వరకు ఆదా చేశాయని ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి, ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ, జెన్కో ఎండీ కే విజయానంద్ తెలి పారు. ట్రాన్స్‌కో కు అవార్డు దక్కడంపై స్పందించిన ఆయన రాబోయే రోజుల్లో సర ఫరా, పంపిణీ నష్టాలను అంతర్జాతీయ స్థాయిలో 4-5 శాతానికి పరిమితం చేయ డమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. నాణ్యమైన విద్యుత్తును అందుబాటు ధరల్లో నిరంతరం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించినట్లు చెప్పారు. సరఫరా నష్టాలు అత్యల్పంగా 2.8.3 శాతం అత్యధిక ట్రాన్స్‌మిషన్ 99.82 శాతంతో దేశంలో అగ్రస్థానంలో నిలిచామన్నారు.

విద్యుత్ సంస్థలు అద్భుత పనితీరుతో గడచిన నాలుగేళ్లలో 137 జాతీయ, అంతర్జాతీయ అవార్డులు అందుకోవడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇంధన శాఖా మంత్రి కిమిడి కళావెంకట్రావులు అభి నందనలు తెలియజేసినట్లు ఇంధన శాఖ, ఐ అండ్ ఐ, ఏపీసీఆర్డీఏ ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ వెల్లడించారు. ప్రస్తుతం 9.72 శాతంగా ఉన్న సరఫరా, పంపిణీ నష్టాలను రాబోయే రెండుమూడేళ్లలో 5-6 శాతానికి తగ్గించడమే లక్ష్యంగా డిస్కం లు పనిచేస్తున్నాయని తెలిపారు. ఇందులో భాగంగా నెట్ వర్క్ బలోపేతానికి రూ. 10 వేల కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు తెలిపారు. ఏపీ ట్రాన్స్‌కోకు అవార్డు ఇచ్చి నందుకు సీబీఐపీకి దినేష్ పరుచూరి ధన్యవాదాలు తెలిపారు. ట్రాన్స్‌కోకు అవార్డు దక్కడం పట్ల జేఎండీ ఉమాపతి, డిస్కంల సీఎండీలు ఎంఎం నాయక్, హెచ్‌వై దొర కూడా హర్షం వ్యక్తం చేశారు.

రాజకీయ జగడం!

రాజకీయాలు ఒకదశ వరకే నాయకుల చేతుల్లో ఉంటాయి... తొలుత నేతలే చక్రం తప్పుతారు.. తిప్పాలి. అదిక కదిలాక స్టీరింగ్ వాళ్ల చేతులు దాటిపోతుంది. రాజకీయాల వెనక వాళ్లు నడవాల్సిన స్థితి ఏర్పడుతుంది. రాజకీయాల నైజమే అంత. దీన్నిబట్టి ఏ స్థాయిలో ఎంత వేగంగా వెళ్లాలో ఆచితూచి అడుగేయకపోతే అదే రాజకీయం అరాచకమై అభాసుపాలు చేసే ప్రమాదం ఉంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 2014లో తానే చక్రమై రాజకీయాలు నడిపారు. అంతా తన అధీనంలోనే ఉండేది. ప్రధానమంత్రిగా కొంతకాలం అదే ఒరవడి సాగింది. రానురాను ఆయనలోని ఆత్మవిశ్వాసం వేగంగా దూకుడుగా అడుగులు వేయించింది. ఆ క్రమంలో రాజకీయాలు ముందుకొచ్చి ఆయన వెనకడుగులో ఉండిపోవాల్సి వచ్చింది. అప్పట్నుంచి రాజకీయాలే ఆయన్ని శాసిస్తున్నాయా అన్న అనుమానాలు ఎక్కువ కాసాగాయి. ఢిల్లీ నుంచి ఆంధ్రప్రదేశ్ దాకా ఇదే వాతావరణం నడుస్తున్నది. ఏపీలోనూ రాజకీయాలే పార్టీలను నడిపిస్తున్నట్టు వివిధ పరిణామాలు సూచిస్తున్నాయి. రాజకీయాలు రాజకీయ పరిధి దాటి వ్యక్తిగత వైరాల స్థాయికి చేరడంలోని అనౌచిత్యం ఇదే! ఆచి తూచి అడుగులు వేయాల్సిన చోట.. ఆధిపత్యపు అడుగులు ప్రమాదకరం.. అలాగే ఆగి ఆలోచించాల్సిన తరుణంలో దుందుడుకు నైజం నిర్హేతుకం!



జాతీయ రాజకీయాలు వేడెక్కాయి. లోక్‌సభ ఎన్నికలకు ఇంకా నాలుగైదు నెలల వ్యవధి ఉన్నప్పటికీ ఎన్నికల రాజకీయాలు మాత్రం ఇప్పటికే రసకందాయంలో పడ్డాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అయితే అవతల పార్లమెంటు నడుస్తున్నా దానితో తనకేమీ సంబంధం లేదన్నట్టుగా లోక్‌సభ ఎన్నికల ప్రచారపర్వంలో మునిగితేలుతున్నారు. నిజానికి గత కొద్ది రోజులుగా ఆయన ఎన్నికల కసరత్తుల్లోనే తన శక్తియుక్తులు వినియోగిస్తున్నట్టు స్పష్టమవుతున్నది. అవతల రాఫెల్ యుద్ధ విమానాల ఒప్పందం మీద లోక్‌సభలో చర్చ జరిగిన సందర్భంలోనూ ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ మాత్రమే సభలో జవాబుదారీగా వ్యవహరించారు. రెండు రోజులు సాగలాగిన ఆ చర్చలో ఒక్కరోజులోనైనా ఒక్క గంటైనా ప్రధానమంత్రి సభలో కూచోకపోవడం దృశ్యనీయాంశంగా అందరి మెదళ్లలో రికార్డయింది. ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ ఒంటికాలిమీద లేస్తూ.. ప్రధాని మోడీ సమాధానం చెప్పలేక భయంతో గదిలో దాక్కున్నారంటూ తీవ్ర ఆరోపణలతో కవ్వించినా ఫలితం లేకపోయింది. మామూలుగా ఇలాంటి సందర్భాల్లో అసెంబ్లీలో అయితే ముఖ్యమంత్రి.. పార్లమెంటులో అయితే ప్రధానమంత్రి.. తమ చాంబర్లో సభా కార్యక్రమాలు వీక్షిస్తూ.. రుసరుసా సభలోకి వచ్చి సమాధానం చెప్పిన సందర్భాలున్నాయి. కాని ప్రధాని మోడీ వీటికన్నింటికీ అతీతంగా వ్యవహరిస్తున్నారు. నిజానికి అంతటి వివాదాస్పద సన్నివేశానికి ప్రధాని మోడీ తానే స్వయంగా అవకాశం ఇవ్వాల్సిన అవసరం ఉందా అన్నది అందర్నీ వేధిస్తున్న ప్రశ్న. రాఫెల్ డీల్‌లోని నిజానిజాలను తెలుసుకోవాలని యావద్దేశం ఆసక్తిగా ఎదురుచూస్తున్న సందర్భంలో.. లోక్‌సభకు హాజరై ప్రతిపక్షాల సందేహాలను నివృత్తి చేస్తారని అందరూ భావించారు. కాని అలా జరగలేదు. తానే స్వయంగా సమాధానం చెప్పాల్సినంత సీరియస్ విషయం కాదని ప్రధాని మోడీ భావించారా? లేక తనకన్నా చాలా జూనియర్ అయిన రాహుల్ లేవనెత్తిన ప్రశ్నలకు నిండుసభలో తాను వివరణలు ఇవ్వడమేమిటని అనుకున్నారా? ఇందులో ఏదీ నిజం కాదని ఆశించాలి.

ఒకవేళ ఏ ఒక్కటి నిజమైనా అది సహేతుకం కాదని కూడా చెప్పుకోకతప్పదు. లోక్‌సభలో లేవనెత్తిన అంశం దేశ రక్షణ ఆయుధాలకు సంబంధించింది. అది రాహుల్‌గాంధీ ప్రయివేటు వ్యవహారం కాదు. అలాగే మోడీ వ్యక్తిగత అంశమూ కాదు. కాని సామాన్యుడికి మాత్రం అలాంటి భావన కలగడం లేదు. చట్టసభ అయిన పార్లమెంటు సజావుగా నడిచేలా శ్రద్ధ తీసుకోవాల్సిన ప్రభుత్వ పెద్దలు ఆ దిశగా చేస్తున్న ప్రయత్నాలేమీ కనిపించడం లేదు. చట్టసభల సమయంలో పార్టీ కార్యకలాపాల్లో తలమునకలై ఉండటం ఈమధ్య సర్వసాధారణమైంది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ అదృష్టమో దురదృష్టమో గాని ఈమధ్యకాలంలో ఆయన జనం నిఘా కళ్లల్లో అదేపనిగా నిలిచిపోతున్నారు. ఆయన వ్యవహారశైలిని ప్రజానీకం నిశితంగా గమనిస్తున్నది. నిజానికి గత యూపీయే హయాంలో అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ మీద కూడా జనం ఇంతగా దృష్టి పెట్టలేదు. దానికి కారణం లేకపోలేదు. మన్మోహన్‌సింగ్ సర్వస్వతంత్రుడు కాదు. చొరవతో దూసుకెళ్లే తత్వం ఉన్న నేత కాదు. పైగా వివాదాస్పదుడు అంతకన్నా కాదు. ఆయన నుంచి సంచలనాత్మక నిర్ణయాలు గాని ఆసక్తికరమైన వ్యాఖ్యానాలు గాని ఆశించలేము. ఈ పరిస్థితుల్లో సహజంగానే ఆయన మీద అంతగా ఫోకస్ ఉండదు. మోడీ విషయం అలాకాదు. ఆయన ప్రధానమంత్రి కావడమే ఆశలకు ఆజ్యంపోసి అయ్యారు. ఒక ఉప్పెనలా వచ్చారు. ఎన్డీయేని ఒంటిచేత్తో గెలిపించి ప్రధానమంత్రి పీఠమెక్కారు.

ఆయనలో ఒక సుడిగాలిని జనం చూశారు. ఆయన నుంచి విప్లవాత్మక మార్పులు ఆశించారు. ఆయన వల్లించిన ఉపన్యాసాలు విని ముగ్ధులై ఆయన్నొక ఆదర్శప్రాయుడిగా ఊహించుకున్నారు. కలుపుకుపోయే రాజకీయాలతో సరికొత్త రాజకీయ వాతావరణాన్ని సృష్టిస్తారని ఆశించారు. తనమీద పరిమితికి మించి ఆసక్తిని రేకెత్తించి అందర్నీ తనవైపు ఉద్దేశపూర్వకంగానే తిప్పేసుకున్నారు. అది కొంతకాలం ఆయన్ని ఆనందడోలికల్లో ముంచెత్తింది. ఇప్పడదే ఆయనకే తలనొప్పిగా మారింది. అప్పటి మోడీ ఇప్పుడు భిన్నంగా మారారా? అసలీ మోడీ అనే వ్యక్తి ఎప్పుడూ ఇంతేనా? అన్న ప్రశ్న ప్రశ్నగానే మిగిలిపోయింది. ఏమైనా జనం ఆయన మీద పెట్టుకున్న ఆశలకు భిన్నంగా జరుగుతున్న పరిణామాలు అందర్నీ నిశ్చేష్టులను చేశాయి. అందుకే ఈ నాలుగున్నరేళ్ల కాలంలో మోడీ వ్యవహారశైలి రకరకాల శల్యపరీక్షలకు గురైంది. అది ఇప్పటికీ కొనసాగుతున్నది. మొన్నటికి మొన్న ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని లోక్‌సభ నియోజకవర్గాల కార్యకర్తలతో ఆయన వీడియో కాన్ఫరెన్సు జరిపారు. ఒక ప్రధానమంత్రి నిస్సందేహంగా ఒక పార్టీకి చెంది ఉంటారు. అందువల్ల పార్టీ నేతలతో, కార్యకర్తలతో ముఖాముఖీ జరుపుకోవడాన్ని ఎవ్వరూ అభ్యంతర పెట్టనక్కర్లేదు. అయినా కొంతమేర అది వివాదాస్పదమైంది. ఆ ముఖాముఖీలో ఏపీ బీజేపీ నేతలు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుని నిశితంగా విమర్శిస్తూ మాట్లాడుతుంటే ప్రధాని మోడీ చిద్విలాసంగా వింటూ వారిని ప్రోత్సహించారన్న విమర్శలు సరికొత్త రాజకీయ వివాదానికి దారితీశాయి. అసలే అక్కడ బీజేపీ, తెలుగుదేశం పార్టీల మధ్య ఉప్పునిప్పులా ఉన్న నేపథ్యంలో ఏ చిన్న అంశమైనా అది రాజకీయ చిచ్చుగా మారుతున్నది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆ ముఖాముఖీ ద్వారా చంద్రబాబుతో ప్రత్యక్ష యుద్ధమే ప్రకటించినట్టయింది. ఇప్పటికే ఆయన రాష్ట్రంలో పర్యటించాల్సిఉండగా అది రద్దయింది. మళ్లీ త్వరలో వచ్చి నిజాలు నిగ్గుదేలుస్తానంటూ మోడీ చేసిన ప్రకటన ఆంధ్రప్రదేశ్‌లో భవిష్యత్ ఎన్నికల ముఖచిత్రం ఎంతటి ఉద్విగ్నంగా, ఉద్వేగభరితంగా ఉంటుందో చెప్పకనే చెబుతున్నది. ఆ సందర్భంగా మోడీ చేసిన వివిధ ప్రకటనలను ఒకే వరుసలో పేర్చి చూస్తే.. అదొక భిన్నవైఖరిని స్పష్టీకరిస్తున్నది. ఆంధ్రప్రదేశ్‌లో ఏమి జరుగుతున్నదో తనకంతా తెలుసునని అన్న మోడీయే... అదే ముఖాముఖీలో తెలంగాణ సీఎం కేసీఆర్ నడుపుతున్న ఫెడరల్ ఫ్రంట్ గురించి తనకేమీ తెలీదని అన్నారు. ఏపీ గురించి గాని తెలంగాణ గురించి గాని దేశ ప్రధానికి స్పష్టంగా తెలిసి ఉండాలనే అందరూ కోరుకుంటారు. నిజానికి తెలియకుండా ఉండదు. ఎందుకంటే ఒక ప్రధానమంత్రికి కేంద్ర నిఘా బృందాలుంటాయి. పార్టీ బృందాలుంటాయి. వివిధ కేంద్ర సంస్థలుంటాయి. ఇవన్నీ కాకుండా ప్రధానికి తనకంటూ సొంత ఆంతరంగిక బృందం ఉంటుంది. రాజకీయ కమిటీలుంటాయి. వీటన్నింటి ద్వారా ఒకే అంశానికి సంబంధించి వివిధ కోణాల్లో కుప్పలు తెప్పలుగా సమాచారం వస్తుంటుంది. అందువల్ల ప్రధాని మోడీ ఏపీ గురించి అంతా తెలుసు అనడంలో ఒకరకమైన శ్లేష ఉంటే తెలంగాణ గురించి తెలీదని అనడంలోనూ మరోరకమైన స్నేహాత్మక శ్లేష ఉందని అర్థమవుతున్నది. ఏతావాతా ఒక ప్రధానమంత్రి - ఒక ముఖ్యమంత్రి మధ్య ఒక ఫెడరల్ వ్యవస్థలో ఉండాల్సిన సంబంధాలు లేవన్న విషయం అర్థమవుతున్నది. ఇది సమాజంలోని అట్టడుగు పొర దాకా చేరింది. ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా అనేక సంవత్సరాలు పనిచేసిన అనుభవంతో మోడీ ఒక ప్రధానిగా కేంద్ర - రాష్ట్ర సంబంధాల గురించి చెప్పిన మాటలు అందరికీ చిలక పలుకుల్లా తీయగా వినిపించాయి. ఫెడరల్ వ్యవస్థలో ముఖ్యమంత్రుల్ని గౌరవించేలా కేంద్ర వ్యవస్థ ఉండాలని తాను అభిలషిస్తున్నట్టు.. అందుకనుగుణంగానే తానొక కొత్త వ్యవస్థను రూపొందిస్తానని మోడీ అప్పట్లో ముఖ్యమంత్రుల్లో నమ్మకం కలిగించారు. కాని అందుకు భిన్నంగా ముఖ్యమంత్రులతో వ్యక్తిగత వైరం స్థాయికి సంబంధాలు వెళ్లడంలో ఎవరి ప్రమేయం ఎంతన్నది ఆలోచించాల్సిన విషయమే. కేంద్రానికి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి మధ్య ఇంతటి అంతరం ఏర్పడటంలో అనేకాంశాలు కారకాలయ్యాయి. నిధుల దగ్గర్నుంచి పథకాలకు ప్రోత్సాహం దాకా, విభజన హామీల దగ్గర్నుంచి సహాయ సహకారాలు అందించే దాకా.. ఏ విషయంలోనూ ఇద్దరి వాదనల మధ్యా పొంతన లేకపరిస్థితి విషమించింది. ఎందుకిలా జరుగుతున్నది? రాజకీయ పార్టీల మధ్య యుద్ధం జరుగుతున్నదంటే అది నిస్సందేహంగా అధికారం కోసమే అవుతుంది. కాని ఏపీలో బీజేపీ అంతటి పోటీస్థాయిలో లేదు. అయినా బీజేపీతోనే చంద్రబాబు యుద్ధం చేస్తున్నారు? అంటే అది రాష్ట్రస్థాయి యుద్ధం కాదని కూడా అనుకోవడానికి వీల్లేదు. ఇటు రాష్ట్రంలో చంద్రబాబుని అధికారానికి దూరం చేయడంతోబాటు అటు జాతీయస్థాయిలో కాంగ్రెస్ పార్టీతో ఆయన కట్టే కూటమిని ఓటమిపాలు చేయడమనే ద్విముఖ వ్యూహంతోనే బీజేపీ ఆయన మీద దండెత్తుతున్నట్టు స్పష్టమవుతున్నది. చంద్రబాబు కూడా అక్కడ మోడీ ప్రభుత్వం మళ్లీ రాకుండా చూస్తేనే తనకిక్కడ రాజకీయ మనుగడ అన్న ఉద్దేశంతో రాష్ట్రస్థాయి నుంచి మొదలుపెట్టి ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ చేస్తున్నారు. రాష్ట్రంలో మోడీని టార్గెట్‌గా మాట్లాడుతూనే వైకాపాని కార్నర్ చేయడం ఆయన వ్యూహంలో భాగం. అందుకు తగ్గట్టుగానే వైకాపా కూడా బీజేపీ - టీడీపీ రహస్య ఎజెండా అంటూ ప్రతివ్యూహంతో ముందుకెళుతున్నారు. ఇదంతా మరింత స్పష్టం కావడానికి ఇంకా సమయం పట్టొచ్చు.

చంద్రబాబు లాంటి రాజకీయ అనుభవజ్ఞుడికి రాజకీయ ప్రత్యర్థులు ఉండాలి. కాని ఆయన దురదృష్టం ఏమిటంటే.. ప్రస్తుతం రాష్ట్రంలో ఆయనకు ఏ ఒక్కరూ రాజకీయ ప్రత్యర్థులు లేరు. ఉన్నవారంతా రాజకీయ శత్రువులే. బీజేపీతో విషమించిన సంబంధాలు తెల్సిందే. రాను రాను ఆ వైరం చంద్రబాబుకి, మోడీకి మధ్య వ్యక్తిగత శత్రుత్వంగా మారిపోయింది. నిజానికి ఒక ముఖ్యమంత్రి - ఒక ప్రధానమంత్రి నేరుగా పరస్పరం విమర్శించుకునే పరిస్థితే రాకూడదు. విధానాలపరంగా సైద్ధాంతికంగా విభేదించుకోవచ్చు. ఆ స్థాయిలోనే ఆ పరిభాష పరిమితం కావాలి. లేదంటే పరిస్థితి తీవ్రతను బట్టి విమర్శల్లో ఘాటు పెంచాలంటే వారి వారి అధికార ప్రతినిధుల చేతనో లేక ప్రభుత్వం తరపున సంబంధిత సాధికార వ్యక్తుల చేతో మాట్లాడించడం రివాజు. అలాకాకుండా ఇద్దరికి ఇద్దరూ పేర్లు చెబుతూనే పరస్పరం విమర్శలకు దిగడం పలువుర్ని ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. ఆ రెండు పదవుల మధ్య ఉండాల్సిన స్థాయీభేదం కుదించుకుపోతున్నది. మరోవంక వైకాపా విషయానికొస్తే.. ఆ పార్టీకి, తెలుగుదేశానికి మధ్య, చంద్రబాబు - జగన్‌కి మధ్య కూడా రాజకీయ వైరుధ్యం కన్నా రాజకీయ శత్రుత్వ ప్రాబల్యమే కనిపిస్తున్నది. అందుకే అక్కడ సహజ రాజకీయ పోటీతత్వం మరుగున పడిపోయింది. ఇక జనసేనకు తెలుగుదేశానికి మధ్య ఇటీవలిదాకా పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి ఉండేది. ఉన్నట్టుండి ఎందుకో తెలుగుదేశం అధినేత నోట మాటల ఒరవడిలో మార్పు వచ్చిన భావన కలుగుతున్నది. చంద్రబాబు నాయుడు పదేపదే పవన్‌కల్యాణ్ పేరు ఉచ్చరిస్తూ సామాన్య జనంలో కొత్తరకం ఊహాగానాలకు ఆస్కారమిస్తున్నారు. ఒకానొక దశలో ఆ రెండు పార్టీలు పరస్పరం విమర్శనాస్త్రాలు సంధించుకున్నాయి. క్షేత్రస్థాయిలో రెండు పార్టీల కార్యకర్తల మధ్య ఆగ్రహావేశాలు పెల్లుబుకుతున్న తరుణంలో చంద్రబాబు వ్యాఖ్యలు అందర్నీ ఆశ్చర్యపరిచాయి. అయితే పవన్‌కల్యాణ్ వెంటనే స్పందించడం ద్వారా ఆ అనుమానాలకు ఫుల్‌స్టాప్ పెట్టే ప్రయత్నం చేశారు. తనకెవ్వరి అండదండలు అక్కర్లేదని.. తమ పార్టీ మొత్తం 175 సీట్లకు వామపక్షాలతో కలసి పోటీ చేస్తుందని ఆయన ప్రత్యేకంగా ప్రకటించాల్సి వచ్చింది. క్షేత్రస్థాయిలో ఇప్పటికే కొంత గందరగోళంగా ఉన్న రాజకీయ వాతావరణాన్ని మరింత గందరగోళంగా మార్చే ప్రయత్నాలు అన్నివైపుల నుంచి జరుగుతున్నట్టే భావించాలి. ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఈ వాతావరణం మరింత సంక్లిష్టంగా మారే ప్రమాదం ఉంది. ఇప్పటికే ప్రధానమంత్రి రాష్ట్రంలో పర్యటనకు సంబంధించి కొంత రాజకీయ గొడవ జరిగింది. ముఖ్యమంత్రి పర్యటనల్లో నిరసనలు తెలిపే కార్యక్రమాలకు బీజేపీ శ్రీకారం చుట్టినట్టు కనిపిస్తున్నది. శుక్రవారం కాకినాడలో చంద్రబాబు పర్యటనలో జరిగిన సంఘటనలే ఇందుకు నిదర్శనం. అంటే ఒకరి పర్యటనలను మరొకరు నిరసించడం ద్వారా తమ తమ రాజకీయ ప్రాబల్యాన్ని ప్రదర్శించుకునే పరిస్థితులు ఏర్పడుతున్నట్టు అంచనాకు రావచ్చు. బీజేపీ - తెలుగుదేశం మధ్య ఉన్న రాజకీయ వైరానికి అనుగుణంగానే ఇది జరిగే అవకాశాలున్నాయి. మరి జనసేన కార్యాచరణ ఎలా ఉంటుందనేది ఆసక్తికరంగా మారుతుంది. ఇక వైకాపా విషయానికొస్తే జగన్ పాదయాత్ర ఇంకో మూడు నాలుగు రోజుల్లో ముగియబోతున్నది. అది అయ్యాక ఆయన భవిష్యత్ ఎన్నికల వ్యూహం మీద పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించవచ్చు. వచ్చే ఎన్నికల్లో ఏపీలో నాలుగు స్తంభాలాట అనివార్యం. తెలుగుదేశం, బీజేపీ, వైకాపా, జనసేన పార్టీలు ఒకరినొకరు విమర్శల దాడులతో ఒంటరి ప్రయాణమన్న సంకేతాలిస్తున్నాయి. కాని జనంలో మాత్రం అలాంటి భావనలు వినిపించడం లేదు. మూడు పార్టీల మధ్య మోడీ అంశ ప్రధానాంశంగా మారుతున్నది. మోడీకి, వైకాపాకు లింకుపెట్టి తెలుగుదేశం మాట్లాడుతుంటే.. తెలుగుదేశానికి, జనసేనకు పాత రాజకీయ స్నేహాన్ని గుర్తుకుతెస్తూ వైకాపా విమర్శిస్తున్నది. జనసేనేమో.. అటు తెలుగుదేశం - బీజేపీ మధ్య కపట నాటకం నడుస్తున్నదని అంటూనే.. మరోవంక వైకాపా - బీజేపీ స్నేహరాగాలాపన గురించి ప్రస్తావిస్తున్నది. ఎవరు ఎవరితో అంటకాగుతున్నారో అర్థం కాక సామాన్యుడు తలపట్టుకుంటున్నాడు. ఎన్నికలకు ముందు ఏమీ లేకున్నా.. ఎన్నికలయ్యాకైనా పరిస్థితుల్నిబట్టి ఏరెండు పార్టీల మధ్యైనా బాదరాయణ సంబంధం ఏర్పడొచ్చన్న ప్రచారం మాత్రం సాగుతున్నది. ఎవరిమధ్య ఎలాంటి స్నేహాలు కుదిరినా అది వారివారి రాజకీయ అవసరాలను బట్టే ఉంటుందన్న విషయంలో భిన్నాభిప్రాయాలకు తావులేదు.

-వయ్యెస్సారెస్

మహాభారతంలో ...
యుద్ధ పర్వాలలో ద్రౌపది

ధర్మజుడితో కలిసి అశ్వమేధయాగం నిర్వహించింది. కుంతీదేవి కర్ణుడు నా కుమారుడే ఉదకదానం చెయ్యమని ధర్మరాజుకు చెప్పగా విని నివ్వెరపోయింది. ఆశ్రమవాసానికి సన్నద్ధమైన గాంధారీధృతరాష్ట్రుల్ని, అత్తకుంతిని వదలని వారించింది. కుంతి ఆంతర్యాల్ని కొంతకు కొంత గ్రహించి సాగనంపింది. శ్రీకృష్ణుడి నిర్యాణం, యాదవుల వినాశనం, అర్జునుడి దౌర్బల్యానికి మిక్కిలి చింతించింది. తుదకు పరీక్షిత్తుకు పట్టంకట్టి భర్తలతో కలిసి మహాప్రస్థానం చేసి అలసి, సొలసి శరీరం త్యజించి స్వర్గాన్ని పొందింది. ద్రౌపది అసామాన్య స్త్రీ. అసాధారణమైన భార్య. పాండవులు దేహాలైతే ఆమె ఆ దేహగత చైతన్యం. ఆమె లేనిది వారు లేరు. ఆమె వారిని తాను నడిచి నడిపించింది. తండ్రి, సోదరులు, అభిమన్యుడు, తన పుత్రులు ప్రతివింధ్యాదులు మరణించినందుకు దుఃఖించినా తన అవమానం తీరినందుకు, పగ చల్లారినందుకు సంతోషించిన వీరనారి. స్త్రీని అవమానించిన వారెవరూ బ్రతికి బట్టకట్టరనే నీతిని బోధించడానికి ఆలంబనమైన స్త్రీమూర్తి. భూ భారాన్ని తగ్గించడానికి శ్రీకృష్ణుడికి ఉపకరణమైన మగువ. సాధికారతకు నిదర్శనమైన ఉన్నత మహిళ.

సుభద్ర: దేవకీవసుదేవుల కుమార్తె. బలరామశ్రీకృష్ణుల ప్రియసోదరి. మిక్కిలి సౌందర్యవతి.గుణశీలవతి. అర్జునుడి గుణగణాల్ని అన్న కృష్ణుడి వల్ల విని ఆతనియందు బద్ధానురాగ అయ్యింది. అర్జునుడు ఆమె రూపలావణ్యాల్ని తెలిసి రాగరంజితుడైనాడు. అయితే బలరాముడు మాత్రం తన చెల్లెలిని దుర్యోధనుడికివ్వాలనే ఉద్దేశ్యంతో ఉన్నాడు. దుర్యోధనుడు బలరాముడికి గదాయుద్ధంలో ప్రియశిష్యుడు. కృష్ణుడికి సుభద్రను దుర్యోధనుడికి ఇవ్వడం ఇష్టంలేదు. కారణం గుణవిశేషాలే. అర్జునుడు, కృష్ణుడు నరనారాయణులు. ఇప్పుడు మిక్కిలి మిత్రులు. అర్జునుడి బలపరాక్రమాలు, వ్యక్తిత్వం కృష్ణుడికి ఇష్టం. అందుచేత అన్న బలరాముడికి తెలియకుండానే సుభద్రను అర్జునుడికిచ్చి వివాహం చేయ నిశ్చయించాడు. ఇద్దరి హృదయాలలోని ప్రేమ ఆయనకు తెలుసు.

అర్జునుడు ఒక సంవత్సరం తీర్థయాత్రలు చేస్తూ చివరిగా ద్వారకానగర సమీపానికి వచ్చి కృష్ణుణ్ణి చూడదలచాడు. తలచిందే తడవుగా కృష్ణుడు అర్జునుడి దగ్గరకు వెళ్లి, ఆతణ్ణి రైవతక కందరంలో ఉంచి ఒక రాత్రి అక్కడే అర్జునుడితో సరససల్లాపాలతో గడిపి సుభద్రవిషయంగా భద్రంగా అంతా జరుగుతుందని చెప్పి యతివేషంలోనే అర్జునుణ్ణి ఉంచి, రైవతకోత్సవం ప్రకటించి దేవకీవసుదేవుల్ని, బలదేవాదుల్ని, భార్యల్ని, సుభద్రను తీసుకుని రైవతకపర్వతార్చనకై వెళ్లాడు. సుభద్ర అర్జునుణ్ణి భర్తగా ప్రసాదించమని పర్వతాన్ని ప్రార్థించింది. ఆమె అందచందాల్ని చూసి అర్జునుడు మదన పరవశుడయ్యాడు. దాన్ని గమనించిన కృష్ణుడు యతులు స్త్రీలను చూసి సానురాగులు కాకూడదుగదా అని అర్జునుడిని ఎగతాళిగా మందలించాడు కూడా. బలదేవాదులు యతిరూపంలో గల అర్జునుణ్ణి ఈ చాతుర్మాసదీక్ష మా దగ్గర నిర్వహించమని ప్రార్థించారు. దాంతో అర్జునుడు సులభంగా ద్వారకానగరంలో కన్యాపురంలో సుభద్ర సేవలో ఉన్నాడు. రొట్టె విరిగి నేతిలో పడినట్లయింది. ప్రతిదినం ఎంతో ఉన్నతంగా సుభద్ర ఆయతిని పూజిస్తున్నది. అర్జునుడి రూపురేఖలు యతిలో గమనించింది. అర్జునుడే అయి ఉంటాడని సందేహించింది. ఇంద్రప్రస్థక్షేమ సమాచారాన్ని, అర్జునుడి తీర్థయాత్రా విషయాల్ని తెలిస్తే చెప్పమన్నది. దినదినాభివృద్ధి చెందుతున్న అర్జునుడి ప్రేమ దాగలేదు. తానే అర్జునుడినని ప్రకటించుకుని క్షత్రియార్హమైన గాంధర్వంలో వివాహం చేసుకుందామన్నాడు. ఆమె సిగ్గుపడింది. పైగా నన్ను మీకిచ్చే పెద్దలున్నారు. వారే మన వివాహం చేస్తారని చెప్పి పాలపొంగుపై నీరు చల్లింది. యతి అర్జునుడన్న విషయం రుక్మిణీసత్యలకు తెలుసు. కృష్ణుడు చెప్పాడు. రుక్మిణి, సుభద్ర సిబ్బిత అయిన



తర్వాత యతి ఆలనాపాలనా చూసింది. కృష్ణుడు సుభద్రార్జునుల గాఢానురాగవిషయం దేవకీ వసుదేవులకు, సాత్యకికి చెప్పి బలదేవాదులకు తెలియకుండా పెండ్లి చేయ నిర్ణయించి, బలదేవాదులతో తానూ అంతర్ద్వీపానికి వెళ్లి శివభగవానుణ్ణి సేవింప దొడగాడు. మధ్యలో తాను ద్వారకకు తిరిగివచ్చి సుభద్రార్జునుల వివాహం చేయించాడు. అర్జునుడి వైపున శచీంద్రులు, అప్సరసలు, మునులు, దిగ్గజులు పెండ్లి పెద్దలయ్యారు. బృహస్పతి ముహూర్తం పెట్టగా కశ్యపుడు పురోహితుడయ్యాడు. రుక్మిణీ సత్యభామలు, అరుంధతి, అప్సరసలు పురంధ్రీకార్యాలు నిర్వర్తించగా సుభద్రార్జునుల వివాహం ఘనంగా జరిగింది. ఇంద్రుడు తన కుమారుడు అర్జునుడికి విశేషభూషణాలు కానుకగా ఇచ్చి వెళ్లాడు. వెంటనే కృష్ణుడు నూత్నదంపతుల్ని అతివేగంగా ఇంద్రప్రస్థానికి వెళ్లమని పంపాడు. అయితే నగరరక్షకులు, మరియు యాదవసైన్యం కొంత అర్జునుణ్ణి వెంబడించింది. అర్జునుడు వాళ్లందర్ని శరపరంపరతో నిర్జించాడు. సుభద్ర సారథ్యం వహించింది. అర్జునుడు సుభద్రను ఎత్తుకు పోతున్నాడన్న విషయం బలదేవాదులకు తెలిసింది. వెంటనే ద్వారకకు వచ్చారు. యదువీరులు క్రుద్ధులై అర్జునుణ్ణి పట్టి తెస్తామన్నారు. కాని బలరాముడు వారిని వారించి కృష్ణుడితో ఇలా పలికాడు.

నీవెఱుగ కుండ గర్వము / తో విజయుడు తా సుభద్ర దోడ్కొని బలిమిం
బోవగ నంత సమర్థుడె అని. అప్పుడు మాయావి కృష్ణుడు

పార్థుడు తన మేనమఅదల్ని ప్రేమించి తీసుకు వెళ్లాడు. అది ఆతడికి యోగ్యమే గదా! ఆతణ్ణి గెలవడం అంత తేలికా? మిన్నకుండండి అని యదువీరుల్ని మందలించాడు. తమ్ముడు నోరు విప్పితే అన్న మౌనం వహిస్తాడు. తమ్ముడి లీలానాటక విశేషాలు అన్నకు బాగా తెలుసు. సుభద్రార్జునులు త్వరత్వరగా ఇంద్రప్రస్థానికి చేరి, ముందుగా సుభద్ర అర్జునుడి సూచన మేరకు ద్రౌపది ఆశీస్సులు పొందింది. మేనత్త గీవెనలు అందింది.

ధర్మజుడు, భీముడు ఆశీర్వదించారు. కవలలు అభివందించారు. అక్క ద్రౌపదితో కలిసి సుభద్ర ఎంతగానో కుంతీమహాదేవి కోడలిగా రాణించి అభిమన్యుడికి జన్మనిచ్చింది. అయితే ఎక్కువ కాలం ఇంద్రప్రస్థంలో భర్తతో కలిసి జీవించలేదు. పాండవులు అరణ్య, అజ్ఞాతవాసాలకు వెళ్లగా తాను పుట్టినింటిలోనే కుమారుడు అభిమన్యుడితో కలిసి ఉన్నది. అజ్ఞాతవాసం ముగియగానే శ్రీకృష్ణ బలదేవాదులతో కలిసి అభిమన్యుణ్ణి వెంటబెట్టుకుని ఆతడి వివాహనిమిత్తం విరాటనగరానికి వెళ్లింది. ఉత్తరాభిమన్యుల వివాహం కన్నులపండువుగా జరగడం చూసి సంతోషించింది. అర్జునుడి పెద్దరికం వల్ల ఉత్తర సవతి కాకుండా కోడలయ్యింది. విరటుడు ఉత్తరను అర్జునుడికే భార్యను చేస్తానన్నాడు. ఆమె నా శిష్యురాలు. విషయలోలుణ్ణని లోకం నిందిస్తుంది. కోడలిని చేసుకుంటానన్నాడు. దాంతో ద్రౌపదీ సుభద్రలు బ్రతికి పోయారు. ఇంతలో ఉత్తర గర్భవతి కావడం సంతోషాన్ని కలిగించినా వెంటనే కురుక్షేత్ర సంగ్రామంలో అభిమన్యుడి మరణం ఆమెను మిక్కిలి బాధించింది. ఆతడి బాల్యవిశేషాల్ని గుర్తుచేసుకున్నది. యుద్ధంలో రాణించిన విధానాన్ని పొగిడింది. నీమృదుదేహం యుద్ధభూమిలో కటిక నేలపై ఎట్లు దొర్లుతున్నదో! వందిమాగధుల మృదుమధుర కంఠధ్వనులు విని వీనుల విందు చెందిడి నీవు రణభూమిలో గ్రద్దల, కాకుల పరుషధ్వనుల్ని ఎట్లు వింటున్నావో.ఇందరుండి నిన్నెలా రక్షింపలేకపోయారు.

జిష్ణుని కొడుకవు కృష్ణునల్లుండవీ/ వరులచే బడుట చోద్యంబు అన్నది.
వేగంగా వచ్చి ఉత్తరను సాంత్వన పర్చమని దుఃఖించింది.

కృష్ణుడు ఎంతగానో ఊరడించాడు. వీరపత్నికి, వీరమాతకు ఎప్పుడో ఒకప్పుడు ఈ స్థితి తప్పదు. నీవు అట్టిదానివే. అందుకై చింతించరాదు. నీ సుతుడు వీరస్వర్గం అలంకరించాడు. బ్రహ్మచర్యంతో, తపస్సుతో, దానధర్మాలతో యజ్ఞాలతో పొందే పుణ్యలోకాల్ని నీకొడుకు ఇపుడే సునాయాసంగా పొందాడు.నీ పుత్రుడి వీరవిహారాన్ని విని సంతసించాలి గాని దుఃఖించరాదు.

కాలం బైనం బోవక / యాలోకమునందు నిలువ నెవ్వరి వశమి
ట్లేల యవివేక జనముల/ పోలిక శోకానలమున బొగులుచు నుండన్

నీ కోడలికి ధైర్యం చెప్పు. నీ భర్త కుమారుడి మరణానికి కారకుడైన సైంధవుణ్ణి వధించి నీకు ముదాన్ని కల్గిస్తాడని ఊరడించాడు.

ద్రౌపది ఉత్తరాసుభద్రల్ని ఓదార్చబోయి తానూ దుఃఖభారంతో నేలకూలింది. మరలకృష్ణుడు పలువిధాల మాటలాడి వారి దుఃఖాన్ని ఉపశమింప చేయగలిగాడు. అభిమన్యుడు కొత్తగా పెండ్లి అయిన యువకుడు. మహావీరుడు. అక్రమంగా ఓడించి చంపడం ఎవ్వరికైనా దుఃఖకారణమే. పైగా ఇద్దరు తల్లులు. ఒక భార్య. శోకం కట్టలు త్రెంచకమానదు. అయినా దిగమ్రింగక తప్పదు.



కళారత్న (హంస)
డా.సి హెచ్.బాబావలిరావు
హైదరాబాద్, 9989792247

ఇప్పటికీ 'మోగుతున్న' మరణ మృదంగ



తోటపల్లి సాయినాథ్, 9394449777

సినీ రచయితగా నా జీవితంలో తెలుగుతో పాటు ఇతర భాషల్లో కూడా చాలా చిత్రాలకు కథ, స్క్రీన్ ప్లే మాటలు రాశాను. రాస్తూనే ఉన్నాను. ఐనప్పటికీ కొన్ని సినిమాల పేర్లు గుర్తుకు రాగానే మనసులో ఏదో తెలియని అనుభూతి, ఆనందం, గుండెలనిండా సంతృప్తి కలుగుతుంది. ఆ చిత్రాలు నాలో ఆత్మ విశ్వాసం పెంపొందిస్తాయి. అటువంటి ఒక ప్రముఖ చిత్రం నేను కర్ణాటకలోని రామకృష్ణహెగ్డేను మోడల్‌గా భావించి రాసిన మరణ మృదంగ. ఆ చిత్రానికి అనూహ్యంగా నేను కథ, మాటలు, స్క్రీన్ ప్లే అందించాను. కన్నడ భాషలో నాకు మొదటిసారిగా టైటిల్‌లో కథ, మాటలు, స్క్రీన్ ప్లే పడింది ఈ సినిమా ద్వారానే. అంతగా మర్చిపోలేని ఎన్నో అనుభూతులను మిగిల్చింది ఆ సినిమా. రామకృష్ణ హెగ్డే ప్రముఖ రాజకీయవేత్త. ఆయన ముఖ్యమంత్రిగా పని చేశారు. కేంద్ర మంత్రిగా కూడా పనిచేశారు. ఆయనను దృష్టిలో పెట్టుకొని నేను తయారు చేసిన పొలిటికల్, కమర్షియల్ కన్నడ బాక్సాఫీస్ హిట్ మరణ మృదంగ. తెలుగు మరణ మృదంగం సినిమాకు ఈ కన్నడ సినిమాకు ఎలాంటి సంబంధం లేదు. కన్నడ సినిమా కథకు ఆ టైటిల్ సరిగ్గా సరిపోవడంతో అదే పెట్టాము. అసలు నేను ఆ సినిమాకు శ్రీకారం చుట్టిన సంఘటన అనూహ్యంగా జరిగింది. 1992 సంవత్సరంలో నేను మాలాశ్రీతో వజ్రాయుధ అనే సినిమా చేశాను. అది అద్భుతంగా హిట్టయింది. ఆ చిత్ర నిర్మాత చిదంబర శెట్టి నాతో మాట్లాడుతూ నిర్మాత బి.రామ్మూర్తి గారితో సినిమా చేద్దాము... అది పొలిటికల్ బ్యాక్ గ్రౌండుతో... అని అన్నారు. అనంతనాగ్ హీరోగా... మాలాశ్రీ, సునీల్ వీళ్లందరినీ దృష్టిలో పెట్టుకొని ఓ చిత్ర కథను తయారు చేయమన్నారు. నేను బెంగళూరు వెళ్ళగానే అడ్వాన్సులు ఇచ్చేసేవాడు. వెంటనే ఆ కథ.. డిస్కషన్స్. స్క్రిప్టు రెడీ చేసే వాళ్ళం. ఆయనకు నా మీద అంత నమ్మకం.. చిదంబర శెట్టితో నేను ఏడు సినిమాలు చేశాను. నేనూ,చిదంబరశెట్టి కథ చెప్పడానికి అనంతనాగ్ ఇంటికి వెళ్లాము. మేము అక్కడకు వెళ్లగానే కథ ఓ విచిత్రమైన మలుపు తీసుకుంది. ఇప్పుడు మనం ముగ్గురం కలిసి గొప్ప రాజకీయవేత్త, మేధావి రామకృష్ణ హెగ్డే దగ్గరకు వెళ్దాము అని అనంతనాగ్ అనడంతో నేను ఆశ్చర్యపోయాను. ఈ విషయం చిదంబరశెట్టికి ముందే తెలుసు. ఆయన నాకు చెప్పలేదు. అప్పుడు నవ్వుతున్నాడు. ఏమిటంటే విషయం అని నేను చిదంబరశెట్టిని అడిగాను. ఏం లేదు.. మన సినిమాలో సీఎం పాత్ర గురించి అనుకుంటున్నాము కదా... ఈ కథ రామకృష్ణహెగ్డేకి చెప్పండి. చూద్దాం.. ఆయన ఒప్పుకుంటారేమో.. అని అన్నాడు. నేను మొదటి నుంచి ఈ సినిమాలో రామకృష్ణహెగ్డే లాంటి రాజకీయ నాయకుడు అని చెపుతున్నాడు. ఆ విషయం శెట్టి మనసులో బాగా నాటుకు పోయినట్లుంది. అందుకే రామకృష్ణ హెగ్డేని అడిగినట్లు ఉన్నారు. రామకృష్ణ హెగ్డేకి కథ చెప్పి ఆయనను నటించడానికి ఒప్పించడం నాకు పెద్ద ఛాలెంజీగా అన్పించింది.. వెంటనే మేము ముగ్గురం కలిసి ఆయన ఇంటికి వెళ్లాము. బిగ్ మార్కెట్లో ఏం చేయాలి. స్వార్థ రాజకీయం వర్సెస్ స్వేచ్ఛా రాజకీయం అనే పాయింటు ఏ రాష్ట్రంలోనైనా ఖచ్చితంగా చెల్లుబాటు అవుతుంది.. అనే నమ్మకం నాకు ఉండేది. ఆ పాయింటును పొలిటికల్ జానర్‌లో టార్గెట్ చేసి డిజైను చేసిన కథ మరణ మృదంగ. మేము ముగ్గురం వెళ్లి ఆ కథను ఆయనకు చెప్పాము. ఆయనకు వెంటనే నచ్చింది.

సమాజంలో అన్ని వృత్తులవారు తమ విధులను కనీసం 90 శాతం వరకు నీతి, నిజాయితీ, నిబద్ధతతో నిర్వహిస్తుంటారు. రిక్షా పుల్లర్ నుంచి మొదలు రైలు, బస్సు డ్రైవరు, ఇంజనీర్, డాక్టర్లతోపాటు ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో ప్రతి ఉద్యోగి చాలా బాధ్యతగా పనిచేయడం వల్లనే ప్రజలు జీవించగలుగుతున్నారు. కాని రాజకీయ నాయకులు, పదవుల్లో ఉన్న కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, సీఎం, పీఎం వంటి హోదా కల్గినవారు 50 శాతం కాదు కదా కనీసం 30 శాతం వరకు కూడా నిజాయితీగా పనిచేయలేకపోతున్నారు. పది శాతం కూడా నిజాయితీ లేని నాయకులు 90 శాతం మంది ఉన్నారు. రాజకీయ నాయకులు ఇంత స్వార్థ పూరితంగా అవినీతిమయంగా ఎందుకు తయారయ్యారు. ఇదే నా ప్రశ్న... ఆ పక్కనే మరణ మృదంగ కథగా తయారు చేశారు. రామకృష్ణహెగ్డే నా కథలోని ఆవేదనను అర్థం చేసుకున్నారు. అందుకే వెంటనే అంగీకరించారు.

ఇక కథ విషయానికి వస్తే... కన్నడ రాష్ట్రంలో బెస్ట్ఎక్స్‌పోర్టరుగా మాలాశ్రీ ప్రభుత్వం నుంచి వరుసగా మూడు సంవత్సరాలు అవార్డు అందుకుంది. వాస్తవంగా మాలాశ్రీ ముఖ్యమంత్రి హెగ్డే మనుమరాలు. హెగ్డే ఆమెను తన ఇంటికి విందుకు ఆహ్వానిస్తాడు. అక్కడ ఇద్దరి మధ్య వాదోపవాదాలు చోటు చేసుకుంటాయి. 50 ఏళ్లు రాజకీయాలలో ఉండి మీరు ప్రజలకు ఏం చేశారని మాలాశ్రీ ప్రశ్నిస్తుంది. మీ పదవి కాపాడుకోవడంలోనే నాలుగు ఏళ్లు గడిచిపోయాయి. మరో ఏడాది మాత్రం మిగిలి ఉంది. ఈ ఏడాది మీ మనస్సుకు నచ్చినట్లు చిత్తశుద్ధితో ప్రజల కోసం పనిచేయండి. అప్పుడు మీ ఇంట్లో నేను భోజనం చేస్తాను. అప్పటివరకు మీ ఇంటికి కూడా నేను రాను. అని భోజనం చేయకుండా మాలాశ్రీ వెళ్లిపోతుంది.

ఆ రాత్రి ఆయన తీవ్రంగా ఆలోచిస్తాడు. తర్వాత రోజు నుంచి ఆయన తన మనవరాలు కోరిక నిజం చేసే విధంగా ప్రవర్తిస్తుంటాడు. అది పార్టీలోని, ప్రభుత్వంలోని ఇతర నాయకులకు నచ్చదు. వారంతా ఆయనకు వ్యతిరేకంగా పనిచేస్తుంటారు. చివరకు ఆయన తన ఆశయ సాధనలోనే మృతి చెందుతారు. ఈ మధ్యలో కథలో చోటు చేసుకున్న మలుపులు మరణ మృదంగ ప్రత్యేకత...

ఈ కథ వినగానే హెగ్డేగారు లేచి నిలుచుని నన్ను అభినందించారు. తను ఈ సినిమాలో నటిస్తానని నాకు మాటిచ్చారు. అప్పుడు ఆయన అన్న మాటలు నాకు ఇప్పటికీ గుర్తు.. రచయితలు అంటే నాకు నమ్మకం... ఎనలేని గౌరవం.. ఈ రోజు మీరు దానిని ఇంకా ఉన్నత స్థాయికి తీసుకుపోయారు. తర్వాత ఈ సినిమాలో హెగ్డే నటించడానికి అంగీకరించారనే వార్త కర్ణాటక రాష్ట్రంలో సంచలనం కల్గించింది.

ఈ సినిమాకు బి.రామ్మూర్తి డైరెక్టర్.. సునీల్ హీరో అయినప్పటికీ హీరోయిన్ మాలాశ్రీ గారిది మెయిన్ రోల్.. మాలాశ్రీ తెలుగు నటి అయినప్పటికీ 1992



ప్రాంతంలో ఆమెకు కన్నడంలో విపరీతమైన అభిమానులు ఉండేవారు. అప్పట్లో కన్నడ భాషలో ఎంతో క్రేజ్ ఉన్న హీరోయిన్ ఆమె. పేరుకు సునీల్ హీరో అయినా కథ అంతా హెగ్డే గారు మాలాశ్రీ మధ్యనే నడిచింది. వారిద్దరి మధ్య సీన్లు రాస్తున్నప్పుడు హెగ్డే గారు ఓ మాట చెప్పారు. ఈ సీన్లు షూటింగ్ జరిగే సమయంలో లొకేషన్‌లో మీరు తప్పక ఉండాలి. అందుకు మీకు కావాల్సిన సదుపాయాలు, వసతి ఖర్చులు అన్ని నేనే స్వయంగా చూసుకుంటాను. ఎందుకంటే మీ భావాలకు అనుగుణంగా సీన్లు వస్తున్నాయో లేదో మీరు మాకు చెప్పాలి. అప్పుడే మాకు కూడా నమ్మకం కలుగుతుంది. ఆయన మాటలు విన్న నాకు ఆశ్చర్యం వేసింది. అందుకే సరే అని అన్నాను. రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేస్తూ తన సొంత పార్టీ నాయకుల కుళ్లు, కుట్రలను ఎదుర్కొంటూ... తన మనుమరాలిని గెలవాలి... ఆమె తన ఇంటికి వచ్చి తనతో పాటు మనుమరాలు భోజనం చేయాలి అనే ఆశయంలో హెగ్డే విజయం సాధించారా.. లేదా.. అనేది మరణమృదంగ సినిమా.

మోడీకి రెండు ప్రశ్నలు

దేశ ప్రజలకు రాహుల్ పిలుపు



న్యూఢిల్లీ: రాఫెల్ వ్యవహారంలో పార్లమెంట్ వేదికగా తాను సంధించిన ప్రశ్నలను ప్రజలంతా ప్రధాని మోడీని, ఆయన కేబినెట్ మంత్రులను ప్రశ్నించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. రక్షణ శాఖ మంత్రి పార్లమెంట్‌లో 2 గంటలు ప్రసంగించారు. కానీ రాఫెల్‌పై నేనడిగిన 2 సులువైన ప్రశ్నలకు బదులివ్వలేకపోయారు. అని రాహుల్ ట్వీట్ చేశారు. రిలయన్స్ డిఫెన్స్ అధినేత అనిల్ అంబానీకి రాఫెల్‌లో ఆఫ్‌సెట్ కాంట్రాక్ట్ ఎవరిచ్చారు.. ? ప్రధాని మోడీ రాఫెల్ ఒప్పందానికి ఇలా బైపాస్ సర్జరీ చేస్తుంటే రక్షణ శాఖ అధికారులు అభ్యంతరం తెలపలేదా..? రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్‌ను అవును.. కాదు ..రెండింటిలో ఏదో ఒకటి సమాధానం చెప్పాలని కోరా.. అయినా ఆమె నా ప్రశ్నలకు జవాబివ్వలేదు.. అని తాను అడిగిన ప్రశ్నలను కూడా రాహుల్ ట్వీట్టర్ పోస్ట్‌కు ట్యాగ్ చేశారు. దోసవాల్ .. దోజవాబ్ పేరుతో హ్యాస్‌ట్యాగ్ పెట్టిన వీడియోను ప్రతీ భారతీయుడు షేర్ చేసి ప్రధాని మోడీని, కేంద్ర మంత్రులను బదులు అవగండి అంటూ రాహుల్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

ఢిల్లీలో మళ్లీ కేజ్రీ!



ఢిల్లీ: వివాదాలకు కేంద్రబిందువుగా మారిన ఆమ్‌ఆద్మీ పార్టీకే ఢిల్లీ ప్రజలు మరోసారి పట్టం కట్టేలా కనిపిస్తోంది. ఉత్తరాది రాష్ట్రాల్లో మాదిరి ప్రభుత్వ వ్యతిరేకత కేజ్రీ సర్కార్‌కు లేదని, 49శాతం మంది ఢిల్లీ ప్రజలు అరవింద్ కేజ్రీవాల్‌నే మళ్లీ ముఖ్యమంత్రిగా కోరుకుంటున్నారని ఈపీఎస్ సర్వే నిగ్గుతేల్చింది. తర్వాతి స్థానాల్లో బీజేపీ నేత మనోజ్ తివారి (14శాతం), షీలా దీక్షిత్ (12శాతం), హర్షవర్దన్ (12శాతం) ఉన్నారు. ఇక ఆప్ ప్రభుత్వం పనితీరుపై 43శాతం మంది సంతృప్తితో ఉండగా, 34 శాతం మంది అసంతృప్తి వెలిబుచ్చారు. ఇటీవల మూడు రాష్ట్రాల్లో బీజేపీ ఓటమిపాలైనా, హస్తినలో మాత్రం మోడీదే పైచేయిగా ఉంది. ప్రధానిగా 49శాతం మంది మోడీవైపు నిలుస్తుండగా, రాహుల్‌కు 40 శాతం మంది మద్దతుగా నిలిచారు. కేంద్ర ప్రభుత్వ పనితీరు అంశంలో ఢిల్లీ ప్రజలు చెరిసగంగా ఉన్నారు. 41శాతం మంది ఎన్డీయే ఫరవాలేదని చెబుతుండగా, 37శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో రామ మందిరం అంశం కీలకం కానుందని 46 శాతం మంది, దాని ప్రభావం ఉండదని 39 శాతం మంది అభిప్రాయపడ్డారు. మందిరం కోసం ఎన్డీయే ఆర్డినెన్స్ తెస్తుందా? అన్న ప్రశ్నకు 42 శాతం ఔనని, 24శాతం కాదని జవాబిచ్చారు.

అమెరికా వదిలి వెళ్లవద్దు

విదేశీ విద్యార్థులను కోరిన ట్రంప్




వాషింగ్టన్: అమెరికాలో ఉన్నత విద్య అభ్యసిస్తున్న విదేశీ విద్యార్థులు ఇక్కడే ఉండి అమెరికన్ కంపెనీల అభివృద్ధికి దోహదపడాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కోరారు. అమెరికాలో హాస్యాస్పదమైన వలస విధానాల వల్ల ప్రతిభావంతులను కోల్పోతున్నాం అని ట్రంప్ అన్నారు. తనకు దిగ్గజ టెక్ కంపెనీల నుంచి ఫోన్లు వస్తున్నాయని, దేశంలోని గొప్ప విద్యాసంస్థల్లో చదువుకున్న వారిని ఇక్కడ ఉంచలేకపోతున్నామని తనకు చెబుతున్నారని, వాళ్లు తిరిగి జపాన్, చైనా తదితర దేశాలకు వెళ్లిపోతున్నారని, వివిధ కారణాల వల్ల వారికి ఇక్కడ ఉండే అవకాశం లేకుండా పోయిందని, దీంతో గొప్ప ప్రతి భావంతులను కోల్పోతున్నాం అని ట్రంప్ అన్నారు. విదేశీ విద్యార్థులు చదువు పూర్తయిన తర్వాత అమెరికాలో ఉండి ఉద్యోగం చేసుకునే విషయంలో ఎదురవుతున్న ఇబ్బందుల విషయమై డెమోక్రటిక్ కాంగ్రెషనల్ నేతలతో చర్చించినట్లు ట్రంప్ తెలిపారు. చట్టబద్ధమైన వలస విధానాల్లో ఉన్న లొసుగులను అంతం చేసి ప్రతిభ ఆధారంగా వలసలను ప్రోత్సహించాలని ట్రంప్ అన్నారు. ప్రతిభావంతులను వదులుకోబోమని, ప్రజలు చట్టబద్ధంగా, ప్రతిభ ఆధారంగా అమెరికాకు వలస రావాలని తన యంత్రాంగం భావిస్తోందని చెప్పారు.

కాంగ్రెస్‌కు ఓటు బ్యాంకు..

మాకు అన్నదాత

◆ ఎన్నికలప్పుడే గుర్తొస్తారా? ◆ రుణమాఫీతో సమస్యలు పరిష్కారం కావు
◆ అలా జరిగితే ప్రతి రైతుకు రూ.లక్ష మాఫీ చేస్తాం ◆ రైతన్న ఆదాయం రెట్టింపే లక్ష్యం: మోడీ



దల్తోన్‌గంజ్(జార్ఖండ్) : కాంగ్రెస్ పార్టీపై ప్రధాని నరేంద్ర మోడీ మరోసారి విరుచుకుపడ్డారు. రుణమాఫీ పేరుతో కాంగ్రెస్ అన్నదాతను తప్పుదోవపట్టిస్తోందని ఆరోపించారు.. రైతులకు కేవలం ఓటు బ్యాంక్‌గా మాత్రమే పరిగణించే కాంగ్రెస్ పార్టీకి ఎన్నికలొస్తేనే అన్నదాతలు గుర్తొస్తారని మోడీ విమర్శించారు. అన్నదాతకు నిజమైన లబ్ది చేకూర్చేందుకే ఎన్డీఏ ప్రభుత్వం కృషి చేస్తోందని.. తాము అమలు చేస్తున్న పథకాలన్నీ అన్నదాత సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేవేనని చెప్పుకొచ్చారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ దేశవ్యాప్త ప్రచారానికి శ్రీకారం చుట్టిన మోడీ.. జార్ఖండ్‌లో సుడిగాలి పర్యటన చేశారు. జార్ఖండ్ అన్నదాతల వర ప్రదాయని అయిన కోయల్ కరో మండల్ ప్రాజెక్టుకు మోడీ శంకుస్థాపన చేశారు. రూ. 2391.36 కోట్లతో నిర్మిస్తున్న కోయల్ కరో మండల్ ప్రాజెక్టు ద్వారా జార్ఖండ్‌తోపాటు బీహార్‌లోని 19604 హెక్టార్ల పంట భూములు సాగులోకి రానున్నాయి.మండల్ డ్యామ్ పనులు 1972 లో ప్రారంభమైనప్పటికీ గత ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా 1993 లో ఆగిపోయాయని మోడీ గుర్తు చేశారు.

వారిది ఓటు బ్యాంక్ రాజకీయం

రైతును మేము అన్నదాతగా భావిస్తున్నాం. దేశానికి అన్నంపెట్టే రైతన్న సంక్షేమం కోసం బీజేపీ ఎల్లప్పుడూ పరితపిస్తుంది.. కాంగ్రెస్ పార్టీ మాత్రం రైతులకు ఓటు బ్యాంక్‌గా వాడుకుంటుంది. అని మోడీ విమర్శించారు. రైతులకు డబ్బులు అవసరం లేకున్నా బలవంతంగా వారికీ రుణాలు ఇప్పించిన కాంగ్రెస్ పార్టీ..ఎన్నికల వేళ రుణాల మాఫీ చేస్తామంటూ తప్పుదోవ పట్టిస్తోందని మోడీ మండిపడ్డారు. రైతులను ఓటు బ్యాంక్‌గా భావించి ఉంటే ప్రతీ రైతుకు రూ. లక్ష మాఫీ చేసేవాడ్ని. వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందంటే రుణమాఫీ మాకు పెద్ద విషయమే కాదు. కానీ రైతులకు కావాల్సింది తాత్కాలిక ఉపశమనం కాదు.. శాశ్వత పరిష్కారం. అందుకే రైతు ఆదాయాన్ని రెట్టింపు చేసేందుకు కృషి చేస్తున్నాం. అని మోడీ తెలిపారు.

రైతు సమస్యలకు శాశ్వత పరిష్కారం

రైతుల ఆదాయం రెట్టింపు అయితే భావితరాలకు ఇలాంటి కష్టాలు రావు. అని మోడీ పేర్కొన్నారు. కోయల్ అంటే పక్షి పేరు అనుకుంటున్న కాంగ్రెస్ పార్టీకి ఈ ప్రాజెక్టు గురించి అవగాహనే లేదన్న మోడీ.. ప్రాజెక్టు పూర్తయితే తమకు మేలు జరుగుతుందని బీహార్,జార్ఖండ్ ముఖ్యమంత్రులు సమన్వయంతో పనిచేయడం తనకెంతో నచ్చిందన్నారు. సమాఖ్య వ్యవస్థ అంటే ఇది కాదా అని కాంగ్రెస్‌ను ప్రశ్నించారు. జార్ఖండ్ పర్యటనలో భాగంగా 3500 కోట్ల రూపాయల ప్రాజెక్టులకు మోడీ శంకుస్థాపన చేశారు. అంతకు ముందు ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన లబ్దిదారులనుద్దేశించి ప్రసగించిన మోడీ.. యూపీఏ హయాంలో రిమోట్ కంట్రోల్ ప్రభుత్వం నడిచిందని విమర్శించిన మోడీ..ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతీ ఒక్కరికీ బ్యాంక్ ఖాతాసదుపాయం కల్పించి నగదు బదిలీలకు శ్రీకారం చుట్టామన్నారు. గత ప్రభుత్వం 5 ఏళ్ల పాలనలో కేవలం 25 లక్షల ఇల్లను నిర్మిస్తే.. తాము అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లలోనే 1.25 కోట్ల ఇళ్లను నిర్మించి పేదలకు అందించామన్నారు. దేశంలోని పేదలందరికీ సొంతిల్లు నిర్మించి ఇవ్వాలన్నదే ఎన్డీఏ ప్రభుత్వం లక్ష్యమన్న మోడీ.. సంక్షేమ పథకాలకు రాజకీయ నాయకుల పేర్లు పెట్టడం తమ సంస్కృతి కాదన్నారు. నిర్ధిష్ట కాలంలో పనులు పూర్తిచేసేలా స్పష్టమైన విధానాలతో ఎన్డీఏ ప్రభుత్వం పనిచేస్తోందని మోడీ చెప్పుకొచ్చారు.

కాంగ్రెస్ సర్కారా.. మిచెల్ మామ దర్బారా..?

కాంగ్రెస్ పార్టీపై ప్రధాని మోడీ ఘాటైన విమర్శలు చేశారు. ఒడిశాలో బీజేపీ నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న మోడీ.. కాంగ్రెస్ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు మధ్యవర్తుల ఆజ్ఞలను తు.చ తప్పకుండా పాటించిందని విమర్శించారు. ప్రజల కోసం నడిపించాల్సిన ప్రభుత్వాన్ని మధ్యవర్తుల కోసం నడిపించారని మండిపడ్డారు. 2004-2014 వరకు కేంద్రంలో అధికారంలో ఉన్న యూపీఏ ప్రభుత్వం దేశ రక్షణ రంగాన్ని బలహీనపరిచేలా వ్యవహరించిందని ఆరోపించారు. నాటి నిజాలు నేడు ఒక్కొక్కటిగా బయటపడుతుండటంతో కాంగ్రెస్ నాయకులకు క్షోభకు గురిచేస్తున్నాయని విమర్శించారు. దేశానికి కాపాలాదారు ఉండొద్దు.. వారి మార్గాలకు అడ్డొచ్చే నాలాంటి కాపాలాదారున్ని పక్కకు తప్పిస్తే బాగుంటున్నది వారి అభిమతం. కాపాలాదారున్ని తొలగించేందుకు దొంగలు ఎల్లప్పుడు కుట్రలు చేస్తూనే ఉంటారు. కానీ వారి ప్రయత్నాలు ఫలించడం లేదు. నాటి కాంగ్రెస్ పాపాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తుండటంతో ఆ పార్టీ నేతలకు భరించలేని బాధ కలుగుతోంది. అని మోడీ విమర్శించారు.ఇటీవల అరెస్టయిన మిచెల్ క్రిస్టియన్ కాంగ్రెస్ పార్టీ నేతల పేర్లను బయటపెట్టడాన్ని ఉటంకిస్తూ మోడీ ఈ వ్యాఖ్యలు చేశారు. మధ్య వర్తికి ప్రధాని కంటే ఎక్కువ తెలుసు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని నడిపిందా లేకుంటే మిచెల్ మామ దర్బార్‌ను నడిపించిందా.. అని మోడీ చురకలంటించారు. మధ్యవర్తిని కాపాడేందుకు ప్రయత్నిస్తున్న వారందరినీ దర్యాప్తు సంస్థలు విచారణ జరుపు తాయని అన్నారు. దేశ భద్ర కోసం కేంద్రం ఎల్లప్పు డు కఠిన నిర్ణయాలను తీసుకుం టుందని గుర్తు చేశారు. ఆర్మీ దళాలకు అన్యాయం చేసిన వారిని ఎన్నటికీ వదిలిపెట్టే ప్రసక్తేలేదని మోడీ హెచ్చరించారు.

మోడీ కంటే మన్మోహన్ బెటర్

◆ మన్మోహన్‌ను పొగడ్తలతో ముంచెత్తిన శివసేన
◆ పీవీ తర్వాత ప్రధానుల్లో మన్మోహనే గొప్పవారంటూ కితాబు



ముంబై: మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కుతున్న ది యాక్సిడెంటర్ ప్రైమ్ మినిస్టర్ సినిమా ట్రైలర్‌పై శివసేనతనదైన శైలిలో స్పందించింది. మన్మోహన్ సింగ్ ను గొప్ప ప్రధానిగా పొగడ్తలతో ముంచెత్తింది. శివసేన నాయకుడు సంజయ్ రౌతులా మాట్లాడుతూ దేశానికి పదేళ్ల పాటు ప్రధానిగా సేవలందించిన మన్మోహన్ సింగ్ యాక్సిండెంటర్ ప్రధాని కానే కారని.... పీవీ నరసింహారావు తర్వాత దేశానికి సేవ చేసిన ప్రధానుల్లో గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల్లో ఒక పార్టీగా ఉన్న శివసేన నాయకుడు ఈ వ్యాఖ్యలు చేయడం మోడీ గ్రాఫ్‌ను తగ్గించడమే నని నిపుణులు విశ్లేషిస్తున్నారు. శివసేన వ్యాఖ్యలు నిశితంగా గమనిస్తే మోడీ కంటే మన్మోహన్ బెస్ట్ ప్రధాని అన్న అర్థం వచ్చేలా ఉన్నాయని చెబుతున్నారు.

ఆ సీన్లు తొలగించకుంటే అడ్డుకుంటాం..

అనుపమ్ ఖేర్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న ది యాక్సిడెంటర్ ప్రైమ్ మినిస్టర్ సినిమాపై కాంగ్రెస్ నేతలు ఇప్పటికీ ఆగ్రహంగా ఉన్ననేపథ్యంలో శివసేన కూడా ఆ పార్టీకి మద్దతిచ్చినట్లే కామెంట్ చేసింది.యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీని కూడా సినిమాలో తప్పుగా చూపించారని కాంగ్రెస్ నేతలు మండిపడుతున్నారు. యూపీఏ -1 ప్రభుత్వ హ యాంలో మన్మోహన్ సింగ్ సలహాదారుగా వ్యవహరించిన సంజయ్ బారు రాసిన ది యాక్సిండెంటల్ ప్రైమ్ మినిస్టర్ పుస్తకం ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు.ఈ సినిమాను ముందుగా తమకు చూపించిన తర్వాతే విడుదల చేయాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేస్తున్నారు. అభ్యంతరకర దృశ్యాలను తొలగించిన తర్వాత విడుదల చేయకుంటే.. తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

మరో డీల్‌లో మిచెల్ హస్తం

◆ విచారణ సాఫీగా సాగింది ◆ ఢిల్లీ కోర్టుకు ఈడీ వివరణ ◆ ఫిబ్రవరి 26 వరకు రిమాండ్



న్యూఢిల్లీ: అగస్టావెస్ట్‌ల్యాండ్ చాపర్ డీల్‌లో నిందితుడైన క్రిస్టియన్ మిచెల్ విచారణ విజయవంతంగా సాగిందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఢిల్లీ కోర్టుకు తెలిపింది. అతనికి మరొక రక్షణ ఒప్పందంతోనూ సంబంధం ఉన్నట్లు తేలిందని శనివారం వెల్లడించింది. 3600 కోట్ల విలువైన వీవీఐపీ హెలికాప్టర్ల కొనుగోలు స్కాంలో నిందితుడైన మిచెల్‌ను డిసెంబర్‌లో దుబాయ్ నుంచి భారత్‌కు తీసుకొచ్చారు. కొద్దిరోజులు జైలులో ఉన్న తర్వాత, అతడిని కోర్టు ఈడీ కస్టడీకి అప్పగించింది. దాదాపు 14 రోజులు విచారణ అనంతరం కోర్టుకు హాజరు పరచగా, న్యాయస్థానం ఫిబ్రవరి 26 వరకు జ్యుడిషియల్ కస్టడీకి తరలించింది.మిచెల్ విచారణ సాఫీగా జరిగింది. అతనికి వేరొక డీల్‌తోనూ లింకులున్నాయి. పెద్దమొత్తంలో డబ్బు హవాలా మార్గంలో చేతులు మారింది అని ఈడీ కౌన్సెల్ డీపీ సింగ్ న్యాయస్థానానికి వివరించారు. కాగా, ఇటాలియన్ కోర్టులో క్లీన్‌చిట్ లభించినందున తన క్లయింట్‌ను బెయిల్ పై విడుదల చేయాలని మిషెల్ తరపు న్యాయవాది కోర్టును అభ్యర్థించారు. దీన్ని ఈడీ కౌన్సెల్ ఆక్షేపించింది. తప్పుడు పత్రాల ఆధారంగా అతను క్లీన్‌చిట్ పొందాడని, బెయిల్ ఇవ్వడానికి వీల్లేదని వాదించింది. ఎడబ్లు101 హెలికాప్టర్ల కొనుగోలుకు సంబంధించి భారత ప్రభుత్వం 2010లో అగస్టావెస్ట్‌లాండ్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుంది. డీల్‌లో అవకతవకలు జరిగాయని సంస్థ సీఈవో గుసెప్పి ఒర్సిని ఇటాలియన్ అధికారులు 2013లో అరెస్టు చేయడంతో కుంభకోణం వెలుగుచూసింది. మరుసటి ఏడాది భారత్ ఈ ఒప్పందాన్ని రద్దుచేసుకుంది. సుమారు 423 కోట్లు కొల్లగొట్టిన ఆరోపణల్లో, మధ్యవర్తిగా ఉన్న మిషెల్‌కు అగస్టా నుంచి 225 కోట్లు అందాయని ఈడీ పేర్కొంటున్నది.

అఖిలేష్‌పై సీబీఐ కేసు?

◆ ఇసుక అక్రమ రవాణా కేసులో యూపీలో 14 చోట్ల సోదాలు
◆ ఐఏఎస్ అధికారి చంద్రకళ నివాసంలోనూ సీబీఐ తనిఖీలు
◆ రూ.12.5 లక్షల నగదు, 1.8కిలోల బంగారు నగల స్వాధీనం



న్యూఢిల్లీ/లక్నో: సార్వత్రిక ఎన్నికల వేళ సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు, ఉత్తర్‌ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్‌పై సీబీఐ విచారణ ఎదుర్కోనున్నారు. 2019 ఎన్నికల్లో బీజేపీ ఓటమే లక్ష్యంగా వైరిపక్షాలు ఎస్పీ, బీఎస్పీ చేతుల కలిపి సీట్ల సర్దుబాటు చేసుకున్న రోజే సీబీఐ బృందాలు ఏకకాలంలో 14 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించడం రాజకీయవర్గాల్లో కలకలం సృష్టించింది. ఢిల్లీ, నోయిడా, హమిర్‌పూర్, లక్నో, జలౌన్ తదితర ప్రాంతాల్లో సీబీఐ సోదాలు చేసింది. రూ.12.5 లక్షల రూపాయల నగదు, 1.8 కిలోల బంగారు, విలువైన స్థిరచరాస్తుల డాక్యుమెంట్లు సీబీఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఐఏఎస్ అధికారి బి.చంద్రకళ నివాసాలు ఇటు నోయిడా, అటు లక్నోలోనూ తనిఖీలు చేశారు. అఖిలేష్ ప్రభుత్వానికి ఐఏఎస్ అధికారి చంద్రకళ సన్నిహితురాలిగా పనిచేశారని ఆరోపణలు వెల్లువెత్తాయి. నిన్న మొన్నటి వరకు ఆమె డైనమిక్ ఆఫీసర్ అని, అక్రమార్కుల పట్ల కఠినంగా ఉంటారని సామాజిక మాధ్యమాల్లో హోరెత్తించారు. నిజాయితీపరురాలు, అవినీతి పరుల పాలిట సింహస్వప్నం అంటూ ప్రచారం చేశారు. విధి నిర్వహణలో డేరింగ్ డాషింగ్ ఆఫీసర్‌గా కూడా పేరు సంపాదించారు. అదే ఒరవడితోనే అక్రమ మైనింగ్ కార్యకలాపాలకు తెరలేపి, భారీగా సొమ్ము చేసుకున్నట్లు ఆరోపణలొచ్చాయి. దీనిపై కొందరు అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించగా, సీబీఐ దర్యాప్తునకు హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే.

యుద్ధానికి సిద్ధంకండి!



(మొదటిపేజీ తరువాయి)

భవిష్యత్ పరిణామాలపై వారికి మార్గదర్శకం చేశారు. చైనాయే మనకు ప్రధానం అంటూ అమెరికా తాత్కాలిక రక్షణమంత్రి పాట్రిక్ సనహన్ వ్యాఖ్యానించిన నేపథ్యంలో జిన్‌పింగ్ ఆదేశాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

శరవేగంగా ఆధునీకీకరణను అందిపుచ్చుకుంటున్న పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్‌ఏ) రాబోయే ప్రమాదాలు, సవాళ్లు, యుద్ధాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యాధునిక ఆయుధ వినియోగంపై సైనికులంతా అవగాహన కలిగివుండాలి. తిరుగులేని పోరాటానికి సన్నద్ధులవ్వాలి. ఇందుకోసం 2019లో ఏడాదిపాటు వారికి శిక్షణ కార్యక్రమాలు కొనసాగించాలి. ఇండియాతో భూసరిహద్దు సమస్య, ద.చైనా సముద్రజలాల్లో కమ్ముకొస్తున్న వివాదాలు, తైవాన్‌ను తిరిగి ఐక్యం చేసుకునే అంశంలో అమెరికా జోక్యం వంటి పరిణామాలు దేశానికి పెనుసవాళ్లు కానున్నాయంటూ జిన్‌పింగ్ హెచ్చరించారు.


స్వతంత్ర ప్రజాస్వామ్య దేశంగా ఉంటున్న తైవాన్‌ను బలప్రయోగం ద్వారా తిరిగి మనదేశంలో ఐక్యం చేసుకునే హక్కు మనకుందని ఇటీవల జిన్‌పింగ్ చెప్పుకొచ్చారు. అదే సమయంలో డొనాల్డ్ ట్రంప్ ఈ ఐలాండ్ భద్రతకు హామీ ఇస్తున్నట్లు ప్రకటించడాన్ని చైనా తీవ్రంగా పరిగణిస్తోంది. ఆర్మీ బలగాలన్నీ దేశ భద్రత, మారుతున్న పరిణామాలు, ఎదురయ్యే సంక్లిష్టతలు, సవాళ్లపట్ల అవగాహన కలిగి జాగృతమై ఉండాలి. ప్రజలు, ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా సమరానికి సన్నద్ధమై ఉండాలి అని చైనా అధికార పార్టీ అధినేత స్పష్టంచేశారు. ఈ క్రమంలో పార్టీ, ప్రభుత్వ విభాగాలు, కేంద్ర, స్థానిక సంస్థలు రక్షణ, మిలటరీ అభివృద్ధికి మద్దతు ఇవ్వాలని కోరారు. గత శతాబ్దిలో ఎన్నడూ లేనంతగా, ప్రపంచంలో భారీ మార్పులు జరగనున్నాయి. అభివృద్ధి కోసం వ్యూహాత్మక అవకాశాలను అదించుపుచ్చుకునేందుకు చైనాకు ఇది కీలక సమయం. అందుచేత, అనిశ్చితిని వేగంగా, సమర్థవంతంగా ఎదుర్కొనే నేర్పును కలిగివుండాలి. సంయుక్త ఆపరేషన్లకు అనుగుణంగా కమాండింగ్ సామర్థ్యాలను పెంపొందించుకోవాలని జిన్‌పింగ్ మార్గనిర్దేశం చేసినట్లు చైనా అధికార వార్తా సంస్థ జిన్హువా వెల్లడించింది. కాగా, పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ అమ్ముల పొదిలోకి మదర్ ఆఫ్ ఆల్ బాంబ్స్ పేరుతో అత్యంత శక్తివంతమైన అణుయేతర బాంబ్ చేరడం ప్రాధాన్యత సంతరించుకుంది.

మోడీ కంటే రాహుల్ బెస్ట్

◆ ప్రధాని అభ్యర్థిపై తమిళుల మనోగతం ◆ పళని సర్కార్ పనితీరుపై తీవ్ర అసంతృప్తి ◆ తదుపరి సీఎంగా స్టాలిన్‌కు జై కొడుతున్న తంబిలు ◆ రెండు మూడు స్థానాల్లో కమల్, రజనీకాంత్ ◆ ఇండియాటుడే పీఈఎస్ సర్వే వెల్లడి



న్యూఢిల్లీ: 2019 సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాని అభ్యర్థి రేసులో రాహుల్ గాంధీ ముందంజలో నిలిచారు. ఎన్డీయే సారధి, ప్రధాని నరేంద్రమోడీని వెనక్కి నెట్టేశారు. భవిష్యత్ ప్రధానిగా రాహుల్‌కే మెజార్టీ ప్రజలు మద్దతు పలుకుతున్నారు. 28శాతం మంది మోడీకి మద్దతు పలుకుతుండగా, 39శాతం మంది కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ప్రధానమంత్రి కావాలని అభిలషిస్తున్నారు. అయితే ఇది కేవలం తమిళుల అభిప్రాయం మాత్రమే సుమా. ఇటీవల ఓ ఆంగ్లఛానల్ నిర్వహించిన సర్వేలో తమిళులు తమ అంతరంగాన్ని ఆవిష్కరించారు. దేశ ప్రధానిగా మోడీ కంటే రాహుల్ బెస్ట్ అని అభిప్రాయపడ్డారు. తమిళనాడులో మోడీ గ్రాఫ్ క్రమంగా పడిపోతున్నట్లు తెలుస్తోంది. ప్రత్యామ్నాయంగా ఇక్కడి ప్రజలు రాహుల్ గాంధీవైపు మొగ్గుచూపుతున్నారు. ఇండియాటుడే పీఈఎస్ ఈ మేరకు నిర్వహించిన సర్వేలో తమిళ ప్రజలు మోడీ పట్ల మరింత వ్యతిరేకంగా ఉన్నట్లు స్పష్టమైంది. కేంద్ర ప్రభుత్వ పనితీరుపై సంతృప్తిగా ఉన్నవాళ్లు 24శాతం కాగా, 41శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రైతుల విషయానికొస్తే, తమ జీవితాల్లో ఎలాంటి మార్పులు రాలేదని 58 శాతం మంది నిర్లిప్తత కనబరిచారు. అన్నా డీఎంకేతో బీజేపీతో దోస్తీ చేస్తుందా? అన్న ప్రశ్నకు 28 శాతం మంది ఔనని, 30 శాతం మంది కాదని బదులిచ్చారు. కేంద్రంలోని బీజేపీ సర్కార్‌కు పళని ప్రభుత్వం తొత్తుగా పనిచేస్తున్నదని 32 శాతం మంది పేర్కొనడం విశేషం. వ్యవసాయం, తాగునీరు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలే వచ్చే ఎన్నికల్లో ప్రధాన అంశాలుగా ఉండనున్నాయి. 2018 డిసెంబర్ 24 - 2019 జనవరి 2 మధ్య కాలంలో దాదాపు 3930 మంది అభిప్రాయాలతో సర్వే నివేదిక రూపొందించారు. ఇదిలావుండగా దేశ రాజధాని ఢిల్లీలో మాత్రం రాహుల్ కంటే మోడీ అగ్రపథాన నిలిచారు. 49శాతం మంది ప్రజలు మోడీనే ప్రధానిగా కోరుకుంటున్నారు.



తదుపరి తమిళనాడు ముఖ్యమంత్రిగా స్టాలిన్‌కు జనాదరణ క్రమంగా పెరుగుతోంది. గత రెండు నెలల్లో స్టాలిన్ గ్రాఫ్ మరింత పైకి పాకింది. ప్రస్తుత ముఖ్యమంత్రి పళనిస్వామి ప్రభుత్వం పనితీరుపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. 57శాతం మంది పళని సర్కార్ పట్ల వ్యతిరేకతతో ఉన్నారు. అక్టోబర్ 2018తో పోలిస్తే తాజా సర్వేలో మూడు శాతం వ్యతిరేకత పెరిగింది. అదేవిధంగా కిందటిసారి 18శాతం మంది సంతృప్తి

సీఎంగా స్టాలిన్‌కే జనాదరణ

వ్యక్తంచేయగా, ఈసారి ఒకశాతం తగ్గినట్లు సర్వేలో వెల్లడైంది. ఇదే సమయంలో డీఎంకే సారధి పళనిస్వామికి ప్రజాదరణ పెరుగుతూ వస్తోంది. 43శాతం మంది స్టాలిన్ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తున్నారు. ఇక సీఎం రేసులో సినీనటుడు కమల్‌హాసన్‌కు 10శాతం మద్దతు, పీఎంకే లీడర్ రాందాస్‌కు 9శాతం మంది మద్దతు పలుకుతున్నారు. ఆసక్తికర విషయం ఏమంటే, సూపర్‌స్టార్ రజనీకాంత్ (5శాతం) కంటే కమల్‌హాసన్‌కు ఎక్కువ పాపులారిటీ లభించడం. ఈ ఇద్దరిలో రాజకీయ నాయకుడిగా ఎవరు బెటర్ అన్న అంశానికొస్తే 31శాతం మంది భారతీయుడికి జై కొట్టగా, రజనీకి కేవలం 27శాతం మంది మద్దతుగా నిలిచారు.

అట్టుడుకుతున్న కేరళ

◆ మూడోరోజూ కొనసాగిన ఆందోళనలు
◆ సీపీఎం, బీజేపీ నేతల లక్ష్యంగా దాడులు



కన్నూర్/తిరువనంతపురం: కేరళలో వరుసగా మూడోరోజు రణరంగాన్ని తలపిస్తూ ఆందోళనలు కొనసాగాయి. అయ్యప్ప ఆలయంలోకి మహిళల ప్రవేశించిన అనంతరం హిందూ సంస్థలు చేపట్టిన ఆందోళనలు శనివారం కూడా కొనసాగాయి. కన్నూర్‌లో బీజేపీ ఎంపీ ఇంటిపై గుర్తుతెలియని వ్యక్తులు నాటుబాంబులు విసిరారని, పరియారంలోని ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయానికి నిప్పు పెట్టారని శనివారం పోలీసులు తెలిపారు. సీపీఎం ఎమ్మెల్యే ఏఎన్ షంశీర్, కన్నూర్ జిల్లా సీపీఎం మాజీ సెక్రటరీ పీ.శశి నివాసాలపై గుర్తుతెలియని వ్యక్తులు నాటుబాంబులు విసిరిన కొన్నిగంటల్లోనే ఈ దాడి జరిగిందని పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ ఎంపీ మురళీధరన్ మాట్లాడుతూ తలస్సెరిలోని వడియిల్ పీడికియా సమీపంలోని తమ పూర్వికుల నివాసంపై శనివారం తెల్లవారుజామున దాడి జరిగిందన్నారు. దాడి జరిగిన సమయంలో తన కుమార్తెతోపాటు, సోదరి, బావమరిది ఇంట్లో ఉన్నారని అయితే ఎవరికీ ఈ దాడిలో ఎటువంటి గాయాలవలేదని మీడియాకు తెలిపారు. కాగా ఇప్పటివరకు సుమారు 1700మంది ఆందోళనకారులను పోలీసులు అరెస్టు చేశారు. కన్నూర్‌లోని ఇరిత్తి ప్రాంతంలో సీపీఎంకు చెందిన కార్యకర్తపై శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత ఆందోళనకారులు కత్తితో దాడి చేశారు. బాధితుడు ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కోజీకోడ్ జిల్లాలోనే సీపీఎం, బీజేపీ కార్య కర్తల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి.

Andhraprabha business 2018
బిజినెస్
BUSINESS

ఈఎల్ఎస్ఎస్‌తో రెండు లాభాలు


న్యూఢిల్లీ : ఐసీఐసీఐ ప్రొడెన్షియల్‌లో కొనసాగుతున్న వాటిల్లో ఈక్విటీ లింక్డ్ సేవింగ్ స్కీం (ఈఎల్ఎస్ఎస్) ఎంతో ఉత్తమమైందని కంపెనీ చెప్పుకొచ్చింది. ఇన్‌కం ట్యాక్స్ చట్టం 1961, 80సీ ప్రకారం ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్), నేషనల్ సేవింగ్ సర్టిఫికేట్ (ఎన్ఎస్‌సీ) కంటే ఈఎల్ఎస్ఎస్‌లో రెండు రకాలు లాభాలు పొందొచ్చని వివరించింది. ఈక్విటీ లింక్‌డ్ సేవింగ్ స్కీం అనేది ట్యాక్స్ సేవింగ్‌లో ఎంతో ఉత్తమమైందని తెలిపింది. ఈఎల్ఎస్ఎస్ అనేది మ్యూచువల్ ఫండ్‌లో ఓ కేటగిరిగా ఉండిందని, ప్రారంభంలో ఈక్విటీ, ఈక్విటీ సంబంధమైన వాటిలోనే పెట్టుబడి పెట్టడానికి నిర్ణయించడం జరిగిందని, గత రెండు దశాబ్దాలుగా ఈ రంగంలో సేవలు అందించడం జరుగుతోందని వివరించింది. పెట్టుబడిదారుడి ఆదాయం ఏడాదికి రూ.12 లక్షలు ఉంటే ట్యాక్స్ కింద రూ.46,800 పొదుపు పొందే అవకాశం ఉందని తెలిపింది. ప్రస్తుతం ఈఎల్ఎస్ఎస్ కేటగిరిలో ఎన్నో రకాల స్కీంలు అందుబాటులో ఉన్నాయని చెప్పింది. ఐసీఐసీఐ ప్రొడెన్షియల్ లాంగ్ టర్మ్ ఈక్విటీ ఫండ్ మంచి ఛాయిస్ అని, ఇది 10 ఏళ్ల కాలపరిమితితో ఉంటుందని వివరించింది.

జాతీయ కార్మిక సమ్మెకు మద్దతిస్తాం

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: దేశవ్యాప్తంగా ఈనెల 8, 9వ తేదీల్లో జరగనున్న జాతీయ కార్మిక సమ్మెకు మద్ధతిస్తున్నట్టు అఖిల భారత రోడ్డు రవాణా వర్కర్స్ అసోసియేషన్ సమన్వయ సమితి తెలిపింది. జాతీయ సమ్మెకు సంఘీభావంగా సమ్మెలో పాల్గొంటున్నట్టు అఖిల భారత రోడ్డు రవాణా వర్కర్స్ అసోసియేషన్ సమన్వయ సమితి ఉప ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మయ్య వెల్లడించారు. శనివారం ఢిల్లీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రోడ్డు రవాణా వర్కర్స్ డిమాండ్లను ఆయన వివరించారు. వ్యవసాయ రంగం తర్వాత దేశ ప్రజానీకానికి ఉపాధి కల్పిస్తున్నది రవాణా రంగాన్ని కొత్త పన్నుల నుంచి కేంద్ర ప్రభుత్వం మినహాయించాలని లక్ష్మయ్య డిమాండ్ చేశారు. గడిచిన రెండేళ్లలో రవాణా రంగం నుంచి కేంద్ర ప్రభుత్వం రూ. 3,09,601 కోట్లు పన్నుల రూపేణా వసూలు చేసినట్టు తెలిపారు. వసూలు చేసిన మొత్తం రోడ్డు రవాణాభివృద్ధికే వెచ్చించాల్సి ఉన్నప్పటికీ సర్కారు సరైన విధంగా కేటాయింపులు చేయడం లేదని వాపోయారు.

మరోసారి బ్యాంకుల సమ్మె

• 8, 9వ తేదీల్లో సేవలు బంద్



న్యూఢిల్లీ : ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా ఉన్న 10 బ్యాంకులు జనవరి 8, 9వ తేదీల్లో చేపట్టే సమ్మెకు పీఎస్‌యూలోని రెండు ఉద్యోగ సంఘాలు మద్దతు ప్రకటించాయి. జనవరి 8-9న దేశ వ్యాప్తంగా సమ్మె చేపడుతున్నట్టు ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ), బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలు ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ)కు తెలియ జేసినట్టు ఐడీబీఐ బ్యాంక్ బీఎస్ఈ ఫైలింగ్‌లో పేర్కొంది. రెండు రోజుల సమ్మెతో కొన్ని ప్రాంతాల్లోని బ్యాంకు కార్యకలాపాలపై ప్రభావం ఉండే అవకాశాలు ఉన్నాయని బ్యాంక్ ఆఫ్ బరోడా తెలిపింది. ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, హెచ్ఎంఎస్, సీఐటీయూ, ఏఐయూటీయూసీ, ఏఐసీసీటీయూ, యూటీయూసీ, టీయూసీసీ, ఎల్‌పీఎఫ్, ఎస్ఈడబ్ల్యూఏ ట్రేడ్ సంఘాలు సమ్మెకు మద్దతు ప్రకటించాయి. తమ న్యాయమైన 12 డిమాండ్లను వెంటనే నెరవేర్చాలంటూ బ్యాంకులు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. వేతన సవరణ, పెన్షన్‌తో పాటు ఇతర సమస్యల పరిష్కారానికి డిమాండ్ చేస్తూ ఏఐబీఓసీ డిసెంబర్ 21న సమ్మె చేపట్టింది. బ్యాంక్ ఆఫ్ బరోడ, దేనా బ్యాంక్, విజయ బ్యాంక్‌ల విలీనాన్ని వ్యతిరేకిస్తూ 26న మళ్లీ ఉద్యోగులు, అధికారులు సమ్మెలో పాల్గొన్న విషయం తెలిసిందే.

బ్యాంకుల్లో నియంత్రణ అవసరం

ముంబై : బ్యాంకింగ్ సెక్టార్‌ను సంక్షోభం వెంటాడుతోందని, దీనికి కారణం సరైన డేటా లేకపోవడమే అని ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ అభిప్రాయపడ్డారు. ఆర్థిక రంగంలో క్రమబద్ధమైన వృద్ధి సాధించడానికి తోడ్పాటు అందించాలని పిలుపునిచ్చారు. ఎన్‌బీఎఫ్‌సీ సెక్టార్‌కు సంబంధించిన సమాచార కోసం ఓ వ్యవస్థను రూపొందించడానికి ప్రభుత్వం రిజర్వ్ బ్యాంక్‌తో కలిసి ముందుకు వెళ్లేందుకు యోచిస్తోందని అన్నారు. గతేడాది ఆగస్టు, ఎన్‌బీఎఫ్‌సీలో ప్రధానంగా ఉన్న ఐఎల్ అండ్ ఎఫ్ఎస్‌లో నెలకొన్న సంక్షోభం గురించి ప్రస్తావించారు. ఈ క్రైసిస్ నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీస్ సెక్టార్ అంతా వ్యాపించిందన్నారు. లిక్విడిటీ, విశ్వాసం కోల్పోవడంతో ఈ సంక్షోభం వచ్చినట్టు ప్రాథమికంగా నిర్ధారించినట్టు గార్గ్ వివరించారు. ఫలితంగా డీహెచ్ఎఫ్ఎల్, ఇండియా బుల్స్‌తో పాటు పలు సంస్థల షేరు విలువలు గణనీయంగా పడి పోయాయని తెలిపారు. ఎన్‌బీఎఫ్‌సీలు ప్రగతి సాధించాలంటే నియంత్రణ ఎంతో అవసరం అని, దీన్ని లెక్క చేయకపోతే మాత్రం అభివృద్ధి తిరోగమిస్తుందని అభిప్రాయపడ్డారు. ఎన్‌బీఎఫ్‌సీల పెట్టుబడిదారుల అవసరాలు తీర్చాలంటే కొన్ని నిబంధనలు తీసుకురావాలి.

చైనా నుంచి చాలా తీసుకున్నాం...
తిరిగి ఇచ్చేయాలి...!
లేదంటే విమర్శలు ఎదుర్కొంటాం

• చైనాతో అమెరికా వాణిజ్య ఒప్పందాలు
• జిన్‌పింగ్ నా స్నేహితుడు • ఒకరిపై ఒకరికి గౌరవం పెరిగింది • అర్జెంటీనా చర్చలు ఫలించాయి
• ఉన్నత స్థాయికి ఇరు దేశ అధికారుల చర్చలు : ట్రంప్



వాషింగ్టన్ : నువ్వా.. నేనా అన్నట్టు వేడెక్కిన అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం ఇప్పుడు మెల్లిగా చల్లబడుతోంది. ఏడాది కాలంగా ఒకరిపై ఒకరు టారీఫ్ వార్ ప్రకటించడంతో ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థ ఒకింత ఒడిదుడుకులు ఎదుర్కొందనే చెప్పాలి. ముందుగా అమెరికా ట్రేడ్ వార్‌ను ప్రారంభించింది. అమెరికాలో దిగుమతి అయ్యే కొన్ని చైనా వస్తువులపై ట్రంప్ రెట్టింపు సుంకాన్ని విధించడంతో ఈ యుద్ధం ప్రారంభమైంది. తామేం తక్కువ కాదన్నట్టు చైనా కూడా అమెరికా బాటలోనే వెళ్లింది. చైనా-అమెరికా మధ్య నెలకొన్న విపత్కర పరిస్థితులు ఇతర దేశాలపై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. అమెరికా-చైనా మధ్య వాణిజ్య ఒప్పందాలపై చర్చలు ఊపందుకున్నాయని అగ్రరాజ్యం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పుకొచ్చాడు. గతేడాది పెంచిన టారీఫ్‌లతో అమెరికా స్టీల్ ఇండ్రస్టీ ఒకానొక సమయంలో కుదేలైంది. ఇప్పుడిప్పుడే పరిశ్రమలు పుంజుకుంటున్నాయనే చెప్పుకోవచ్చు. 2018 మార్చిలో అమెరికాలో దిగుమతి అవుతున్న స్టీల్, అల్యూమీనియంపై ట్రంప్ పరిపాలనా విభాగం భారీగా సుంకాలు విధించింది. ఇది ప్రపంచ వ్యాప్తంగా వాణిజ్య యుద్ధంలా భయాందోళనకు గురి చేసింది. ప్రపంచంలో అమెరికా తరువాత రెండో అతిపెద్ద ఆర్థిక శక్తిగా చైనా ఉండేది. పెంచుతున్న టారీఫ్‌లకు బెదరకుండా కొన్ని బి.డాలర్ల అమెరికా వస్తువులపై చైనా సుంకాలు విధిస్తూ వచ్చింది.

జీ-20 సమ్మిట్‌తో కీలక మలుపు

నవంబర్, అర్జెంటీనాలో జరిగిన జీ-20 సమ్మిట్‌లో అమెరికా-చైనా ఓ ఒప్పందానికి వచ్చాయి. మార్చి వరకు సుంకాలు విధించాలని నిర్ణయిం చుకున్నాయి. 375 బిలియన్ డాలర్ల వాణిజ్య లోటును తగ్గించాలన్న అమెరికా డిమాండ్‌కు చైనా చర్యలు చేపట్టింది. మార్చి 1, 2019 నాటికి ఈ ప్రక్రియ పూర్తి కావాలని భావిస్తున్నాయి. దీనికి సంబంధించి అమెరికా, చైనా ఉన్నతాధికారుల చర్చలు అత్యున్నత స్థాయికి చేరుకున్నాయి. రోజ్ గార్డెన్స్‌లో నిర్వహించిన న్యూస్ కాన్ఫరెన్స్‌లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాట్లాడుతూ.. తాము చైనాతో వాణిజ్యపరమైన చర్చలు జరుపుతున్నామని, ఈ విషయంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఉత్సాహంగా పాల్గొంటున్నారని అన్నారు. ఈ చర్చలు ఇరు దేశాలకు మంచి చేకూరుస్తాయని భావిస్తున్నట్టు తెలిపాడు.

45 నిమిషాలే అనుకున్నాం...

అర్జెంటీనాలో జిన్‌పింగ్‌తో 45 నిమిషాల పాటు భేటీ కావాలని భావించానని, కానీ అది సుమారు 4 గంటల పాటు కొనసాగిందన్నాడు. ఈ భేటీ ఇరు దేశాల మధ్య స్నేహ పూర్వక వాతావరణానికి దారి తీసిందని వివరించాడు. టారీఫ్‌ల కారణంగా కొన్ని బిలియన్ డాలర్లు పొందామని, చైనాతో వాణిజ్య ఒప్పందం చేసుకుని లాభాలు అందజేస్తామని, అలా చేయకపోతే ప్రపంచంలో ఇంతకంటే చెడు ఆలోచన ఉండదని ట్రంప్ అభిప్రాయపడ్డాడు. చైనా ఏం కోరుకుంటోందో అది ఇస్తామని, దీని కోసం బలమైన బంధాన్ని కొనసాగిస్తామని వివరించాడు. జిన్‌పింగ్‌తో తనది మంచి బంధం ఉంటుందని భావిస్తున్నా అన్నారు. నార్త్ కొరియాతో కూడా తాము ఎంతో బాగా వ్యవహరిస్తున్నామని, రిలేషన్ షిప్‌ను ఇలాగే ముందుకు తీసుకెళ్తామని ట్రంప్ వివరించాడు.

చైనా నుంచి బి.డాలర్ల సుంకాలు

టారీఫ్ ద్వారా చైనాతో పాటు ఇతర దేశాల నుంచి కొన్ని బిలియన్ డాలర్లు పొందడం జరిగిందని, స్టీల్ పరిశ్రమలు ఇప్పుడిప్పుడే అభివృద్ధిపథంలోకి అడుగిడుతున్నాయని అన్నారు. ఇది తనకు ఎంతో ఆనందాన్ని ఇస్తోందని ట్రంప్ తెలిపాడు. నవంబర్‌లో ట్రంప్, జిన్‌పింగ్ బ్యూనస్ ఏయిర్స్‌లో కలుసుకున్నారు. చైనా తమకు అద్భుతమైన టారీఫ్‌ను చెల్లిస్తోందని, కొన్ని బిలియన్ డాలర్లు అమెరికా ఖజానాలోకి వచ్చి చేరాయన్నారు. ఇప్పటి వరకు ఇంత పెద్ద మొత్తం చైనా నుంచి పొందలేదని తెలిపాడు. జిన్‌పింగ్‌తో సమావేశమైన అనంతరం ఒకరిపై ఒకరికి ఎంతో గౌరవం పెరిగిందన్నాడు. చైనాతో సమావేశం ఎప్పటికీ మరిచిపోలేనిదని, దీనికి చైనా నుంచి అందరూ హాజరయ్యారని, ఎంతో ఆనందించాల్సిన విషయంగా భావిస్తున్నా రన్నారు.

టిమ్ నా ఆప్త మిత్రుడు

చైనాలో యాపిల్ ఉత్పత్తులు ప్రారంభించాలని భావిస్తున్నా అని అన్నారు. టిమ్ కుక్ తనకు మంచి స్నేహితుడు అని, నేనంటే తనకెంటో ఇష్టమని తెలిపాడు. అమెరికాలో కూడా వ్యాపారం చేయాలని కోరుతున్నట్టు సూచించాడు. అత్యాధునిక వసతులతో ప్లాంట్‌లు స్థాపించాలని టిమ్‌ను ఆహ్వానిస్తున్నట్టు ట్రంప్ వివరించాడు. చైనాలో ఉత్పత్తి ప్రారంభిస్తే యాపిల్‌కి అమెరికాలో కంటే ఎక్కువ లాభాలు వస్తాయన్నాడు. ఎందుకంటే అక్కడ ఎక్కువ ప్లాంట్‌లు స్థాపిస్తారని తెలిపాడు. ప్రస్తుతం సంస్థ అమెరికాలో 350 బి.డాలర్లు పెట్టుబడులు పెడుతోందన్నారు.

లిక్కర్ కింగ్ విజయ్ మాల్యా...
‘పారిపోయిన ఆర్థిక నేరగాడు’

• ప్రకటించిన పీఎంఎల్ఏ కోర్టు
• చట్టం వచ్చాక మొదటి వ్యాపారిగా ట్యాగ్



ముంబై : లిక్కర్ కింగ్ విజయ్ మాల్యాకు ముంబైలోని పీఎంఎల్ఏ కోర్టులో ఎదురుదెబ్బ తగలింది. విజయ్ మాల్యాను పారిపోయిన ఆర్థిక నేరగాడిగా శనివారం పీఎంఎల్ఏ కోర్టు ప్రకటించింది. పలు బ్యాంకులకు సుమారు రూ. 10వేల కోట్ల మేర రుణాలు ఎగ్గొట్టి మాల్యా లండన్‌లో తలదాచుకుంటున్న విషయం తెలిసిందే. పీఎంఎల్ఏ కోర్టులో ఎట్టకేలకు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విజయం సాధించారనే చెప్పొచ్చు. పారిపోయిన ఉన్న ఆర్థిక నేరగాళ్ల చట్టం 2018 ప్రకారం మాల్యాకు ఈ ట్యాగ్ తగలించారు. దీంతో గతేడాది ఆగస్టులో తీసుకొచ్చిన ఈ కొత్త చట్టం కింద పారిపోయిన ఆర్థిక నేరగాడు మొదటి వ్యాపారి కావడం విశేషం. పారిపోయిన ఆర్థిక నేరగాడిగా ట్యాగ్ ఇవ్వాలని కోరుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ గతంలో పీఎంఎల్ఏ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈడీ పిటిషన్‌పై స్టే విధించాలని కోరుతూ మాల్యా గతంలో వేసిన పిటిషన్‌ను పీఎంఎల్ఏ కోర్టు తోసిపుచ్చింది. పలుమార్లు విచారించిన న్యాయస్థానం ఈడీకి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఈడీ కౌన్సిల్, మాల్యా తరపు న్యాయవాది వాదోపవాదాలు విన్న తరువాత, సెక్షన్ 12 ప్రకారం మాల్యా పారిపోయిన ఆర్థిక నేరగాడే అని ప్రత్యేక న్యాయస్థానం జడ్జి ఎంఎస్ అజ్మీ ప్రకటించారు. తాను పారిపోలేదంటూ మాల్యా గతంలో సుప్రీం కోర్టును ఆశ్రయించగా, అక్కడ కూడా పరాభవమే ఎదురైంది. రుణాలు ఎగ్గొట్టిన మాల్యాను భారత్‌కు అప్పగించాలని లండన్‌లోని వెస్ట్‌మినిస్టర్ న్యాయస్థానం గతంలోనే తీర్పు ఇచ్చింది. తప్పుడు కేసులు పెట్టినట్టు ఎలాంటి ఆధారాలు లేవని, అందుకే మాల్యా భారత్ కోర్టుకే సమాధానం చెప్పుకోవాలంటూ వెస్ట్‌మినిస్టర్ న్యాయస్థానం చెప్పుకొచ్చింది. దీంతో ముంబైలోని ఆర్థర్ జైల్లో గదిని కూడా సిద్ధం చేశారు. లండన్ నుంచి తీసుకొచ్చాక మాల్యాను ఇక్కడే ఉంచనున్నట్టు తెలుస్తున్నది. చివరికి పారిపోయిన ఆర్థిక నేరగాడిగా ట్యాగ్ తగలించడంతో మాల్యా ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు.

మూడు రీజనల్ బ్యాంకుల విలీనం

న్యూఢిల్లీ : ప్రభుత్వం ఇప్పటికే మూడు జాతీయ స్థాయి బ్యాంకుల విలీనానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీన్ని వ్యతిరేకిస్తూ బ్యాంకు సంఘాలు ఆందోళనలు చేపడుతూనే ఉన్నాయి. ఇది సద్దుమణగక ముందే మూడు రీజనల్ బ్యాంకులను విలీనం చేసింది. పంజాబ్ గ్రామీణ బ్యాంక్, మాల్వా గ్రామీణ బ్యాంక్, సట్లేజ్ గ్రామీణ బ్యాంకుల విలీనం జనవరి 1 నుంచే అమల్లోకి వచ్చినట్టు ప్రభుత్వం శనివారం తెలిపింది. దీనిపై ప్రభుత్వం తమతో సంప్రదింపులు జరిపిందని పంజాబ్, సింద్ బ్యాంక్ అధికారులు తెలిపారు.

విలీనంపై ఇతర బ్యాంకులు కూడా ఆసక్తి చూపిస్తున్నాయని, దీంతో మెరుగైన సేవలు అందుతాయని వివరించి నట్టు చెప్పారు. రీజినల్ రూరల్ బ్యాంక్‌లు అన్నీ కలిపి సింగిల్ రీజనల్ రూరల్ బ్యాంక్‌లు మార్చి నట్టు కేంద్ర ప్రభుత్వం బీఎస్ఈ ఫైలింగ్‌లో చెప్పు కొచ్చింది. ఆర్ఆర్‌బీల విలీనానికి నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (నాబార్డ్), పంజాబ్ నేషనల్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్, సింద్ బ్యాంకులు స్పాన్సర్‌గా వ్యవహరించాయని వివరించారు.

భారత్ వస్తే ప్రాణానికి ప్రమాదం

• కేసును రాజకీయం చేస్తున్నారు: నీరవ్‌మోడీ



ముంబై: భారత్ వస్తే తనకు ప్రాణహాని ఉందని, అందుకే రావడానికి ఇష్టపడటం లేదని, కేసును కూడా రాజకీయం చేస్తున్నారంటూ వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ కోర్టుకు చెప్పుకొచ్చాడు. దేశ వ్యాప్తంగా సంచలన సృష్టించిన రూ.13వేల కోట్ల పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణంలో నీరవ్ మోడీ ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. పీఎంఎల్ఏ చట్టం ప్రకారం.. నీరవ్ మోడీని పరారీలో ఉన్న ఆర్థిక నేరగాడిగా పరిగణించాలని కోరుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. శనివారం దీనిపై వాదనలు జరిగాయి. తన క్లైంట్ ఏ తప్పూ చేయలేదని మోడీ తరపున న్యాయవాది కోర్టుకు విన్నవించాడు. భద్రతా పరమైన కారణాల రీత్యా భారత్ రాలేకపోతున్నాడని చెప్పుకొచ్చాడు. ఓ సివిల్ ట్రాన్సాక్షన్‌ను కుంభకోణంగా మలిచారని, తానేం తప్పు చేయలేదని నీరవ్ చెప్పుకొచ్చాడు. లావాదేవీలన్నీ తప్పుల తడకగా చూపించి రాజకీయం చేస్తున్నారని వివరించాడు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కూడా తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని చెప్పుకొచ్చాడు. తన కేసును అన్ని పార్టీలు రాజకీయంగా వాడుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశాడు. నీరవ్‌ను భారత్ రప్పించేందుకు ఈడీ విశ్వ ప్రయత్నాలు చేస్తున్నది. ఇప్పటికే ఇంటర్‌పోల్ అధికారులు కూడా రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేశారు. బ్రిటన్‌లోనే నీరవ్ తలదాచుకున్నట్టు భారత్ భావిస్తున్నది. నీరవ్‌తో మెహుల్ చోక్సీ కూడా పీఎన్‌బీ కుంభకోణంలో నిందితుడిగా ఉన్నాడు. మూడు సార్లు సమన్లు జారీ చేసినా నీరవ్ బదులు ఇవ్వకపోవడంతోనే పరారీలో ఉన్న ఆర్థిక నేరగాడిగా పరిగణించాలని ఈడీ ప్రత్యేక కోర్టును కోరుతోంది.

సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలకు...
శుభవార్త..!

• లెవీ మినహాయింపునకు కౌన్సిల్ నిర్ణయం! • నేడు మంత్రి వర్గ సమావేశం



న్యూఢిల్లీ : జీఎస్‌టీ కౌన్సిల్ కింద రెండు మంత్రివర్గ ప్యానెల్‌లు ఆదివారం సమావేశం కానున్నాయి. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలకు (ఎంఎస్ఎంఈ) శుభవార్త అందించనున్నాయి. నూతన పరోక్ష పన్ను నిబంధనల్లో భాగంగా విపత్తు సెస్ యొక్క లెవీ నుంచి మినహాయింపు ఇవ్వాలనే నిర్ణయం తీసుకోనున్నారు. ఆరుగురు మంత్రులు ఉన్న బృందం ఎంఎస్ఎంఈపై సమీక్షిస్తారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి శివ్ ప్రతాప్ శుక్లా ఆధ్వర్యంలో ఈ భేటీ జరగనుంది. జీఎస్‌టీ వచ్చాక చిన్న తరహా పరిశ్రమలు కుదేలయ్యాయని, దీంతో చాలా వరకు సంస్థలు మూతపడ్డాయని మంత్రి వర్గం భావిస్తున్నది. ఏడాదికి రూ.20 లక్షల టర్నోవర్ ఉన్న పరిశ్రమలను జీఎస్‌టీ నుంచి కేంద్రం మినహాయింపు ఇచ్చింది. గతేడాది ఆగస్టులో ఎంఎస్ఎంఈ మంత్రుల బృందం ఏర్పాటు అయ్యింది. ఇందులో బిహార్ డిప్యూటీ సీఎం సుశీల్ మోడీ, అస్సాం ఆర్థిక శాఖ మంత్రి హిమంత బిస్వా శర్మ, ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా, కేరళ ఆర్థిక శాఖ మంత్రి థామస్ ఇస్సాక్, పంజాబ్ ఆర్థిక శాఖ మంత్రి మన్‌ప్రీత్ సింగ్ బాదల్ ఉన్నారు. సుశీల్ మోడీ నేతృత్వం వహిస్తున్న మరో మంత్రుల బృందం విపత్తు సెస్‌పై సమావేశం కానున్నట్టు అధికారులు వివరించారు. దేశ వ్యాప్త విపత్త పన్ను విధించాలా..? వద్దా..? అనే అంశంపై మోడీ నేతృత్వంలోని మంత్రుల బృందం గత ఏడాది అక్టోబర్‌లో అభిప్రాయాలను కోరిన విషయం తెలిసిందే. శర్మ, ఇస్సాక్, బాదల్‌తో పాటు మంత్రుల బృందంలో ఒడిశా ఆర్థిక శాఖ మంత్రి శశి భూషణ్ బెహ్రా, మహారాష్ట్ర ఫైనాన్స్ మినిస్టర్ సుధీర్ మురగంటివార్, ఉత్తరాఖండ్ ఫైనాన్స్ మినిస్టర్ ప్రకాశ్ పంత్ ఉన్నారు. రెండు మంత్రుల బృందాలు తీసుకున్న నిర్ణయాలను 10వ తేదీన జరిగే జీఎస్‌టీ కౌన్సిల్ సమావేశం ముందు ఉంచుతాయి. నిర్మాణంలో ఉన్న ఫ్లాట్లపై విధిస్తున్న 12 శాతం జీఎస్‌టీని 5 శాతం చేయాలనే దానిపై కూడా 10వ తేదీన చర్చించే అవకాశం ఉంది.

గాల్లోనే ఆగిన విమాన ఇంజిన్

• ఇండిగో ఎయిర్ బస్ ఏ320కు తప్పిన ముప్పు
• చెన్నై నుంచి కోల్‌కతా వెళ్తున్నప్పుడు ఘటన
• విచారణకు ఆదేశించిన పౌర విమానయాన శాఖ



ముంబై : గాల్లో ఉన్నప్పుడే ఇండిగో ఎయిర్‌బస్ ఏ320 నియో విమానం ఇంజిన్ పని చేయకుండాపోవడం ఘటనపై పౌర విమాన మంత్రిత్వ శాఖ ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై వెంటనే విచారణ జరిపించాలని ఆదేశించింది. ప్రైట్ అండ్ విట్నీ ఇంజిన్ దీనికి అమర్చడం జరిగింది. జనవరి 3న ఈ ఘటన చోటు చేసుకోగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చెన్నై నుంచి కోల్‌కతా వెళ్తున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఇంజిన్ పని చేయకపోవడం గుర్తించిన పైలెట్లు విమానాన్ని మళ్లీ చెన్నై విమానాశ్రయానికి తీసుకెళ్లిపోయారు. అప్పటి నుంచి ఆ విమానాన్ని పక్కనపెట్టినట్టు తెలుస్తున్నది. గాల్లో ఉన్నప్పుడే ఇంజిన్‌లో పెద్ద పేలుడు సంభవించినట్టు సమాచారం. కొన్ని సాంకేతిక కారణాలతో విమానాన్ని తిరిగి చెన్నైకి తీసుకెళ్లడం జరిగిందని ప్రయాణికులకు సిబ్బంది వివరించారు. మంగళవారం దీనిపై విచారణ జరుపుతున్నామని సివిల్ ఏవియేషన్ సెక్రెటరీ ఆర్ఎన్ చౌబే తెలిపారు. విమానం ఏయిర్‌బస్ తయారు చేయగా, అమెరికాలో తయారైన ప్రైట్ అండ్ విట్నీ ఇంజిన్‌ను దీనికి అమర్చినట్టు తెలిపారు. ఇంజిన్ బ్లేడులు కూడా ధ్వంసమైనట్టు తెలుస్తున్నది. ఏ320 విమానంలో మొదటి సారి సమస్య తలెత్తిందని, పొగ, భారీ వైబ్రేషన్, భారీ శబ్దాలు రావడం వంటివి జరిగాయి. పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాకే సేవలు వినియోగించుకుంటామని ఇండిగో సిబ్బంది తెలిపారు.

పెన్షన్లు సవరించాలి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : బ్యాంక్ ఉద్యోగుల వేతన సవరణతో పాటుగా తమ పింఛన్లు కూడా సవరించి పెంచాలని వివిధ బ్యాంకుల రిటైర్డ్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం ధర్నాచౌక్‌లో నిరసన ధర్నా నిర్వహించారు. కోఆర్డినేషన్ ఆఫ్ బ్యాంక్ పెన్షనర్స్ అండ్ రిటైరీస్ ఆర్గనైజేషన్ (సీబీపీఆర్ఓ), అఖిల భారత బ్యాంక్ రిటైరీస్ సమాఖ్య (ఏఐబీఆర్ఎఫ్)ల ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఏఐబీఆర్ఎఫ్ తెలంగాణ అధ్యక్షుడు ఏ.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ... ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి ఐదేళ్లకోసారి పెన్షన్ పెంచుతున్నారని, కానీ బ్యాంకు ఉద్యోగులకు రిటైర్ అయిన రోజున నిర్ణయించిందే జీవితాంతం చెల్లిస్తున్నారన్నారు. సీబీపీఆర్ఓ జాయింట్ కన్వీనర్ ఎ. రమేశ్‌బాబు, నాబార్డు రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కైలాస్‌పతి మాట్లాడుతూ.. సుప్రీం ఆదేశాల మేరకు పరిష్కరించాలన్నారు.

హెచ్ఏఎల్‌లో ఆర్థిక సంక్షోభం

• 20 వేల మందికి మూడు నెలలుగా అందని వేతనాలు
• జీతభత్యాలు, ఇతర అవసరాలకు రూ. 1000 కోట్ల అప్పు

న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ రక్షణ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)లో ఆర్థిక సంక్షోభం నెలకొంది. 20వేలకు పైగా ఉద్యోగులకు మూడు నెలల నుంచి జీతాలు చెల్లించలేదు. జీతాలతో పాటు ఇతరాత్ర అవసరాల కోసం కంపెనీ సుమారు రూ.1000 కోట్ల అప్పు చేయాల్సి వచ్చింది. గత రెండు మూడు దశాబ్దాల కాలంగా ధనవంతులుగా ఉన్న హెచ్ఏఎల్ సంస్థ మొదటి సారిగా నగదు కోసం అప్పు చేయాల్సి పరిస్థితి వచ్చింది. ఈ సందర్భంగా హెచ్ఏఎల్ చైర్మన్ ఆర్ మాధవన్ మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా ఆర్థికంగా ఎంతో బలంగా ఉన్న సంస్థ లోటు బడ్జెట్ సమస్య ఎదుర్కొంటోందన్నారు. ఇలాగే కొనసాగితే మాత్రం మార్చి వరకు లోటు బడ్జెట్ రూ.6వేల కోట్లకు చేరుకున్నా ఆశ్చర్యపోనక్కర్లేదని మాధవన్ తెలిపారు. భారత వైమానిక దళం బకాయిలు చెల్లించకపోవడంతోనే ఆర్థిక సంక్షోభం ఎదుర్కొంటున్నట్టు తెలిపింది. 2017 సెప్టెంబర్ నాటికి రూ.14,500 కోట్ల బకాయిలో ఇప్పటి వరకు కేవలం రూ.2వేల కోట్లు మాత్రమే చెల్లించిందని మాధవన్ వివరించారు. 2017-18 సంవత్సరానికి గాను రక్షణ మంత్రిత్వ శాఖ రూ.13,500 కోట్ల బడ్జెట్‌ను ఆమోదించింది. అప్పటి నుంచి పెండింగ్‌లో ఉన్న బకాయిలతో కలిపి సవరించిన బడ్జెట్ రూ.33,715 కోట్లుగా ఉంది. డిసెంబర్ 31 నాటికి రూ.15,700 కోట్ల బకాయి ఉందని, మార్చి 31 నాటికి రూ.20వేల కోట్లకు చేరుతుందని మాధవన్ వివరించారు. ఐఏఎఫ్ రూ.14,500 కోట్లు చెల్లించాల్సి ఉండగా, మిగిలినవి భారతీయ సైన్యం, నావికాదళం, కోస్ట్‌గార్డ్స్ నుంచి రావాల్సి ఉన్నాయి.

రైతుల సంక్షేమమే లక్ష్యం

• 25లోగా చుక్కల భూముల సమస్యకు చెక్ • ప్రజాఫిర్యాదులు బాగా తగ్గాయ్
• అందరికీ సంక్షేమ ఫలాలు • నవ్యాంధ్ర కొచ్చిన ఉద్యోగులను ఆదుకుంటాం
• టెలీకాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

అమరావతి, ఆంధ్రప్రభ: గడిచిన 64 ఏళ్ళుగా రైతులను సుదీర్ఘంగా సతమతం చేస్తున్న చుక్కల భూముల సమస్యను తక్షణమే పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీచేశారు. ఒకవైపు భూమిని బదిలీ చేసుకునే అవకాశం లేకపోవడంతోపాటు మరోవైపు విక్రయించుకునే పరిస్థితి లేక అనేకమంది రైతులు సతమతం అవుతున్నారని, దీన్ని సుమోటాగా తీసుకుని ఈ నెల 25 లోగా పరిష్కారం చూపించాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ఫిర్యాదు దారులకు న్యాయం జరగాలని, రైతుల కళ్ళల్లో ఆనందం కనిపించాలని స్పష్టం చేశారు. శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉండవల్లిలోని తన నివాసం నుంచి 4వ రోజు జన్మభూమి- మా ఊరు కార్యక్రమ నిర్వహణపై కలెక్టర్లు, నోడల్ అధికారులు, ప్రజాప్రతినిధులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాజాగా జరుగుతున్న జన్మభూమి కార్యక్రమంలో ఫిర్యాదుల సంఖ్య సగానికి తగ్గిందని, ప్రజల భాగస్వామ్యం రెట్టింపు అయిందన్నారు. గడిచిన నాలుగున్నరేళ్ళుగా తమ కృషికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. ప్రతి గ్రామం, వార్డులన్నింటిని అభివృద్ధి చేయడంతోపాటు పేదలందరికి సంక్షేమ ఫలాలను అందిస్తున్నామన్నారు. మరోవైపు చేసిన అభివృద్ధి ప్రతి ఒక్కరికి కనిపిస్తుందన్నారు. అర్హులైన వారందరికి సంక్షేమాన్ని అందిస్తున్నామని, దీంతో ప్రజా సంతృప్తి పెరిగి ఫిర్యాదుల సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను మరింత పెంచేందుకు జన్మభూమి దోహదపడుతుందన్నారు. రేషన్, పించన్, పక్కాఇళ్ళ కోసం వచ్చే అర్జీలను తక్షణమే పరిష్కరించి అర్హులందరికి న్యాయం చేయాలని అధికార యంత్రాంగాన్ని నిర్దేశించారు. రాష్ట్ర ప్రగతికి రథాలు ప్రజలు, ఉద్యోగులేనని వీరి సంక్షేమానికి అనేక కార్యక్రమాలను చేపట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడించారు. ఉద్యోగుల నేస్తం తమ ప్రభుత్వమన్నారు. సొంత ఇల్లు లేని ప్రతి ఉద్యోగికి ఆ కలను సాకారం చేసే బాధ్యత తమ ప్రభుత్వానిదన్నారు.



ప్రజా సేవ చేసే ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి సొంతిల్లును సమకూరుస్తామని చెప్పారు. 30-40 ఏళ్ళు హైదరాబాద్‌తో ఉన్న అనుబంధాన్ని వదులుకుని హైకోర్టు ఉద్యోగులు, న్యాయవాదులు అమరావతికి తరలివచ్చారని, వారందరు నిలదొక్కుకునేందుకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని హామీనిచ్చారు. ఉద్యోగుల ఇళ్ల నిర్మాణానికి అవసరమైన భూములను గుర్తించాలని ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. గుర్తించిన భూముల్లో అపార్టుమెంట్లు నిర్మించి ఉద్యోగులందరికి ఫ్లాట్లు కేటాయించాలని సూచించారు. రైతుల పండుగ సంక్రాంతని, పంటల దిగుబడులు ఇంటికి వచ్చే ఈ పర్వదినాన జన్మభూమి కార్యక్రమాన్ని వేడుకలా నిర్వహించాలని అధికారులకు స్పష్టం చేశారు. రాష్ట్రం ఎంతో ఆర్థిక లోటు ఎదుర్కొంటున్నప్పటికి రైతులకు రూ.24 వేల కోట్ల మేర రుణమాఫీ చేశామన్నారు. ప్రతి రైతుకు రూ.1.5 లక్షల ప్రయోజనాన్ని కల్పించామని చెప్పారు. అదే విధంగా ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.4 వేల కోట్లను అందించడంతోపాటు మార్కెట్ జోక్యం ద్వారా రూ.4 వేల కోట్ల విలువైన పంట ఉత్పత్తులను రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. దేశంలోని ఎక్కడాలేని విధంగా కౌలు రైతులకు రూ.9,100 కోట్ల పంటరుణాలు ఇచ్చామని, వెల్లడించారు. ఎక్కడా కూడా క్రాఫ్ హాలిడేస్, పవర్ హాలిడేస్ లేకుండా చేశామని స్పష్టం చేశారు. గతంలో రైతులు ఎరువుల కోసం పడిగాపులు కాయడంతోపాటు, లాఠీ ఛార్జీలను ఎదుర్కొనే పరిస్థితి ఉండేదని, అంతే కాకుండా పోలీస్‌స్టేషన్లలో విత్తనాలు, ఎరువుల పంపిణీ జరిగేదన్నారు. ఇప్పుడు అలాంటి పరిస్థితులు ఎక్కడా లేవని, రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు.

పెట్టుబడులు లేని ప్రకృతి సేద్యంపై జన్మభూమిలో విస్తృతమైన చర్చ జరగాలని సూచించారు. 4వ రోజు జన్మభూమి కార్యక్రమానికి సంబంధించి సంక్షేమంపై 78.20 శాతం ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. గ్రామ సభల్లో జరుగుతున్న చర్చలు అర్థవంతంగా ఉన్నట్లు 72.46 శాతం మంది తెలిపినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్‌చంద్ర పునేఠ, ఆర్టీజీఎస్ సీఈవో బాబుఏ, సమాచారశాఖ కార్యదర్శి రామాంజనేయులు, వివిధ జిల్లాల కలెక్టర్లు, నోడల్ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రముఖ రచయిత, విశ్లేషకులు, న్యూఢిల్లీలోని "సెంటర్ ఫర్ మీడియా స్టడీస్" వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఎన్. భాస్కరరావు తాజాగా "సుపరిపాలన, అభివృద్ధి, ప్రజాస్వామ్యం" అనే శీర్షికతో పుస్తకాన్ని రచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆ పుస్తకాన్ని శనివారం ఉండవల్లిలోని ప్రజావేదికలో ఆవిష్కరించి రచయితను అభినందించారు.

కేంద్రం హామీలపై నిపుణుల నివేదిక రేపు

అమరావతి, ఆంధ్రప్రభ: నవ్యాంధ్రకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు వివాదస్పదమైన నేపథ్యంలో పార్టీలకు అతీతంగా పలువురు నిపుణులు వాటిలోని వాస్తవాలను అధ్యయనం చేసి రూపొందించిన నివేదికను ఈ నెల 7న విజయవాడలో విడుదల చేయనున్నట్లు 'ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్' తెలిపింది. ఈ నివేదికను హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పర్వతరావు, విశ్రాంత ఐఏఎస్ అధికారులు కె.పద్మనాభయ్య, కాకి మధవరావు, డాక్టర్ ఎన్. జయ ప్రకాష్ నారాయణ్, అజయ్ కల్లాం విడుదల చేస్తారని లోక్ సత్తా వర్గాలు పేర్కొన్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు విభజన హామీలను అమలు పరిచే విషయంలో వాస్తవాలను అధ్యయనం చేయడంతో పాటు పరిష్కారాలను చూపటానికి నలుగురు తెలుగేతర జాతీయ నిపుణులు విశేష కృషి జరిపి ఈ నివేదికను రూపొందించారన్నారు.

కోడి కత్తి కేసుతో మోడీ జగన్నాటకం

• మంత్రి యనమల ధ్వజం

అమరావతి, ఆంధ్రప్రభ: కేంద్ర ప్రభుత్వం వైఎస్ఆర్‌కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డితో కలిసి ఆడుతున్న నాటకంలో భాగంగానే 'కోడికత్తి' కేసును జాతీయ దర్యాప్తు సంస్థకు అప్పగించారని రాష్ట్ర ఆర్థికశాఖామంత్రి యనమల రామకృష్ణుడు ఎద్దేవా చేశారు. శనివారం మంత్రి కార్యాలయం నుండి వెలువడిన ఒక ప్రకటనలో పలు కీలక అంశాలపై రామకృష్ణుడు ప్రస్తావించారు. జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) చట్టం ప్రకారం నేషనల్ సెక్యూరిటీ కేసు, రాష్ట్రాలలో లా అండ్ ఆర్డర్ సమస్యలకు సంబంధించిన కేసులను మాత్రమే ఎన్ఐఏకు అప్పగిస్తారు. కానీ కేంద్రప్రభుత్వం కావాలనే ఎన్ఐఏకు జగన్ కేసును అప్పగించిందని విమర్శించారు. జాతీయ దర్యాప్తు సంస్థ చట్టంలోకి రాని 'కోడికత్తి' కేసును ఎన్ఐఏకు అప్పగించడం తీవ్ర అభ్యంతరకమని రామకృష్ణుడు అన్నారు. రాష్ట్రప్రభుత్వంపై బురదజల్లే ప్రక్రియలో భాగంగా మోడీ ప్రభుత్వం జగన్‌ను అడ్డంపెట్టుకొని ఇటువంటి కుట్రలకు పాల్పడుతోందన్నారు. జగన్‌పై 11 ఛార్జిషీట్లు ఉన్నాయని, 3 ఛార్జిషీట్లపై ట్రైయిల్‌రన్ ప్రారంభమైందని, మిగతా ఛార్జిషీట్లపై ఎప్పుడు మొదలవుతుందో అనుమానం కలిగిస్తోందన్నారు. బీజేపీ ప్రభుత్వ చర్యలతోనే ఈ అనుమానాలకు తావిస్తోందన్నారు. సాధారణంగా రాజకీయనాయకులు, ఆర్థికనేరగాళ్లపై ఎటువంటి కేసులు ఉన్నా సంవత్సరం లోపు కేసులు పరిష్కరించాలని సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నాయని, అయితే వాటిని కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. సీబీఐ కోర్టు న్యాయమూర్తిని మార్చడం ద్వారా జగన్మోహన్‌రెడ్డి కేసులు మొదటికి వచ్చి మరింత ఆలస్యమయ్యే అవకాశాలున్నాయన్నారు. జగన్‌కు సంబంధించిన రూ.43 వేల కోట్ల ఆస్తులను ఈడీ అటాచ్ చేసిందని, ఆయనకి అన్నీ ఆస్తులు ఎలా వచ్చాయో కేంద్రప్రభుత్వం ఎందుకు ప్రశ్నించలేకపోతోందని ఆయన ప్రశ్నించారు. లోటస్‌పాండ్‌లో బంగ్లా, ఇడుపులపాయలో బిల్డింగ్, బెంగుళూరులో 60 గదుల ప్యాలెస్ జగన్‌కు ఎలా వచ్చాయని రామకృష్ణుడు అన్నారు. ప్రజల డబ్బును దోచుకున్న వాడు చట్టం నుండి తప్పించుకోలేరని, మోడీ కాపాడాలని ప్రయత్నించినా ప్రజల డబ్బు దోచుకున్న వారికి తగిన శిక్షపడటం ఖాయమన్నారు. జగన్ దోచుకున్న సొమ్ము వెనక్కి వస్తుందని, ఆ డబ్బును ప్రజలకు పంచిపెట్టడం తథ్యమని ఆర్థికమంత్రి యనమల జోస్యం చెప్పారు.

నేడు చిత్తూరులో లోకేష్ పర్యటన

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఐటీ శాఖమంత్రి నారా లోకేష్ ఆదివారం చిత్తూరు జిల్లాలో పర్యటించనున్నారు. శనివారం కడప జిల్లాలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన మంత్రి ఆదివారం చిత్తూరు జిల్లా సత్యవేడు నియోజకవర్గంలో పర్యటించి అక్కడి జన్మభూమి-మావూరు కార్యక్రమంలో పాల్గొనున్నారు. ఉదయం తిరుపతి పద్మావతి అతిథి గృహం నుండి బయలుదేరి సత్యవేడు నియోజకవర్గానికి చేరుకొని అక్కడ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం జన్మభూమి-మావూరు కార్యక్రమంలో పాల్గొని అక్కడ ఆధరణ, హౌసింగ్, ఎన్టీఆర్ భరోసా లబ్ధిదారులను కలుసుకోనున్నారు. అదేవిధంగా అక్కడ ఉన్న జన్మభూమి స్టాల్స్‌ను సందర్శించనున్నారు. మధ్యాహ్నం 2గంటలకు శ్రీసిటీలోని ఫాక్స్‌కాన్ మొబైల్స్ కంపెనీని సందర్శించి అక్కడి ఉద్యోగులతో లోకేష్ మాట్లాడనున్నారు.

8న మినహాయింపు అభ్యర్థులకు పరీక్ష

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం జరిగే కానిస్టేబుల్ రాత పరీక్ష నుంచి మినహాయింపు పొందిన వారికి 8వ తేదీన ప్రత్యేకంగా పరీక్ష నిర్వహించనున్నారు. ఇతర పరీక్షలను దృష్టిలో ఉంచుకొని మినహాయింపు పొందిన వీరు ఏడో తేదీన జరిగే పరీక్షకు వచ్చేందుకు సమయాభావాన్ని దృష్టిలో ఉంచుకొని వచ్చిన అభ్యర్థనల మేరకు 8వ తేదీన నిర్వహిస్తున్నట్లు రాష్ట్రస్థాయి పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ఛైర్మన్ కుమార్ విశ్వజిత్ తెలిపారు. రాష్ట్ర పోలీసు శాఖలోని వివిధ విభాగాల కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఆదివారం ప్రాథమిక అర్హత కోసం రాత పరీక్ష నిర్వహించనున్నారు. 2723 పోస్టులకు గాను 2.90లక్షల మంది దరఖాస్తు చేశారు. వీరికి ఆదివారం పరీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో ఇదేరోజు ఇతర పరీక్షలు కూడా జరగనున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకొని తొలి రోజు పరీక్ష నుంచి మినహాయించి మరోసారి పరీక్ష నిర్వహించాలంటూ పలువురు అభ్యర్థులు కోరారు. వీరి కోరికను దృష్టిలో ఉంచుకొని డీజీపీ ఆర్పీ ఠాకూర్ తొలుత ఏడో తేదీన కాకినాడలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రంలో పరీక్ష నిర్వహించేందుకు నిర్ణయించి సమాచారం అందించారు. అయితే వేర్వేరు ప్రాంతాల్లో జరుగుతున్న పరీక్షలకు వెళ్లి మరుసటి రోజుకు తిరిగి రావడం ఇబ్బందిగా ఉంటుందని పలువురు పేర్కొనడంతో 8వ తేదీకి వాయిదా వేశారు. మినహాయింపు పొందిన వారు ఎనిమిదో తేదీన జరిగే పరీక్షకు మాత్రమే హాజరు కావాలి తప్ప 6న కూడా హాజరైతే అన్ని కేటగిరీల్లో అభ్యర్థిత్వాన్ని రద్దు చేయనున్నట్లు విశ్వజిత్ తెలిపారు.

మోడీవి పచ్చి అబద్ధాలు

• ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు కుటుంబరావు

అమరావతి, ఆంధ్రప్రభ: దేశ చరిత్రలో అబద్ధాల ప్రధానిగా నరేంద్ర మోడీ మిగిలిపోనున్నారని, తప్పుడు హామీల పార్టీగా బీజేపీ సరికొత్త చరిత్ర సృష్టించనున్నదని రాష్ట్ర ప్రణాళి కాసంఘం ఉపాధ్యక్షుడు సి.కుటుంబరావు దుయ్యబట్టారు. ఈమేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో వెనుకబడిన జిల్లాలకు కేటాయించిన రూ.1050 కోట్లకు ప్రభుత్వం యూసీలు (యుటిలైజేషన్ సర్టిఫికెట్స్) ఇవ్వలేదని గత రెండు రోజుల క్రితం 5 పార్లమెంట్‌స్థానాలకు చెందిన తమపార్టీ నేతలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధాని నరేంద్రమోడీ పేర్కొనడం పచ్చి అబద్ధమన్నారు. నీతీ అయోగ్ నుండి కేంద్ర ఆర్థికశాఖకు 18.12.2018న పంపిన లేఖలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రూ.1049.34 కోట్లకు యూసీలు ఇచ్చినట్లుగా స్పష్టం చేసిందని ఆయన అన్నారు. కేంద్ర ఆర్థికమంత్రి రాజ్యసభలో కే.వి.పీ.రామచంద్రరావుకు ఇచ్చిన జవాబులో 2018 జనవరి వరకూ ఇచ్చిన యూసీలపై ఎపీ రూ.946.50 కోట్లకు యూసీలు ఇచ్చినట్లు తప్పుడు సమాచారం అందించారని కుటుంబరావు స్పష్టం చేశారు. ఆ తరువాత ఇచ్చిన యూసీలను కూడా క్రోడీకరించి నీతి అయోగ్ లేఖ పంపిందని ఆయన వెల్లడించారు. బీజేపీ పాలిత ప్రాంత రాష్ట్రాల యూసీల గురించి ప్రధాని మోడీ ఎందుకు నోరు మెదపడం లేదని సి.కుంటుంబరావు ప్రశ్నించారు. కేంద్రానికి యూసీలు ఇవ్వడంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ 3వ స్థానంలో ఉందని, ఇదే కేంద్ర ప్రభుత్వ ఆర్థికశాఖ వెబ్‌సైట్‌లో వెల్లడించిన విషయం కూడా ప్రధాని మోడీకి తెలియదా అని అన్నారు.

అవార్డులు ఇస్తూనే అడ్డంకులా?

• సీబీఐపీ అవార్డుపై సీఎం చంద్రబాబునాయుడు

అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ పనితనానికి అవార్డులు ఇస్తూనే మరోపక్క నిధుల విడుదల్లో జాప్యం చేయడంతోపాటు అడ్డంకులు సృష్టిస్తున్నారని కేంద్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చురకలు అంటించారు. శనివారం జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు శుక్రవారం పోలవరం ప్రాజెక్టుకు లభించిన ప్రతిష్టాత్మక సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్ (సీబీఐపీ) అవార్డు- 2019న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు చూపించారు. ఈ సందర్భంగా మంత్రితో పాటు జలవనరుల శాఖ అధికారులను ఆయన అభినందించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఆర్థిక లోటు ఉన్న ఎంతో సమర్థతతో పోలవరం ప్రాజెక్టును శరవేగంగా నిర్మాణం చేస్తున్నామని, ఈ ప్రగతి గుర్తింపుగా సిబిఐపికి అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. 2019 డిసెంబర్ నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామన్న ధీమాను వ్యక్తం చేశారు. ఇప్పటివరకు ప్రాజెక్టుపై రూ.15,380.97 కోట్లు ఖర్చుచేసినట్లు తెలిపారు. అయితే పెంచిన అంచనాలను కేంద్రప్రభుత్వం ఆమోదించేలా చర్యలు చేపట్టాలని జలవనరుల శాఖ అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో జలవనరుల శాఖ ఇంజనీర్-ఇన్-ఛీఫ్ వెంకటేశ్వరరావు, ఓఎస్‌డి వరప్రసాద్ ఉన్నారు.



అభివృద్ధికి అడ్డుపడితే తరిమికొడతారు

• కులాల మధ్య చిచ్చుపెట్టేందుకు ప్రయత్నిస్తున్న ప్రతిపక్షం
• మోడీని ప్రశ్నిస్తే నేరుగా జైలుకు వెళతాననే భయం పట్టుకున్న జగన్ • పవన్ మాటలకే పరిమితం
• వచ్చే ఎన్నికల్లో 25 ఎంపీ సీట్లు తెలుగుదేశానికి ఇవ్వండి
• జన్మభూమి-మాఊరు సభలో మంత్రి నారా లోకేష్

కడప, ప్రభన్యూస్ బ్యూరో: అభివృద్ధికి అడ్డుపడితే జనం తరిమితరిమి కొడతారని, ప్రతిపక్ష నేత జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో జరిగే అభివృద్ధి పనులకు అడ్డు పడుతున్నారని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, ఐటిశాఖమంత్రి నారాలోకేష్ తీవ్రంగా విమర్శించారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి దక్కాల్సిన అంశాల పై ఆయన మాట్లాడలేకపోతున్నారని. మోడీ గురించి మాట్లాడితే స్పీడుగా జైలుకు వెళతారన్న భయం ఆయనలో వుందని, జగన్ ఓ దొంగపుత్రుడని, పవన్ కల్యాణ్ మాటలకే పరిమితమని తీవ్రస్థాయిలో ఆయన అన్నారు. రాష్ట్రానికి మోడీ మోసం చేశారని రాష్ట్రాభివృద్ధి చూసి ఓర్వలేక రాష్ట్రానికి రావాల్సిన విభజన ఒప్పందాలను కూడా అమలు చేయలేదని మోడీని దింపేవరకు చంద్రబాబు పడుకోడని ఆయన తీవ్రస్థాయిలో స్పందించారు. కడపజిల్లా రాయచోటి నియోజకవర్గం లక్కిరెడ్డిపల్లెలో జరిగిన జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో మంత్రిలోకేష్ మాట్లాడారు. రాష్ట్రం విభజించినప్పుడు 16 వేల కోట్ల లోటుబడ్జెట్ వుండేదని అయినా కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు తన అనుభవంతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళుతున్నారని అన్నారు. విలీన ఒప్పందంలోని కడప ఉక్కును కూడా అమలు చేయలేదని దీంతో రాష్ట్రప్రభుత్వమే ముందుకు వచ్చి ఉక్కు పరిశ్రమను ఏర్పాటుచేస్తోందని చెప్పారు. అయితే ఈ జిల్లాకే చెందిన ప్రతిపక్షనేత జగన్మోహన్ రెడ్డి ఉక్కుపరిశ్రమ గురించి ఏ రోజైనా మోడీని అడిగారా అని ప్రశ్నించారు. ఉక్కు ఇవ్వాల్సింది కేంద్రమేనని అయినా ప్రతిపక్షనేత గానీ, రాజ్యసభలో వున్న వారి ఎంపీలుగానీ ఉక్కు పరిశ్రమ గురించి విభజన



ఒప్పందాల గురించి మాట్లాడే సాహసం చేయలేదని అన్నారు. జగన్మోహన్‌రెడ్డికి మోడీని ప్రశ్నించి దమ్ము ధైర్యం లేదని ఆయన ఒకడ్రామాను చేస్తున్నారని విమర్శించారు. మొదట్లో ఎంపీల రాజీనామా డ్రామాలు వేశారని అది ప్రజల్లో ఫ్లాప్ కావడంతో కోడికత్తి డ్రామా ఆడారని అన్నారు.

అంతేకాదు ఆవు, అంబులెన్స్ డ్రామా కూడా ఆడారని పేర్కొన్నారు. జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఆవు అడ్డమొస్తే ఇది చంద్రబాబు పంపారా అని ఆవును అడగడం ఆశ్చర్యంగా వుందని మాట్లాడారు. మరోచోట 108 సక్రమంగా పనిచేయలేదని మాట్లాడుతుండగా అదే దారిలో 108 వాహనం రావడంతో ఆ డ్రైవర్‌ను నిన్ను చంద్రబాబు పంపారా అని అడిగారాని ఇలా డ్రామా కంపెనీ నడుపుతున్నారని విమర్శించారు. జగన్మోహన్‌రెడ్డి ప్రాజెక్టులకు అడ్డుపడ్డారని అయినా చంద్రబాబునాయుడు వాటిని పూర్తిచేసి ఆయ నను గెలిపించిన జిల్లాలోని ఆయన సొంత నియో జకవర్గం పులివెందులకే నీళ్ళు ఇవ్వడం జరిగిందని అన్నారు.

రాష్ట్రంలో ఎన్నికలు నాలుగునెలల్లో రానున్నాయని ఈ పరిస్థితుల్లో ప్రతిపక్షం కులమతాలకు మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తోందని ప్రజలు అప్రమత్తంగా వుండాలని సూచించారు. 68 ఏళ్ళ వయసులో కూడా 24 ఏళ్ళ యువకుడిలా మనకోసం పనిచేస్తున్న చంద్రబాబును మళ్ళీ గెలిపించాలని కోరారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లోవున్నా ఇప్పటికే 15 వేల కోట్ల రుణమాఫీ చేశామని త్వరలో మరో 8 వేల కోట్లు రైతు ఖాతాల్లో జమ చేయనున్నామని తెలిపారు.

పవన్ పైనా విమర్శలు

మంత్రి నారాలోకేష్ జనసేన అధినేత పవన్ కల్యాణ్ పైన విమర్శలు చేశారు. ఆయనంటే నాకు అభిమానమని ఆ విషయం ఆయనకు చెప్పానని అయినా కూడా తనపై ఆరోపణలు చేశారన్నారు. అది నిరూపించమని నేను అడిగానని పేర్కొన్నారు. ఆయన కేంద్రంపై అవిశ్వాసం పెడితే తాను డిల్లీకి వచ్చి ఎంపీలను కూడగడతానని మాట్లాడారని తెలుగుదేశం పార్టీ డిల్లీపై అవిశ్వాసం పెడితే మీరుఎక్కడ వున్నారని ప్రశ్నించారు. అంతేకాదు ప్యాక్ట్‌ఫైండింగ్ కమిటీ రూ.75 వేల కోట్ల రూపాయలు ఏపీకి ఇచ్చినట్లు చెప్పిన దాని పైన మాట్లాడలేదన్నారు. బీజేపీ అంటే ఆయన నిర్వచ నం చెప్పారు. బి అంటే బీజేపీ అని, జె అంటే జగన్‌అని పి అంటే పవన్ అని మాట్లాడారు.

మోడీని దించేదాక చంద్రబాబు నిద్రపోడు



ఆంధ్ర అభివృద్ధి చూసి మోదీ అసూయ పడుతున్నారని రాష్ట్రానికి ఇచ్చిన 18 హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదని అన్నారు. ప్రత్యేకహోదా ఇస్తామంటూ ఆ తర్వాత ప్రత్యేక ప్యాకేజీ అంటూ మోసం చేశారని చివరి బడ్జెట్‌లో కూడా అన్యాయం చేయడంతో ముఖ్యమంత్రి ప్రధానమంత్రికి ఫోన్ చేసినా ఎత్తలేదని పేర్కొన్నారు. దీంతో కేంద్రమంత్రులతో రాజీనామా చేయించడం జరిగిందన్నారు. చివరకు ఉక్కుపరిశ్రమ కోసం సీఎం రమేష్‌దీక్ష చేస్తే కూడా పట్టించుకోకపోవడంతో రాష్ట్రప్రభుత్వమే ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తోందని పేర్కొన్నారు. ఉక్కు పరిశ్రమేకాదు ఏ రకంగా చూసినా మోదీ చేస్తున్న ఈ రాష్ట్రంలో ప్రతిపక్షనేత మోడీ వ్యతిరేకంగా మాట్లాడే పరిస్థితి లేకుండా పోయిందని విమర్శించారు. ఇప్పటికే జైలుకు వెళ్లి వచ్చిన జగన్ మోదీ గురించి మాట్లాడితే మళ్ళీజైలుకు వెళ్ళాలనే భయం పట్టుకుందన్నారు. మంత్రి లోకేష్ మోదీ, జగన్, పవన్‌లపై విమర్శలు చేస్తూ రాష్ట్రం కోసం చంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం 1 గంట నుంచి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంఖుస్థాప నలు, భూమిపూజలు చేశారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, రాయచోటి ఇన్‌చార్జి రమేష్‌కుమార్‌రెడ్డి, ఆ నియోజకవర్గ నేత సుగవాసి పాలకొండ్రాయుడు, కలెక్టర్ హరికిరణ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్‌నాథ్‌ను కలిసిన హోదా సాధన సమితి నాయకులు

• రాజ్‌నాథ్ సానుకూలంగా స్పందించారన్న చలసాని

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమస్యలపై కేంద్ర హోంశాఖా మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సానుకూలంగా స్పందించారని ప్రత్యేక హోదా సాధన సమితి నేత చలసాని శ్రీనివాస్ వెల్లడించారు. శనివారం ప్రత్యేక హోదా సాధన సమితి నాయకులు ఢిల్లీలో రాజ్‌నాథ్ సింగ్‌ను కలిశారు. ప్రత్యేక హోదా సహా విభజన హామీల అంశాలపై ఆయనకు వినతి పత్రం అందజేశారు. అనంతరం చలసాని శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్ర సమస్యలు తెలిసిన వ్యక్తిగా స్పందించి మోడీ నిర్ణయం తీసుకోవాలని రాజ్‌నాథ్‌కు వివరించామని అన్నారు. ప్రత్యేక హోదా అంశం రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యతో ముడిపడి ఉందని... విభజన హామీలు అమలు చేయకపోవడంతో రాష్ట్ర ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని హోంమంత్రి దృష్టికి తీసుకెళ్ళామని ఆయన చెప్పారు.

తమ విజ్ఞప్తిపై హోంమంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. పార్లమెంట్ సమావేశాలు ముగిసే వరకు ఢిల్లీలో ఉండి తమ పోరాటం కొనసాగిస్తామని, కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్ర విభజన హామీలపై వినతి పత్రాలు అందజేస్తామని చలసాని శ్రీనివాస్ ప్రకటించారు.

జనం బాధలు తీర్చేందుకే జన్మభూమి

• మంత్రి శిద్దా రాఘవరావు

అమరావతి, ఆంధ్రప్రభ: ప్రజాసమస్యలను పరిష్కరించేందుకే రాష్ట్రప్రభుత్వం జన్మభూమి- మా ఊరు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి శిద్దా రాఘవరావు పేర్కొన్నారు. శనివారం ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం పెద ఉల్లగల్లు గ్రామంలో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్టీఆర్ వైద్య సేవ పథకం ద్వారా ప్రజలకు కోట్లాది రూపాయలు వెచ్చించటం జరిగిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు, బ్రాహ్మణ, వైశ్య కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఆయా వర్గాలకు సబ్సిడీ రుణాలను పెద్ద ఎత్తున అందించామన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికి అనేక సంక్షేమ కార్యక్రమాలను శరవేగంగా అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోడీ ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ప్రజలకిచ్చిన హామీలను



అమలు చేయకుండా తీవ్ర అన్యాయం చేశారని మంత్రి శిద్దా రాఘవరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రకాశం జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ.270 కోట్ల రుణాలను పంపిణీ చేశామని తెలిపారు. అదే విధంగా దర్శి నియోజకవర్గంలో రూ.3 వేల కోట్ల విలువైన పనులను, అభివృద్ధి కార్యక్రమాలను చేశామన్నారు. అంతేకాకుండా వెయ్యి ఇళ్లను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ముండ్లమూరు మండలంలో రూ.150 కోట్లతో ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఈసందర్భంగా మంత్రి శిద్దా రాఘవరావు సంక్రాంతి కానుకలతో పాటు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అదే విధంగా డ్వాక్రా మహిళలకు రూ.75 లక్షల బ్యాంక్ లింకేజ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

గిన్నిస్ రికార్డుకు వేళాయే...!

• నేడు పోలవరంలో చారిత్రక ఘట్టం ఆవిష్కరణ
• 28 వేల క్యూబిక్ మీటర్లకు పైగా కాంక్రీట్ పనులకు శ్రీకారం • గిన్నిస్ ప్రతినిధుల సమీక్షలో నిపుణుల పర్యవేక్షణ



అమరావతి, ఆంధ్రప్రభ: పోలవరం చరిత్రలో సరికొత్త అధ్యాయానికిసర్వం సిద్ధమైంది.ప్రాజెక్టుకు సంబంధించిన కాంక్రీట్ పనుల్లో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించేందుకు సంబంధిత అధికారులు ప్రాజెక్టు వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదించేందుకు పోలవరం వద్ద ఈనెల 6వ తేదీ ఆదివారం రికార్డు స్థాయిలో కాంక్రీట్ పనులు చేసేందుకు రాష్ట్రప్రభుత్వం సన్నాహాలు పూర్తి చేసింది.ఈ అరుదైన వినూత్న ప్రపంచ రికార్డు దృశ్యాలను కళ్లారా చూసేందుకు అన్ని వర్గాల ప్రజలు,పార్టీల నేతలు,అధికార గణం అక్కడికి చేరుకోనున్నది. 24 గంటల్లో 28వేల నుంచి 30వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు చేసేందుకు నవయుగ నిర్మాణ సంస్థ ఏర్పాట్లు సిద్ధం చేసింది. ఈ పనులు ఈనెల 6వ తేదీ ఆదివారం ఉదయం 7 గంటలకు ప్రారంభమై తర్వాత రోజు ఉదయం 7 గంటల వరకు ఏకబిగిన జరుగుతాయి.ఈ పనులన్నింటిని వీడియో కెమెరా నిఘాలో నిపుణులైన ఇంజనీర్లు,గిన్నిస్ బుక్ ప్రతినిధుల సమక్షంలో జరుగుతాయి. 24 మంది ఇంజనీరింగ్ న్యాయ నిపుణుల పర్యవేక్షణలో,రాష్ట్రానికి చెందిన 3వేల మంది ఇంజనీర్ల భాగస్వామ్యంలో ఈ అరుదైన రికార్డు కోసం కాంక్రీట్ పనులను నిర్వహించనున్నారు. ఇప్పటికే లండన్‌కు చెందిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు అధికారుల బృందం అమరావతికి చేరుకుంది. ఇలా నమోదు చేసిన అంశాలను లండన్‌లో పరిశీలించిన తర్వాత పూర్తి వివరాలను తెలియజేయడం జరుగుతుందని నవయుగ సంస్థ ఎండీ శ్రీధర్ చెప్పారు. ఇప్పటికే ప్రతిష్టాత్మకమైన సిబిఐపీ కేంద్ర అవార్డును దక్కించుకుని దేశ స్థాయిలో అరుదైన గౌరవాన్ని పొందిన నవ్యాంధ్రుల పోలవరం ప్రాజెక్టులో మరో కీలక ఘట్టానికి తెర తీయబోతున్నందుకు అంతా ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు.

చిరు ధాన్యాలతో 'ఆరోగ్య సిరి'

- రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రల విస్తృత వినియోగం
- పోషక విలువలు పుష్కలం
- లాభాల సాగంటూ ప్రోత్సహిస్తున్న నిపుణులు



అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్‌లో ప్రజల ఆహార అలవాట్లలో విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నాయి. ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడంలో భాగంగా ప్రజలు దైనందిన జీవితంలో తీసుకునే ఆహారంలో వరి అన్నంకు ప్రత్యామ్నాయంగా రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు, అండు కొర్రలు వంటి వాటిని ఉపయోగించేందుకు మొగ్గు చూపుతున్నారు. పోషకాహార విలువలు అధికంగా ఉండే ఆరోగ్యవంతమైన ఆహారాన్ని తీసుకునేవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఆహార ధాన్యాలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం వీటిని ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా కూడా పంపిణీ చేసేందుకు సన్నద్ధమౌతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రేషన్ దుకాణాల్లో బియ్యం బదులు ఆ చిరుధాన్యాలను రూ. 1కే కిలో చొప్పున అందించే వెసులుబాటును కల్పించింది. గడచిన మూడు నెలల్లో 7,574 మెట్రిక్ టన్నుల రాగులను, 4,558 మెట్రిక్ టన్నుల జొన్నలను ప్రజలకు సరఫరా చేశారు. ఇది రికార్డు స్థాయిలో అమ్మకాలను సూచిస్తోందని స్వయంగా ఆహార శాఖాధికారులే వెల్లడిస్తున్నారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వం సరఫరాచేసిన దానిలో గత నెలలో 7,226 మెట్రిక్ టన్నుల రాగులను, 5,036 మెట్రిక్ టన్నుల జొన్నలను ప్రజలు కొనుగోలు చేశారు. దీనినిబట్టి చూస్తే ప్రజలు వరి అన్నంకు ప్రత్యామ్నాయంగా రాగులు, జొన్నలను వాడేందుకు ఇష్టపడుతున్నట్లు స్పష్టమౌతోంది. మరీ ముఖ్యంగా చెక్కెర వ్యాధితో బాధపడేవారు ఈ ధాన్యాలను అధికమొత్తంలో కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మరికొంత మంది వినియోగదారులు మాత్రం వరి అన్నంతోపాటు చిరుధాన్యాలను కూడా సరిసమానంగా తీసుకుంటున్నట్లు రాష్ట్రంలోని చౌక ధరల దుకాణాల్లో నెలవారీ అమ్ముడవుతున్న ధాన్యాల వివరాల ఆధారంగా స్పష్టమౌతోంది. రాగులకు అనంతపురం రీజియన్‌లో మంచి గిరాకీ ఉంటోంది. ఈ రీజియన్‌లో అత్యధికంగా బియ్యానికి బదులు 1,580.465 మెట్రిక్ టన్నుల రాగుల అమ్మకంతో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే చిత్తూరులో 1,326 మెట్రిక్ టన్నులు, కడపలో 1, 278 మెట్రిక్ టన్నులు, కృష్ణాలో 1,081 మెట్రిక్ టన్నుల మేర చిరుధాన్యాల అమ్మకాలు కొనసాగాయి. కర్నూలు జిల్లాలో రాగుల అమ్మకాలు అసలు జరగలేదు. ఈ రాగుల స్థానంలో 2, 457 మెట్రిక్ టన్నులకు పైబడి జొన్నలు అమ్ముడవటం విశేషం. అలాగే కడప జిల్లాలో 779 మెట్రిక్ టన్నులు, కృష్ణాలో 547 మెట్రిక్ టన్నుల మేర జొన్నల అమ్మకాలు జరిగాయి. రాష్ట్రంలోని ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా అమ్ముడవుతున్న ఈ చిరుధాన్యాల మోతాదును పరిశీలిస్తే రాష్ట్ర ప్రజలు వరి అన్నంకు ప్రత్యామ్నాయంగా చిరుధాన్యాలను వాడేందుకు ఇష్టపడుతున్నారనే అంశం స్పష్టమౌతుంది. కేవలం ఆరోగ్య సూత్రాలను పాటించడంలో భాగంగానే ఈ చిరుధాన్యాల అమ్మకాలు పెరిగాయని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. ఆరోగ్యపరమైన అంశాలతోపాటు గుండె సంబంధిత వ్యాధులకు, బరువు తగ్గించుకునేందుకు, కొలెస్ట్రాల్ కరిగించేందుకు బీపీ, చెక్కెర వ్యాధులను నియంత్రించేందుకు, ఉదరకోశ సంబంధిత వ్యాధులను నియంత్రించేందుకు మంచి యాంటీ ఆక్సిడెంట్స్ ఉన్న ఆహారంగా ఈ చిరుధాన్యాలను ప్రజలు ఎంచుకుంటున్నారు. అంతేకాకుండా వీటిని సంబంధిత వైద్యుల సూచనలు, సలహాలమేరకు ఆహారంగా తీసుకుంటే కండరాల క్షీణతను తగ్గించడం, ఎయిడ్స్‌ను నియంత్రణలో ఉంచడం, మహిళలకు రుతు కదలికలను సక్రమైన రీతిలో ఉండేలా చేయడం, చర్మ సౌందర్యం పెంచడం వంటి అనేక విధాల జబ్బులకు ఈ చిరుధాన్యాల ఆహారం ఉపయోగపడుతుందని వైద్యులు చెబుతున్నారు. అంతేకాకుండా కేన్సర్ వంటి మహమ్మారికి కూడా ఈ ఆహారపు అలవాట్లతో చెక్‌పెట్టవచ్చని చెబుతున్నారు. వీటితోపాటు కీళ్ల నొప్పుల వ్యాధికి కూడా ఈ చిరుధాన్యాలను తీసుకోవడం ద్వారా మంచి ఉపశమనం కలుగుతుందని వైద్యులు సూచిస్తున్నారు. దీంతో రాష్ట్రంలో చిరుధాన్యాలకు మంచి గిరాకీ పెరిగింది. ఇదిలా ఉండగా రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు, అండు కొర్రలు ఇలా రకరకాల చిరుధాన్యాలను పండించేందుకు ఔత్సాహిక రైతులు ముందుకొస్తున్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో నామమాత్రంగా సాగవుతున్న ఈ పంటలు రాబోయే రోజుల్లో నాలుగింతలయ్యే అవకాశం ఉందని వ్యవసాయరంగ నిపుణులు పేర్కొంటున్నారు. సీమ జిల్లాలో రాగులు, సజ్జలు, కొర్రలు వంటివాటి సాగు పెరగనుండగా కోస్తా ఆంధ్రాలో జొన్నలు, రాగులు వంటి అన్ని రకాల పంటలను సాగుచేసేందుకు రైతులు ముందుకొస్తున్నారు. పెట్టుబడి తక్కువ, సాగునీటి వినియోగం కూడా అంతగా అవసరం లేని ఈ పంటల సాగు రైతుకు లాభసాటి కానుందని వారు చెబుతున్నారు. అయితే, దళారులు, వ్యాపారులు రైతుల నుండి కొనుగోలుచేసేక్రమంలో సిండికేట్‌గా మారి ధరలను నియంత్రించేఅవకాశం కూడా లేకపోలేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో రైతులను ఈ పంటల సాగువైపుకు ప్రభుత్వమే ప్రోత్సహించి మార్కెటింగ్ శాఖ ద్వారా కొనుగోళ్లు చేయించాలని, తద్వారా రైతులకు న్యాయం జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం ఒక నిర్దిష్టమైన కార్యాచరణ ప్రణాళికరూపొందించాలని వారు కోరుతున్నారు. రాబోయే బడ్జెట్‌లో ఈ చిరుధాన్యాల సాగుకు ప్రోత్సహించేందుకు, వాటిని కొనుగోలు చేసేందుకు ప్రత్యేకంగా బడ్జెట్‌లో కొంత మొత్తాన్ని కేటాయించాలని వ్యవసాయ రంగ నిపుణులు, శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఆదిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆశిద్దాం.

చుక్కలు చూపిస్తున్న అధికారులు

- ముఖ్యమంత్రితో నటుడు శివాజీ భేటీ

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో చుక్కల భూముల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సినీనటుడు శివాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు విజ్ఞప్తి చేశారు. శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఉండవల్లిలో కలిసిన ఆయన సుమారు గంటన్నర పాటు ఏకాంతంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రితో మాట్లాడుతూ రాష్ట్రంలో అనేకమంది మధ్యతరగతి ప్రజలు చుక్కల భూములతో సమస్యలు ఎదుర్కొంటున్నారని, ఈ సమస్యలను పరిష్కరించడంలో అధికారులు ఏమాత్రం చొరవ చూపడంలేదని ఫిర్యాదు చేశారు. కొంత మంది అధికారులు ఉద్దేశ్యపూర్వకంగా వీటిని క్రమబద్ధీకరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. కావాలనే ఈ సమస్యను జటిలం చేస్తున్నారని, ఈ సమస్యను పరిష్కరించకుంటే పోరాటం చేస్తానని శివాజీ ముఖ్యమంత్రికి తెలిపారు. సమస్య పరిష్కరించకుండా జటిలం చేస్తున్న కొందరు అధికారుల పేర్లను శివాజీ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వచ్చినట్లు తెలిసింది. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి చుక్కల భూముల సమస్యలను ఈ నెల 25లోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నామని, ఇప్పటికే ఈ మేరకు ఆదేశాలను జిల్లా కలెక్టర్లకు, రెవెన్యూ అధికారులకు జారీ చేసినట్లు శివాజీకి తెలిపారు. అనంతరం సినీనటుడు శివాజీ మీడియాతో మాట్లాడుతూ చుక్కల భూముల సమస్యపై ముఖ్యమంత్రితో చర్చించినట్లు తెలిపారు.

ఈనెల 25 లోగా సమస్యలను పరిష్కరిస్తానని ముఖ్యమంత్రి హామీఇచ్చినట్లు శివాజీ తెలిపారు. త్వరలోనే ఈ సమస్య పరిష్కారం అవుతుందని, మీకు ఎలాంటి పోరాటం చేసే అవకాశం ఇవ్వనని ముఖ్యమంత్రి తనతో అన్నట్లు శివాజీ చెప్పారు. రాజకీయ పరంగా ఎలాంటి అంశాలు చర్చించలేదని, చుక్కల భూముల సమస్యలను జటిలం చేస్తున్న అధికారుల పేర్లను త్వరలోనే వెల్లడిస్తానని ఆయన తెలిపారు.

కోడి కత్తి కేసులో కేంద్రానిది అత్యుత్సాహం

- జగన్‌పై మోడీకి ఉన్న ప్రేమాభిమానాలకు నిదర్శనం: గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్



అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్ర ప్రతిపక్షనేత జగన్ కోడి కత్తి డ్రామాలో కేంద్ర ప్రభుత్వం అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తోందని, జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) విచారణ పేరుతో పరిధిని మించి టిడిపి ప్రభుత్వంపై బురదజల్లడానికి ప్రయత్నిస్తుందని రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ ఆక్షేపించారు. శనివారం విజయవాడ టిడిపి కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ కోడి కత్తికేసులో శనివారం హైకోర్టులోవిచారణ సాగుతుండగానే డిసెంబర్ 31వతేదీన కేంద్రం ఆదేశాలివ్వడం ఆవెంటనే ఎన్ఐఏ ఆగమేఘాల మీద కోడికత్తికేసు నాటకానికి సంబంధించి ఎఫ్ఐఆర్ నమోదు చేయడం వంటివి చూస్తేనే కేంద్రం ఎంతటి అత్యుత్సాహం చూపుతుందో అర్ధమవుతోందన్నారు. నక్సలైట్ల దాడిలో హత్యకు గురైన టిడిపి ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు కేసు విచారణలో 2నెలల సమయం తీసుకున్న కేంద్ర ప్రభుత్వం ఇంతవరకు దానిలో పురోగతి చూపలేకపోయిందని మండిపడ్డారు. జగన్ కేసులో కోర్టుకి వెళ్లిన పిటీషనర్ ఏదో ఒక దర్యాప్తు సంస్థకు అప్పగించాలని విజ్ఞప్తిచేస్తే కేంద్రం మాత్రం జాతీయ భద్రతకు సంబంధించిన అంశాలను విచారించే ఎన్ఐఏకు అప్పగించడం ద్వారా జగన్‌పై మోదీకి ఉన్న ప్రేమాభిమానాలను తెలియజేస్తుందన్నారు. ఈసమావేశంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ లక్కా సాయిరాంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం

విజయలక్ష్మి



అమరావతి, ఆంధ్రప్రభ: మహిళా కార్పొరేటర్‌ను బెదిరించిన ముఖ్యమంత్రి చంద్రబాబుపై జాతీయ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు బీజేపీ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట విజయలక్ష్మి పేర్కొన్నారు. కాకినాడ జన్మభూమి సభలో అభివృద్ధిపై ప్రశ్నించిన బీజేపీ నేతలపై తెదేపా ప్రభుత్వం నిర్బంధ దాడులు, అక్రమ అరెస్టులు చేస్తోందని ఆమె ఆరోపించారు. విజయవాడలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళా కార్పొరేటర్ లక్ష్మీప్రసన్న పట్లసీఎం వ్యవహరించిన తీరు ఆక్షేపణీయంగా ఉందన్నారు. సీఎం స్థాయి వ్యక్తి మాట్లాడాల్సిన భాష కాదని చెపుతూ దీనిని బట్టే రాష్ట్రంలో మహిళలకు ఇస్తున్న గౌరవం స్పష్టమవుతోందన్నారు. అభివృద్ధిపై సీఎంను ప్రశ్నించడం తప్పా? అంటూ ఆమె ప్రశ్నించారు. ప్రశ్నిస్తే కొడతాం, చంపుతామని బెదిరిస్తున్నారని, సీఎం ఈ తరహాపనులను ఇతరులతో చేయిస్తారా? అంటూ ఆమె మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో ప్రభుత్వానికి పరాభావం తప్పదని ఆమె హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చాగర్లమూడి గాయత్రి, మహిళా మోర్చా నేతలు సుజాత, కర్రి నాగలక్ష్మీ, ఫక్తూన్, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డగిస్తే సహించేది లేదు!

- భాజపా తీరుపై ఆనంద్‌సూర్య ధ్వజం



అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించమని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ వేమూరి ఆనంద్ సూర్య హెచ్చరించారు. శనివారం విజయవాడ టిడిపి కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ నాయకులుగా చెలామణి అవుతూ రాష్ట్ర పరిస్థితులను తెలుసుకోకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు మీద అసభ్యకరంగా, మోదీకి ఊడిగం చేసే విధంగా బీజేపీ ఎంపీ జీవిఎల్ నరసింహారావు మాట్లాడటం సరికాదన్నారు. అదేవిధంగా కాకినాడలో ముఖ్యమంత్రి చంద్రబాబుని బీజేపీ కార్యకర్తలు అడ్డుకునే విధంగా ప్రయత్నాలు చేశారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటం కోసం సహకరించాల్సింది పోయి సీఎం చంద్రబాబు పర్యటనను అడ్డుకునే విధంగా కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడటం, రాష్ట్రంలో కల్పించిన సౌకర్యాలు పొందుతూ రాష్ట్ర నాయకత్వంమీద పోరాడే మీకు సిగ్గు ఉందా అని ప్రశ్నించారు. సంక్రాంతి తర్వాత కేంద్రంలోని బీజేపీ పదవుల్లో మార్పులు జరగబోతున్న విషయాన్ని రాష్ట్ర బీజేపీ నాయకులు తెలుసుకోవాలని, అన్యాయం చేసిన మోదీని వెనకేసుకొచ్చి సీఎంచంద్రబాబునుఅగౌరవపర్చే విధంగా మాట్లాడితే సహించమని హెచ్చరించారు.

అక్రమ లేఅవుట్లపై సీఆర్డీయే కొరడా!

- పొన్నెకల్లు, గోశాలలో ఐదు వెంచర్ల ధ్వంసం

అమరావతి, ఆంధ్రప్రభ: అనుమతిలేకుండా 11 ఎకరాల్లో వేసిన 5 లేఅవుట్లను ఏపీసీఆర్‌డీయే అధికారులు శనివారం తొలగించారు. తాడికొండ మండలం పొన్నెకల్లులో 9 ఎకరాల్లో వేసిన 4 లేఅవుట్లను, పెనమలూరు గోశాలలో 2 ఎకరాల్లో వేసిన ఒక లేఅవుటును తొలగించినట్లు అధికారులు తెలిపారు. ఆయా లేఅవుట్లలో పాతిన సరిహద్దు రాళ్లను తొలగించిప్రొక్లెయిన్లతో ధ్వంసం చేసినట్లు తెలిపారు. అనంతరం ఏపీసీఆర్‌డీఏ డెవలప్‌మెంట్ ప్రమోషన్ విభాగం డైరెక్టర్ కె.నాగసుందరి మాట్లాడూతూ, అనుమతిలేకుండా లేఅవుట్లు వేస్తే తొలగించివేస్తామని స్పష్టం చేశారు. అనుమతిలేని నిర్మాణాలను కూల్చివేస్తామని హెచ్చరించారు. నిబంధనల మేరకు అనుమతి తీసుకుని మాత్రమే లేఅవుట్లు వేసి నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో ఏపీసీఆర్‌డీఏ జోనల్ అసిస్టెంట్ డైరెక్టర్ గుమ్మడి ప్రసాదరావు తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే తెదేపా దాడులు

- సీఎం బహిరంగ క్షమాపణ చెప్పాలి
- ఆర్టీఐ మాజీ కమిషనర్ విజయబాబు

అమరావతి, ఆంధ్రప్రభ: అవినీతిపై ప్రశ్నిస్తుంటే సమాధానం చెప్పలేక దాడులకు పాల్పడటం సిగ్గు చేటని బీజేపీ రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యులు, సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ పి.విజయ బాబు అన్నారు. తెదేపా దాడులకు బెదిరేది లేదని చెపుతూ తాము కూడా వారిని ప్రతిఘటించి రాష్ట్రంలో తిరగకుండా చేస్తామని హెచ్చరించారు. ప్రజా మద్దతు కోల్పోయిన చంద్రబాబు నాయుడు ఒత్తిడికి లోనై దాడులను ప్రోత్సహిస్తున్నట్లు ఆరోపించారు. విజయవాడలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో విజయబాబు మాట్లాడుతూ కాకినాడ జన్మభూమి సభలో బీజేపీ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్న జిల్లా అభివృద్ధి, తెదేపా అవినీతిపై నిలదీస్తే సమాధానం చెప్పకుండా దాడికి పాల్పడటం శోచనీయమన్నారు. ఇంట్లో పూజలు చేసుకుంటున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ఇంటిపై భౌతిక దాడికి దిగడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అడిగిన వాటికి సమాధానం చెప్పకుండా ఫినిష్ చేస్తామంటూ హెచ్చరించడం అభ్యంతరకరమన్నారు. మహిళలను బెదిరించిన చంద్రబాబుపై సుమోటోగా కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రమంత్రులు రబ్బరు స్టాంపులుగా మారడంతో ప్రభుత్వ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు కుటుంబరావు రాజ్యాంగేతర శక్తిగా మారారని ఆయన విమర్శించారు. రాష్ట్రంలోని వ్యవహారాలు చంద్రబాబు, లోకేష్, కుటుంబరావు కేంద్రంగా సాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తురగా నాగభూషణం పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ది రిటైల్, బీజేపీది హోల్‌సేల్ అవినీతి

- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: ప్రధానమంత్రి నరేంద్రమోడీని గద్దె దింపేందుకు బీజేపీ వ్యతిరేక శక్తులన్నీ ఏకం కావాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించాలని అన్నారు. శనివారం ఆయన ఏపీ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఏపీలో తాము చంద్రబాబును వ్యతిరేకిస్తున్నామని, తెలంగాణలో టీడీపీతో కలిసి పోరాడతామని అన్నారు. అయితే జాతీయ స్థాయిలో మాత్రం బీజేపీకి వ్యతిరేకంగా అన్ని రాజకీయ శక్తులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. శబరిమల విషయంలో కేంద్రం, బీజేపీ ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తోందని ఆరోపించారు. శని సింగ్నాపూర్ విషయంలో కోర్టు తీర్పును అమలు చేస్తున్న బీజేపీ ప్రభుత్వం, కేరళలో శబరిమల విషయంలో వ్యతిరేకించడమేమిటని ప్రశ్నించారు. కేరళలో ఆరెస్సెస్, బీజేపీ, విశ్వహిందూ పరిషత్ కలిసి అరాచకం, అల్లర్లు సృష్టిస్తున్నాయని ఆరోపించారు. రాఫెల్ విమానాల కొనుగోలులో ప్రధాన మంత్రే నేరుగా డీల్ కుదిర్చి అంబానీలకు ప్రయోజనం కుదుర్చుతున్నాడని అన్నారు. జేపీసీ వేస్తే వారి బండారం మొత్తం బయటపడుతుందని భయపడుతున్నారని అన్నారు.

సంక్రాంతికి 4 ప్రత్యేక రైళ్లు

అమరావతి , ఆంధ్రప్రభ: సంక్రాంతి పండుగ సందర్భంగా ఏర్పడే ప్రయాణికుల రద్దీని నియంత్రించేందుకు సికింద్రాబాద్ - విశాఖపట్నం , కాకినాడ పోర్టు - లింగంపల్లి, మచిలీపట్నం - సికింద్రాబాద్ (వయా రాయనపాడు) మార్గాల్లో నాలుగు ప్రత్యేకరైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక రైళ్లు ఈనెల 11,12,17,20 తేదీల్లో బయలు దేరుతాయని చెప్పారు. సికింద్రాబాద్ - విశాఖపట్నం మధ్య నడిచే రెండు ప్రత్యేక రై ళ్లు రాయనపాడు, ఖమ్మం,వరంగల్, ఖాజీపేట,ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి,సామర్లకోట,దువ్వాడ స్టేషన్లలో ఆగుతాయి. అలాగే కాకినాడ పోర్టు - లింగంపల్లి మధ్య నడిచే ప్రత్యేకరైలు కాకినాడ టౌన్, సామర్లకోట, ద్వారంపూడి, రాజమండ్రి, నిడదవోలు, తణుకు,భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, రాయనపాడు,ఖమ్మం, కాజీపేట, సికింద్రాబాద్, బేగంపేట స్టేషన్లలో ఆగుతుంది. మచిలీపట్నం - సికింద్రాబాద్ సువిధ ప్రత్యేక రైలు గుడివాడ, రాయనపాడు,ఖమ్మం,వరంగల్, కాజీపేట స్టేషన్లలో ఆగుతుందని రైల్వే అధికారులు తెలిపారు.

కార్మికులకు ఆర్టీసీ సంక్రాంతి కానుక

- ఆర్జిత సెలవుల బకాయిల విడుదల

అమరావతి, ఆంధ్రప్రభ : కొత్త సంవత్సరంలో ఆర్టీసీ యాజమాన్యం కార్మికులకు వరాల జల్లు కురిపించింది. 2016 సంవత్సరానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ బకాయిలను విడుదల చేసేందుకు యాజమాన్యం శనివారం అంగీకరించింది.ఈమేరకు పర్సనల్ మేనేజర్లకు, డిప్యూటీ సి.పి.ఎం.లకు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (పరిపాలన) ఎ.కోటేశ్వరరావు ఆదేశాలు జారీ చేయడం పట్ల కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.అన్ని రీజియన్లకు సంబంధించిన లీవ్ రికార్డులను ఆడిట్ చేసి,ఈనెల 11వ తేదీ లోపు లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ బిల్లులను కార్మికులకు చెల్లించాల్సిందిగా ఆదేశాల్లో పేర్కొన్నారు. దాదాపు రూ. 55 కోట్ల మేర సంస్థ ఇందుకు సంబంధించిన చెల్లింపులు చేయనున్నది. ఆర్థిక సంవత్సరంలో కార్మికుల నెల జీతంలో సగ భాగాన్ని లీవ్ ఎన్‌క్యాష్ మెంట్ కింద చెల్లిస్తారు. దీని వల్ల సంక్రాంతికి కార్మికులకు ఆర్థికపరమైన వెసులు బాటు లభించినట్లయింది. పండగకు అప్పు చేసే పరిస్థితి లేకుండా చేసినందుకు కార్మికులు సంస్థ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ బకాయిలను సంక్రాంతి కానుకగా చెల్లించమని గతంలో వీసీ,ఎండీని కోరామని,అందుకు స్పందించి చెల్లించేందుకు అంగీకరించినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నామని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు, కార్మిక పరిషత్ రాష్ట్రప్రధాన కార్యదర్శి వి.వరహాలనాయుడు పేర్కొన్నారు.

కారుణ్య నియామకాల ప్రక్రియ వేగవంతం

ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాల ప్రక్రియను వేగవంతం చేయాలని సంస్థ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ (పరిపాలన) ఏ.కోటేశ్వరరావు శనివారం డిపో మేనేజర్లను ఆదేశించారు. సంస్థకు సేవలందించి చనిపోయిన ఉద్యోగుల సంక్షేమం కోసం వారి పిల్లలకు ఉద్యోగాలు ఇచ్చే నిమిత్తం యాజ మాన్యం కారుణ్య నియామకాలకు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించి సంస్థ వద్ద 1065 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ పోస్టులను 5 దఫాలుగా భర్తీ చేయనున్నారు. ఇందుకు సంబంధించి స్క్రూట్నీ నిర్వ హించి,అర్హుల జాబితాను ఈనెల 18వ తేదీలోపు పరిశీలన నిమిత్తం సంస్థ చీఫ్ పర్సనల్ మేనేజర్‌కు పంపాలని డిపో మేనేజర్లను ఈడీ ఆదేశించారు. త్వరలోనే అర్హులైన అభ్యర్ధులను ఎంపిక చేసి,కారుణ్య నియామకాల ప్రక్రియను పూర్తి చేస్తామని ఈడీ కోటేశ్వరరావు స్పష్టంచేశారు. కారుణ్య నియామకాల ప్రక్రియకు సంబంధించి డిపో మేనేజర్లకు ఆదేశాలు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు, కార్మిక పరిషత్ రాష్ట్రప్రధాన కార్యదర్శి వి.వరహాలనాయుడు తెలిపారు.

అడిషనల్ సివిల్ జడ్జి హఠాన్మరణం

సంతాపం వ్యక్తం చేసిన స్పీకర్ కోడెల, న్యాయవాదులు



గుంటూరు, ప్రభన్యూస్ బ్యూరో: గుంటూరు జిల్లా నరసరావుపేట మొదటి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి పొత్తూరి ఐశ్వర్య(26) తెల్లవారుజామున హఠాన్మరణం చెందారు. శుక్రవారం ఉదయం విధుల్లో భాగంగా కోర్టు హాలులో బెంచ్ ఎక్కుతుండగా కాలుజారి కింద పడ్డారు. దీంతో ఆరోగ్య పరిస్థితి సరిగ్గాలేక ఒక్కరోజు కోర్టుకు సెలవు పెట్టారు. శనివారం తెల్లవారుజామున 5గంటలకు తన తల్లిని కాఫీ ఇవ్వమని అడిగిన వెంటనే ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. దీంతో హుటాహుటిన ప్రైవేట్ అంబులెన్స్ ద్వారా నరసరావుపేటలోని మహాత్మాగాంధీ హస్పటల్‌కు తరలించగా వైద్యులు పరీక్షలు నిర్వహించి అప్పటికే జడ్జి ఐశ్వర్య మరణించినట్లు తెలిపారు. ఏడాది కాలంగా నరసరావుపేటలో జడ్జిగా పనిచేస్తున్నారు. మొదటి పోస్టింగ్ పిడుగు రాళ్ళలో వారం రోజులపాటు సివిల్ జూనియర్ జడ్జిగా పనిచేశారు. స్వస్థలం నెల్లూరు జిల్లా కాగా తండ్రి పొత్తూరి రమణయ్య నరసరావుపేటలో సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేసి పదవీ విరమణ అనంతరం గత నాలుగేళ్ళ క్రితం మరణించారు. ఐశ్వర్య మృతిపై స్పీకర్ కోడెల శివప్రసాద్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. జడ్జి మృతి చెందటంతో ఒక రోజు కోర్టుకు సెలవు దినంగా ప్రకటించి న్యాయవాదులంతా సంతాపం వ్యక్తం చేశారు.

గోవింద నామస్మరణలో పులకించిన హస్తిన

- కన్నుల పండువగా ద్వారకా తిరుమలేశుడి కళ్యాణోత్సవం



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : గోవింద నామస్మరణతో హస్తిన పులకించిపోయింది. కన్నుల పండువగా ద్వారకా తిరుమలేశుడి కళ్యాణోత్సవం జరిగింది. ఢిల్లీలోని గోల్ మార్కెట్ శ్రీ బాలాజీ మందిర్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, ఏపీ భవన్, పశ్చిమ గోదావరి జిల్లా ద్వారకా తిరుమల దేవస్థానం వారి సౌజన్యంతో శనివారం నిర్వహించిన విశేష పూజల్లో దేశ రాజధాని వాసులు కుటుంబాలతో సహా భారీ సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపా కటాక్షాలు పొందారు. చిన తిరుపతిగా పేరుగాంచిన ద్వారకా తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ పెద్దింటి జగన్నాథాచార్యులు నేతృత్వంలోని అర్చక బృందం ఉదయం అష్టోత్తర సహస్ర నామార్చన చేసి భక్తులతో పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కళ్యాణోత్సవం వైభవోపేతంగా జరిగింది. భక్తులు ఆద్యంతం కల్యాణోత్సవాన్ని కనులారా తిలకించారు. గోవింద నామస్మరణతో ధ్యాన మందిరం, పరిసర ప్రాంతాలు మార్మోగాయి. దేవస్థాన ఆగమ పాఠశాల ఉపాధ్యాయుడు సుదర్శన శ్రీనివా సాచార్యులు అష్టోత్తరనామార్చన విశిష్టతను, శ్రీవారి కళ్యాణోత్సవ వైశిష్ట్యాన్ని ఆద్యంతం విశదీకరించిన తీరుకు భక్తులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ద్వారకా తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఛైర్మన్, వ్యవస్థాపక సభ్యులు ఎస్. వి. సుధాకర రావు, దేవస్థాన కార్యనిర్వాహణాధికారి డి.పెద్దిరాజు, ఢిల్లీలోని తెలుగు వారు, తెలుగేతరులు దేవస్థాన ప్రధానార్చకులు శాస్త్రోక్తంగా జరిపిన సహస్రనామార్చన, కళ్యాణోత్సవంలో భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ దేవస్థానముల దేవతా మూర్తులకు ఢిల్లీలో ఎంతో ఘనంగా అభిషేకాలు, అర్చనలు, కళ్యాణాలు నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్ ప్రకాష్ తెలిపారు. ప్రతినెలా పలు దేవాలయాల నుంచి ఆయా దేవస్థానముల సౌజన్యంతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని దేవాలయాల వైశిష్ట్యాన్ని తెలుసుకునేలా చర్యలు చేపడుతున్నామని ప్రవీణ్ ప్రకాష్ అన్నారు. భక్తుల కోసం ద్వారకా తిరుమలేశుణ్నే రాజధానికి తీసుకువచ్చి విశేష పూజలు జరిపించడం ఎంతో ఆనందకర విషయమని దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు వివరించారు.

ఎన్ఐఏ దర్యాప్తు అంటే ఎందుకంత భయం

- బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి జీవీఎల్ నరసింహారావు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: జగన్‌పై దాడి కేసును ఎన్ఐఏకు అప్పగిస్తే చంద్రబాబు ఎందుకు భయపడుతున్నారని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి జీవీఎల్ నరసింహారావు ప్రశ్నించారు. ఎన్ఐఏ దర్యాప్తు చేస్తే వాస్తవాలు బయటకి వచ్చి జాతకాలు తారుమారవుతాయని భయపడుతున్నారన్నారు. శనివారం బీజేపీ కేంద్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్ఐఏ చట్టం ప్రకారం ఆ సంస్థ కేసులు తనంతట తాను తీసుకునే అధికారం ఉందన్నారు. అన్ని చోట్ల దర్యాప్తు చేసే అధికారం చట్టం ప్రకారం ఎన్ఐఏకు ఉందని వివరించారు. రాష్ట్రాల హక్కులలో జోక్యం చేసుకుంటున్నారనే ఆరోపణల్లో అర్థం లేదన్నారు. ఈ దర్యాప్తుతో టీడీపీ డ్రామాలు పూర్తిగా బయటికి వస్తాయన్నారు. తెలంగాణలో ఓటమి తర్వాత చంద్రబాబులో మరింత అసహనం పెరిగిందన్నారు. తెలంగాణలో లాగే ఆంధ్రప్రదేశ్‌లో కూడా రెండు సీట్లు వస్తాయని చంద్రబాబు భయపడుతున్నారని అన్నారు.

బీజేపీ మహిళా నాయకురాలి పట్ల చంద్రబాబు వ్యవహరించిన తీరు దారుణమన్నారు. ఓటమి భయంతోనే చంద్రబాబు ఇలా వ్యవహరిస్తున్నారని అన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు అందరికీ ఉందన్నారు. శబరిమలలో భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా సీపీఎం రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని అన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం భక్తుల పై దాడులకు పాల్పడుతున్నదన్నారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న భక్తులను చంపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇతర మతాల మెప్పుకోసం హిందువులపై దాడులు చేస్తున్నారని అన్నారు.

జోడు గుర్రాలు



- వృత్తి - ప్రవృత్తికి న్యాయం చేస్తున్న కుర్రకారు
- చదవుకు తగ్గ ఉద్యోగం... మనసుకు నచ్చిన వ్యాపకం
- సృజనే ఆయుధం... సంతులనమే సాధనం
- రెండింటినీ పెనవేసుకుని సాగిపోతున్న కొత్త తరం

ఆమె ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్... కానీ టీవీల్లో యాంకరింగ్ అంటే ఇష్టం... అతడు ఓ మ్యుజీషియన్... కానీ రేడియో జాకీగా రాణించాలన్నది కోరిక... చాలామందికి ఇలా చేస్తున్న వృత్తి ఒకటైతే... ప్రవృత్తి.. ఇష్టాయిష్టాలు వేరు. ఈ రెండింటినీ బ్యాలెన్స్ చేస్తూ సృజన జోడించి నచ్చిన పని చేస్తేగాని తృప్తిలేని నవతరం ఇప్పుడు సరికొత్త ట్రెండ్ సృష్టిస్తోంది. వీరంతా వృత్తి-ప్రవృత్తిలో ఏదో ఒకదానితో రాజీపడిపోవడం లేదు!... క్రియేటివిటీకి అధిక ప్రాధాన్యత ఇస్తూ అభిరుచి మేరకు అభినివేశం ఉన్న రంగాలలో ప్రయోగాలు చేస్తున్నారు. ఓ వైపు ఉద్యోగమూ కొనసాగిస్తున్నారు. ఉద్యోగానికే పరిమితమైతే ఏదో వెలితి కనిపిస్తోందని యువత భావిస్తోంది. అందుకే నచ్చిన పనిచేయాలని మనసు అల్లరి చేస్తోంది. అందుకే ఆటో.. పాటో... నటనో... చిత్రలేఖనమో, షార్ట్ ఫిల్మ్.. ఇలా ఏదో ఒక రంగంలో తమకు నచ్చిన పనిని కొనసాగిస్తున్నారు. ట్రెండ్‌ను ఫాలో అవ్వను... ట్రెండ్ సృష్టిస్తాను.. అన్న రీతిలో జోడుగుర్రాల్లా వేగంగా దూసుకుపోతున్న నవతరం అంతరంగంపై ఈ వారం ప్రత్యేక కథనం...

నచ్చింది చేసేద్దాం..

ఎవరైనా రెండు పడవలమీద కాళ్లు పెట్టి ప్రయాణం చేస్తున్నారని విమర్శిస్తే ఒప్పుకోని ఈ కొత్తతరం కుర్రకారు తమకు వచ్చిన ఉద్యోగం చేస్తూనే నచ్చిన పనులూ చక్కబెడుతున్నారు. చదివింది ఒకటి..... చేసే ఉద్యోగం ఇంకొకటి. కుటుంబ పరిస్థితులు, సామాజిక అవకాశాల నేపథ్యంలో ఇష్టం ఉన్నా.. లేకున్నా చదువులు పూర్తిచేసి పట్టా పుచ్చుకుంటున్నారు. ఆపై మంచి ఉద్యోగం సంపాదిస్తున్నారు. అయినా నేటి యువతరం తృప్తిపడడం లేదు.. చేసే ఉద్యోగం వారికి కిక్ ఇవ్వడం లేదు. ఏదో వెలితి. ఇంకేదో చేయాలి.. తామేంటో నిరూపించుకోవాలి. ఉన్నది ఒక్కటే జీవితం. ఇలా ఎంతకాలం రాజీపడాలన్న అంతర్మథనం



వారిలోని సృజనాత్మకతను తట్టిలేపుతోంది. ఉద్యోగం వదిలేసి రోడ్డున పడలేరు. అలాగని తమ ప్రవృత్తిని వదులుకోలేరు. అందుకే దేనికీ రాజీపడకుండా.. ఉద్యోగం చేస్తూనే క్రియేటివిటీకి ప్రాణం పోస్తున్నారు. తమలోని ప్రతిభను వెలుగులోకి తీసుకువస్తున్నారు.

ఈ మార్పు ఎందుకు?

చదువు పూర్తయ్యాక కొలువు వెతుక్కుందామనేదే నిన్నటి తరం మాట. కళాశాలకు వెళుతూనే ఉపాధి వేట నేటితరం బాట... అందుకే ఉన్నత విద్యను అభ్యసిస్తూనే.... పనిలోపనిగా తమలోని సృజనాత్మకతను వెలుగులోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇంకోవైపు.. అభద్రత, నిలకడలేని ప్రైవేటు కొలువులు.. సొంతకాళ్లపై నిలదొక్కుకోవాలన్న ముందుచూపు. వారిలోని క్రియేటివిటీకి పదును పెట్టేలా చేస్తోంది. మొత్తానికి యువతరం రాజీ అనే పదాన్ని తమ దరిజేరనివ్వడం లేదు.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్... ఓ హీరో

మనసు ఒక చోట.. మనుగడ మరో చోట. అయితేనేమి తమ కల నిజం చేసుకునేందుకు సాహసమే ఊపిరిగా అడుగులు వేస్తున్నారు. అందుకు చక్కని ఉదాహరణ బ్లఫ్ మాస్టర్ మూవీలో రాణించిన నటుడు సత్యదేవ్. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్టణానికి చెందిన సత్యదేవ్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. కానీ అతని ప్రవృత్తి నటన. అందుకే నటుడు కావాలని కలలు కన్నాడు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూనే షార్ట్ ఫిల్మ్స్ తీశాడు. అవకాశాలకోసం ఆడిషన్స్‌కి వెళ్లాడు. రాత్రి ఉద్యోగంచేస్తూ పగలు షూటింగ్‌లకు వెళ్లి తనలోని నటుడిని సినీప్రేక్షక లోకానికి చాటాడు. అంటే తాను అనుకున్నది సాధించడం కోసం రాత్రిపగలు పనిచేసి. బ్లఫ్ మాస్టర్ మూవీలో.. సోలో హీరోగా నటించి తనేంటో నిరూపించుకున్నాడు.

రొటీన్ లైఫ్ వద్దు గురూ....

ఉన్నతచదువు, మంచి ఉద్యోగం.. పెళ్లి.. పిల్లలు.. ఇదేనా జీవితం... ఇంకా ఏదో సాధించాలి.. ఏదో కావాలి. ఇదీ నవతరం ఆలోచన. గతంలో మాదిరిగా సర్దుకునిపోయే ధోరణికి కాలం చెల్లింది. పైగా సృజనకు పదునుపెట్టి వెలుగులోకి తెచ్చేందుకు నగరాల్లో చాలా అవకాశాలున్నాయి. ఐటీ రంగం ఊపందుకున్న తర్వాత ఇంటిదగ్గర కూర్చొని ఉద్యోగాలు చేసేందుకు వీలుంది. అందుకే యువ ఉద్యోగులు ముఖ్యంగా ఐటీ రంగంలో పనిచేస్తున్న యువతీ యువకులు మనుగడ కోసం ఉద్యోగం చేస్తూనే.. తమకు మనసుకు నచ్చిన రంగంలోనూ ప్రతిభ చాటుతున్నారు. యాంకర్లుగా, షార్ట్ ఫిల్మ్ దర్శకులుగా, రైటర్లుగా, నటులుగా, రేడియో జాకీలుగా దూసుకెళ్తున్నారు. కొందరు సినిమాల్లో చిన్నచిన్న పాత్రల్లో నటిస్తున్నారు. జీవితం అంటే సంపాదించడం.. సుఖపడడం కాదు.. మనమేంటో లోకానికి చాటడం అని నిరూపిస్తున్నారు

- చొల్లేటి వెంకటేశ్వరాచారి

ఇటు ఐటీ... అటు సేద్యం





బెంగళూరు కాగ్నిజెంట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్న గుల్బర్గాకు చెందిన మహేశ్‌కు వ్యవసాయం అంటే ప్రాణం. రైతుకుటుంబం నుంచి వచ్చిన మహేశ్ బీటెక్ చదివి కాగ్నిజెంట్‌లో ఉద్యోగం సంపాదించాడు. కాలుమీద కాలేసుకుని దొరబాబులా బతికేంత జీతం. కానీ అతని మనసు మాత్రం సేద్యం మీదే. అందుకే తన ఊరిలోని 40 ఎకరాల భూమిలో రైతుగా మారాడు. కానీ పెట్టుబడి, వ్యవసాయ పనిముట్లు తదితరాలకు డబ్బు కావాలిగా. అందుకే ఉద్యోగం చేస్తూనే సేద్యం చేస్తున్నాడు. బెంగళూరులో ఐదు రోజులు ఉద్యోగం చేస్తాడు. మిగిలిన రెండు రోజులు గుల్బర్గాలో వ్యవసాయం చేస్తాడు. తనకు ఇష్టమైన సేద్యం కోసం మహేశ్ వారానికోసారి 700 కిలోమీటర్లు ప్రయాణం చేస్తున్నాడు. కుర్రకారు దేనికీ రాజీపడరని, కష్టానికి వెరవరని చెప్పడానికి ఇంతకంటే ఉదాహరణ ఇంకేమి కావాలి.

మనసుకు నచ్చేలా బతకాలి



జీవితం అంటే మనసుకు నచ్చేలా బతకడం. నాకు సినీరంగం అంటే పిచ్చి. బీటెక్ పూరయ్యాక హైదరాబాద్‌లో యాప్రి ఇంజనీరింగ్ ప్రైవేటు లిమిటెడ్‌లో ఉద్యోగంలో చేరా. అలా పనిచేస్తూనే షార్ట్ ఫిల్మ్‌లు తీశా. సృజనకు పదునుపెట్టా. ఇప్పుడు విజువల్ మ్యాజిక్ ప్రొడక్షన్‌లో డైరెక్షన్ విభాగంలో చేరా. లక్షల జీతమిచ్చే ఉద్యోగం ఉన్నా... నాకు నచ్చిన పని చేస్తుండటంతోనే ఎక్కువ తృప్తి దక్కింది. యాంత్రిక జీవితం నుంచి ఆనందాన్ని పొందే ప్రవృత్తికి ప్రాధాన్యం ఇచ్చా.

- మధుసూదన ప్రసాద్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్(తాడిపత్రి)

ఇష్టమైన వ్యాపకంతో తృప్తి



యాంకర్‌గా రాణించాలనేది నా లైఫ్ యాంబిషన్. సూర్యాపేట జిల్లా వర్ధమాన్‌కోట మా ఊరు. ఎల్ఎల్‌బి చేస్తున్నా. ఏడాదిగా పార్ట్ టైంగా యాంకరింగ్ చేస్తున్నారు. ఉద్యోగం మనుగడ కోసమే. దానికే పరిమితమైతే జీవితం రొటీన్‌గా సాగిపోతుంది. నాకు నచ్చిన యాంకరింగ్‌ను ఎట్టి పరిస్థితుల్లో మానుకోను.

- ఉమా మొలుగూరి, ఎల్ఎల్‌బి విద్యార్థి, వర్ధమాన యాంకర్ (సూర్యాపేట)

మెకానికల్ జీవితంతో విసిగిపోతాం



చదువు.. ఉద్యోగం.. సంపాదన.. ఇదంతా రొటీన్. సర్దుకుపోయి బతకడం నచ్చడం లేదు. నేను మెకానికల్ ఇంజనీరింగ్ చేశా. బాలానగర్‌లోని ఓ ప్రైవేటు కంపెనీల్లో పనిచేస్తున్నా. మంచి ఉద్యోగమే. అయినా ఏదో వెలితి. సాఫ్ట్‌వేర్ రంగంలో మార్కెటింగ్ విభాగంలో కొంతకాలం పనిచేశా. అంతా మెకానికల్‌గా తోచింది. ఆ సమయంలో ఇష్టమైన మ్యాజిక్ నేర్చుకున్నా. ఆ తర్వాత రచయితగా మారా. చిత్రపరిశ్రమకు రావాలనే తపనతో ఉద్యోగం చేస్తూనే షార్ట్ ఫిలిమ్స్‌కు పనిచేశా. ప్రస్తుతం విజువల్ మ్యాజిక్ ప్రొడక్షన్‌లో చేరా. రైటర్ కమ్ డైరెక్టర్ విభాగంలో చేరా.

- సాయిచరణ్, మెకానికల్ ఇంజనీర్ (హైదరాబాద్)

క్రీడాప్రభ



ఆస్ట్రేలియాలో టెస్ట్ సిరీస్ గెలవడానికి భారత జట్టు 71 ఏళ్ల నిరీక్షణ ఫలించేసమయం ఆసన్న మయింది. చివరి టెస్టులో ఆస్ట్రేలి యా బ్యాట్స్‌మన్ తమ తొలి ఇన్నింగ్స్ బ్యాటింగ్‌లో చేతులెత్తేసే దిశగా సాగుతు న్నారు. మూడో రోజు ఆటలో భారత బౌలర్లదే పైచేయి అయింది. స్పిన్నర్లు కుల్దీప్, జడేజాలు రాణించారు ఇద్దరు కలిసి 5 వికెట్లు పడగొట్టగా, షమీ ఒక వికెట్‌ను దక్కించు కున్నాడు. ఆస్ట్రేలియా ఇంకా ఫాల్ ఆన్ మార్క్‌ను దాటలేదు. నాలుగోరోజు ఆస్ట్రేలియాను తొంద రగా ఔట్ చేస్తే భారత్ విజయానికి చేరువైనట్లే..

- ఎదురీదుతున్న ఆస్ట్రేలియా
- తొలి ఇన్నింగ్స్‌లో మూడోరోజు236/6
- జడేజాకు 2కుల్దీప్‌కు 3 వికెట్లు

ఆస్ట్రేలియాతో నాలుగో టెస్ట్

పట్టు బిగించిన భారత్

సిడ్నీ: చివరి టెస్టులో ఆస్ట్రేలియా బ్యాట్స్‌మన్ తమ తొలి ఇన్నింగ్స్ బ్యాటింగ్‌లో మరోసారి చేతులెత్తేసే దిశగా సాగుతున్నారు. తొలుత భారత బౌలర్లను దీటుగా ఎదుర్కొన్నప్పటికి.. క్రమంగా వికెట్లు పోగొట్టుకున్నారు. ఓపెనర్ మార్కస్ హ్యారిస్ 79 విలువైన పరుగులు చేయడంతో ఆస్ట్రేలియా మూడో రోజు ఆటలో ఆట ముగిసే సమయానికి ఆరు వికెట్లు కోల్పోయి 236 పరుగులు చేసింది. ఆస్ట్రేలియా బ్యాట్స్‌మెన్ భారత బౌలర్లను ఎదుర్కొనే ప్రయత్నంలో పాక్షికంగా మెరుగుపడ్డారు. జడేజా, కుల్దీప్‌లు ఆసీస్ బ్యాట్స్‌మెన్‌ను కట్టడి చేయడంలో సఫలీకృతమయ్యారు. ఓవర్ నైట్ స్కోరు 24/0తో శనివారం తన తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఆస్ట్రేలియా తన తొలి వికెట్‌ను 72 పరుగుల వద్ద పోగొట్టుకుంది. ఉస్మాన్ ఖవాజా 27(71బంతులు ఫోర్లు-3) పరుగులు చేసి కుల్దీప్ యాదవ్ బౌలింగ్‌లో పుజారాకు క్యాచిచ్చి పెవిలియన్ చేరాడు. అనం తరం క్రీజులోకి వచ్చిన ఆల్ రౌండర్ మార్నస్, మార్కస్ హ్యారి స్‌తో కలిసి జత కలిసి ఇన్నింగ్స్‌ను కొనసాగించారు. తొలి గంట ఆటలో ఆసీస్ 35 పరుగులు మాత్రమే చేయగా, రెండో గంట ఆటలో 41 పరుగులు తమ జట్టు స్కోరుకు జోడించారు. హ్యారిస్ తన రెండో టెస్ట్ అర్ధ సెంచరీ చేయడంతో లంచ్ సమయానికి ఆసీస్ 122/1 పరుగులు చేసి పటిష్టస్థితిలో ఉంది. లంచ్ అనంతరం సెంచరీ దిశగా దూసుకు పోతున్న హ్యారిస్ 79(120 బంతులు ఫోర్లు-8)ను జడేజా బోల్తా కొట్టించా డు. బంతిని ముందుకు వచ్చి ఆడదామనుకున్న హ్యారిస్ మధ్యలో నే ఆగి పుష్ చేయ బోయాడు. కాని బంతి బ్యాట్ లోపలి అంచుకు తగిలి వికెట్లను పడగొట్టింది. ఇక్కడి నుంచి ఆసీస్ వికెట్లు వరసపెట్టి పడ్డాయి. షువాన్ మార్ష్ క్రీజులోకి వచ్చి నిలదొక్కుకోలేక పోయాడు. జట్టు స్కోరు 144 వద్ద షువాన్ మార్ష్ 8(13బంతులు, ఫోర్లు-2) జడేజా బౌలింగ్‌లో రహానేకు క్యాచిచ్చి వెనుదిరిగాడు. ట్రావిస్ హెడ్ బ్యాటింగ్‌కు వచ్చి మార్నస్‌తో జత కలిశాడు. వీరి ద్దరి భాగస్వా మ్యంకూడా ఎక్కువసేపు కొనసా గలేకపోయింది. వీరిని షమీ విడదీ శాడు. మార్నస్ 38(95బంతులు, ఫోర్లు-7) పరుగులు చేసి షమీ వేసిన బంతిని ఆన్ డ్రైవ్ చేయబోగా బంతి షార్ట్ మిడ్ వికెట్ ప్రాంతంలో గాల్లో ఉండగానే రహానే డ్రైవ్ చేసి క్యాచ్‌ప ట్టడంతో మార్నస్ ఇన్నింగ్స్ ముగిసింది. తర్వాతి బ్యాట్స్‌మన్‌గా పీటర్ హ్యాండ్స్‌కోంబ్ వచ్చాడు. జట్టు స్కోరు 192 వద్ద ఆసీస్ ఐదో వికెట్‌ను కోల్పోయింది. ట్రావిస్ హెడ్ 20(56 బంతులు ఫోర్లు-2) పరుగులు చేసి కుల్దీప్ బౌలింగ్ లో రిటర్న్ క్యాచిచ్చి పెవిలియన్ చేరగా, అతని స్థానంలో కెప్టెన్ టిమ్ పైన్ వచ్చాడు. టీ సమయానికి ఆసీస్ స్కోరు 198/5. టిమ్ పైన్‌ను కూడా కుల్దీపే పెవిలియన్ పంపాడు. కుల్దీప్ వేసిన బంతిని టిమ్ 5(14బంతులు, ఫోర్-1) డ్రైవ్ చేయబోయి బంతి లైన్ మిస్సయి క్లీన్ బౌల్డ్ అయ్యాడు. కమిన్స్ వచ్చి హ్యాండ్‌కోంబ్స్‌తో కలిసి ఆసీస్ ఇన్నింగ్స్‌ను కొనసాగిస్తూ.. 72వ ఓవర్లో జట్టు స్కోరును 200 మార్క్‌ను దాటించారు. 83.3 ఓవర్లు ముగిసేసరికి ఆస్ట్రేలియా ఆరు వికెట్లు కోల్పోయి 236 పరుగులు చేసింది. వెలుతురు సరిగా లేకపోవడం.. మరోపక్క చిరుజల్లులు ప్రారంభం కావడంతో గంట ముందే ఆటను నిలిపి వేశారు. ఆస్ట్రేలియా జట్టు భారత్ కంటే ఇంకా 386 పరుగులు వెనకబడ్డది. భారత ఆటగాళ్లు సిరీస్‌ను 3-1తో గెలిచేందుకు ఉత్సాహంతో ఉన్నారు. లాలా అమర్‌నాథ్ నేతృత్వంలో తొలిసారిగా ఆస్ట్రేలియాలో సిరీస్ గెలవడానికి ప్రారంభించిన ప్రయత్నంతో సహా ఇప్పటివరకు 11 ప్రయత్నాలు సాగాయి. కుల్దీప్, రవీంద్ర జడేజా తమ బౌలింగ్‌తో ఆస్ట్రేలియాపై భారత్‌కు ఆధిక్యా న్ని సాధించిపె ట్టారు. ఆట ముగిసే సమయానికి హ్యాండ్స్‌కోంబ్ 28 పరుగులు, కమిన్స్ 25 పరుగులతో బ్యాటింగ్ చేస్తున్నారు. వీరివురు ఏడో వికెట్‌కు 38 పరుగులు జోడించారు. 81 ఓవర్ల తర్వాత కొత్త బంతి కావాలని భారత్ ఆడుగగా వెలు తురు సరిగా లేనందున అంపైర్లు నిరాకరించారు.



స్కోరు బోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 622/7

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: మార్కస్ హ్యారిస్ (బి) రవీంద్ర జడేజా 79, ఖవాజా (సి)పుజారా (బి) కుల్దీప్ యాదవ్ 27, మార్నస్ లాబుస్‌చాగ్నె (సి) రహానే(బి) షమీ 38, షువాన్ మార్ష్ (సి) రహానే (బి) రవీంద్ర జడేజా 8, ట్రావిస్ హెడ్ సి అండ్ బి కుల్దీప్ యాదవ్ 20, పీటర్ హ్యాండ్స్‌కోంబ్ బ్యాటింగ్ 28, టిమ్ పైన్ (బి) కుల్దీప్ యాదవ్ 5, పాట్ కమిన్స్ బ్యాటింగ్ 25, ఎక్స్ట్రాలు 6 మొత్తం 236/6(83.3 ఓవర్లు)

భారత్ బౌలింగ్: మహ్మద్ షమీ 16-1-54-1, జస్ప్రీత్ బుమ్రా 16-4-43-0, రవీంద్ర జడేజా 27.3-9-62-2, కుల్దీప్ యాదవ్ 24-6-71-3

టెస్ట్ బౌలర్‌గా మెరుగుపడాల్సి ఉంది : కుల్దీప్



లార్డ్స్‌లో ఇంగ్లండ్‌తో టెస్ట్ మ్యాచ్ ఆడిన తర్వాత విదేశాల్లో మళ్లీ తన వికెట్ల వేటను ప్రారం భించిన చైనామన్ బౌలర్ 24 ఏళ్ల కుల్దీప్ యాదవ్ ఆస్ట్రేలియాతో ఆడుతున్న నాలుగో టెస్టులో మూడో రోజు మూ డు వికెట్లు దక్కించుకు న్నాడు. నిజాయితీగా చెప్పాలంటే.. నా బౌలింగ్‌లో నేను పెద్దగా వైవిధ్యాన్ని చూపలేదు. ఈ సిరీస్‌లో నేను తొలి టెస్ట్ ఆడుతున్నాను. కొంచెం నెర్వస్‌గా ఫీలయ్యాను. టెస్ట్ బౌలర్‌గా ఇంకా నేను మెరుగు పడాల్సి ఉంది అని శనివారం ఆట ముగిసిన తర్వాత కుల్దీప్ మీడియా తో అన్నాడు. మంచి బౌలర్‌గా రాణించేందుకు నేను చాలా క్రికెట్ ఆడాను. ఎర్ర బంతితో ఎంత ఎక్కువ ఆడితే.. అంత అనుభవం మనకు సొంతమవుతుంది. బ్యాట్స్ మెన్‌ను అర్థ చేసుకోవడానికి వీలయి.. వారిని ఔట్ చేయడానికి తగిన ప్రణాళికను రూపొందిం చుకోవ డానికి అవకాశ మేర్పడు తుంది అని కుల్దీప్ తెలిపాడు. నెట్లో బౌలింగ్ చేసినప్పుడు స్వల్పంగా మెరుగుపడతాము. కాని ఎక్కువ మ్యాచుల్లో బౌలింగ్ చేస్తే.. మనం ఎక్కువగా మెరుగుపడతాం. టెస్ట్ క్రికెట్ వన్డే క్రికెట్ మధ్య వ్యత్యాసం ఉందన్నాడు.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and Printed at Andhra Prabha Publications Ltd., Part no 75, Opp: Time Hospital, Ashok Nagar, Vijayawada - 520010.
Editor: Mootha Goutam, Responsible for News selection under PRB ACT. RNI Regd No. 3464/59.



ఎన్టీఆర్ బయోపిక్‌పై బాలకృష్ణతో రానా ముఖాముఖి

తండ్రిలా ఎదగాలని కొందరు కోరుకుంటే, తండ్రిని మించిన తనయుడిగా పేరు తెచ్చుకోవాలని మరికొందరు ఆశిస్తారు. తండ్రి జ్ఞాపకాలు కొనసాగించాలని, ఆయన కీర్తికి వారసులవ్వాలని పిల్లలు భావించడం ఎప్పుడూ జరిగేదే. నట మహాసముద్రం ఎన్టీఆర్ వారసుడిగా బాలకృష్ణ సైతం ఇదే కోరుకున్నారు. ఆ దిగ్గజ నటుడి జీవిత కథను తెరకెక్కించాలని మహాప్రయత్నం చేశారు. రెండు భాగాల ఎన్టీఆర్ జీవిత కథ త్వరలో వెండితెరపైకి రాబోతోంది. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ బయోపిక్ చేయాలన్న ఆలోచనలు ఎక్కడ నుంచి మొదలయ్యాయి. సినిమా రూపకల్పనలో పడిన శ్రమ ఎలాంటిది, జీవిత కథలో ఉండబోతున్న ఆసక్తికర అంశాలేంటి...మొదలైన అంశాలను బాలకృష్ణ....రానాతో ముఖాముఖిలో వెల్లడించారు. ఆ విశేషాలు మీకోసం-

తండ్రీ...నిన్ను దలంచి!

రానా - నటించేప్పుడు మీలో బెరుకెప్పుడూ కనిపించదు..!

బాలకృష్ణ - నటన అంటే గట్టిగా అరవడం, ఏడవటం, అతిగా హావభావాలు చూపించడం కాదనేది నా అభిప్రాయం. నటనంటే... మనకు తెలియని ఒక వ్యక్తి తాలూకూ పాత్ర స్వభావాన్ని ఆపాదించుకోవడం. ఆ పాత్రలా మారిపోవడం. మనకు తెలియని, ఆ పాత్రకు మాత్రమే తెలిసిన అనుభవాలను ప్రదర్శించడం అని నా ఉద్దేశం.



రానా - ఈ తరం తెలుసుకోవాల్సింది గొప్ప వ్యక్తుల చరిత్రే కదా..?


బాలకృష్ణ - కాలగమనంలో ఎన్నో పరిణామాలు జరుగుతుంటాయి. వాటి క్రమమే చరిత్ర. దాన్ని ఎవరూ సృష్టించలేరు. పంచభూతాల్లా మన భూమ్మీద, సమాజంలో ఏర్పడిన అనేక అంశాలు చరిత్రలో భాగమే. చరిత్రే వాటిని సృష్టించింది. చరిత్రను ఎవరూ సృష్టించలేరు. అందరి జీవిత చరిత్రలు తెలుసుకోవాల్సిన అవసరం రాదు. గొప్పవాళ్లుగా బతికిన ఎన్టీఆర్ లాంటి వ్యక్తుల జీవిత చరిత్రలు తెలుసుకోవాలి. రానా నువ్వు చాలాసార్లు నాతో చెప్పావు. ఎన్టీఆర్ నటించిన దానవీర శూర కర్ణ లాంటి చిత్రాలు నీకు స్ఫూర్తినిచ్చాయని. తెలుగు భాష నేర్చుకునే ఆసక్తిని కలిగించాయని.

రానా - మీరు చేసిన అతి కష్టమైన పాత్ర ఏది...?

బాలకృష్ణ - కష్టమైనది అడగొద్దు, సులువుగా నటించిన పాత్ర ఏదైనా ఉందా అని అడగండి. నా సమాధానం ఎన్టీఆర్. ఎన్టీఆర్ పాత్రలో నటించడం అతి సులువుగా అనిపించింది. నేను ఎన్నోసార్లు చెప్పాను. ఎన్టీఆర్ నాకు తండ్రి మాత్రమే కాదు, నా గురువు, మార్గదర్శి. అందువల్ల ఎక్కువగా ఆయన పాత్రను అవలోకనం చేసుకోగలిగాను. నేను ఆయనలా నటించాను... అనేకంటే ఆయనే నన్ను ముందుకు నడిపించారు అనాలి.

రానా - బయోపిక్ నిర్మాణ బాధ్యతలు తీసుకోవడానికి కారణం..

బాలకృష్ణ - చిత్ర నిర్మాణమంటే భారమని అనుకుంటారు. ఎన్టీఆర్ బయోపిక్ విషయంలో దీన్నో బాధ్యతగా తీసుకున్నాను. నాన్న ఆశీర్వాదం అనుకుంటాను. కొడుకుగా నాకు పూర్తి హక్కు ఉంది. ఈ చిత్ర నిర్మాణంలో ఎంతో శ్రమ తీసుకున్నాం. భౌతికంగా, మానసికంగా కష్టపడ్డాం. అయితే ఇదంతా నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను.



రానా - ఎన్టీఆర్ చేసిన ఏ పాత్రని మీరు చేస్తారని మిమ్మల్ని చాలా మంది అడిగేవారట. మరి ఈ చిత్రంలో ఎన్టీఆర్ చేసిన దాదాపు అన్ని పాత్రలతో పాటు, ఆయన క్యారెక్టర్‌లోనే నటించే అవకాశం మీకు దక్కింది..

బాలకృష్ణ - ఏడాదిన్నర క్రితం సొంతూరు నిమ్మకూరు వెళ్లాం. మా అల్లుడు లోకేష్ నిమ్మకూరును దత్తత తీసుకున్నారు. అక్కడి ప్రాథమిక వైద్య శాల అభివృద్ధి పనుల నిమిత్తం అక్కడికి వెళ్లాను. నిమ్మకూరులో మాట్లాడుతున్నప్పుడు నాకు తెలియకుండానే ఎన్టీఆర్ బయోపిక్ చేస్తున్నాను అని చెప్పేశాను. అలా ఎందుకు అన్నానో తెలియదు. ఆ తర్వాత మా కుటుంబ సభ్యుడు విష్ణు ఇందూరి ఎన్టీఆర్ బయోపిక్ చేద్దామని నా దగ్గరకు వచ్చారు. ఆ తర్వాత నిర్మాణంలో నేనే భాగమవడం, అన్ని పాత్రలకు మంచి నటులు దొరకడం అలా జరిగిపోయాయి. ఏదో శక్తి వీటన్నింటినీ నడిపించింది అనిపిస్తుంటుంది.

రానా - ఎన్టీఆర్ బయోపిక్ దర్శకుడి ఎంపిక ఎలా జరిగింది..?

బాలకృష్ణ - అది కూడా దైవ నిర్ణయమే అనుకుంటాను. క్రిష్ నాతో గౌతమీ పుత్ర శాతకర్ణి సినిమా చేశారు. ఎన్టీఆర్ బయోపిక్ గురించి నిర్మాత విష్ణు ఇందూరి క్రిష్‌కు గతంలో ఒకసారి చెప్పారట. అది చాలా ఉద్వేగపరిచిందాయనను. మేమిద్దరం కలిసిన సందర్భంలో క్రిష్ నన్ను ఒకసారి తేరిపార చూసి బాల మనం సినిమా చేస్తున్నాం అన్నారు. మరుసటి రోజే దర్శకుడు క్రిష్ అని ప్రకటించాం.



రానా - ఎన్టీఆర్ బయోపిక్ ప్రత్యేకత ఏంటని చెబుతారు..?

బాలకృష్ణ - గాంధీ గారి బయోపిక్ చేసేప్పుడు దర్శకుడు రిచర్డ్ అటెన్ బరోను చాలా మంది అడిగారట. ఆయన జీవితంలో ఎవరెవరు ఉంటారు అని. జీవిత కథలను తెరకెక్కించడం అంటే ఎవరొస్తారు, ఎవరు పోతారు అనేది కాదు. గొప్ప వాళ్ల జీవితంలో నుంచి సమాజం ఏం నేర్చుకుంటుంది. వాళ్లను ఎలా ప్రభావితం చేస్తుందని అంతే. లేకుంటే ఎన్టీఆర్ జీవితంతో ఐదారు సినిమాలు చేస్తూ పోవచ్చు. ఇది ఒక్క ఎన్టీఆర్ బయోపిక్ మాత్రమే కాదు. ఏఎన్నార్ బయోపిక్ కూడా. ఆయనకూ కథలో సమాన ప్రాధాన్యత ఉంటుంది. ఎన్టీఆర్ ఏఎన్నార్ తెలుగు చిత్ర రంగంలో సమఉజ్జీలుగా కొనసాగారు.

రానా - ఎన్టీఆర్ ఏఎన్నార్ అనుబంధం గురించి మీ మాటల్లో..

బాలకృష్ణ - వాళ్లిద్దరూ నరనారాయణ సంభూతులు అంటారు కదా. అలా అని చెప్పొచ్చు. నాన్నగారు పోయాక మొదటి ఎన్టీఆర్ జాతీయ పురస్కారం బాబాయ్ (అక్కినేని నాగేశ్వరరావు)కే ఇచ్చారు. ఆ రోజు సభలో నేను బాగా మాట్లాడాను. చక్కగా మాట్లాడావు అన్నారు ఏఎన్నార్ .

రానా - మీరంతా మీ నాన్న, తాతల పాత్రల్లో నటించారు. నేనైతే చెమటోడ్చాల్సి వచ్చింది..!

బాలకృష్ణ - నటులంతా నిత్యావసర వస్తువులలాంటి వాళ్లం. ప్రతి రోజూ మన అవసరం ఉంటుంది. నేను ఇలాంటి పాత్రలే చేస్తానంటే కాదు. సవాలు లాంటి క్యారెక్టర్స్ కూడా చేయాలి.

రానా - చంద్రబాబు గారి పాత్ర ఎలా చేయాలో క్రిష్ గారితో పాటు చంద్రబాబు గారితో కూడా చెప్పించారు. అది నటుడిగా నాకు చాలా ఉపయోగపడింది.

రానా - ఇతర పాత్రలకు ప్రాధాన్యత ఎలా ఉంటుంది..?

బాలకృష్ణ- ఎన్టీఆర్ నట, వ్యక్తిగత జీవితంతో ముడిపడిన ఎన్నో పాత్రలను చిత్రంలో చూపించాం. బయటకు తెలియని వ్యక్తుల గురించి కూడా సినిమాలో ఉంటుంది. ఎన్టీఆర్ భావోద్వేగాలు ఉన్న నటుడు. ఆయన తన మనసుతో ఆలోచించేవారు. ఈ చిత్రంలో పనిచేసిన ప్రతి ఒక్కరికీ ఆ పాత్ర పేరుతోనే పిలిపించుకునేంత గుర్తింపు... దక్కుతుందని భావిస్తున్నాను. ●

---

* రంగవల్లిక *



19 చుక్కలు
3 వరుసలు
మధ్యచుక్కతో
3 వచ్చే వరకు



కె.సుభాషిణి
బ్రాడీపేట, గుంటూరు

మీరూ ముగ్గులు పంపొచ్చు

ముగ్గుని ఎ4 సైజున్న మందపాటి పేపరుమీద వేయాలి. ఔట్ లైన్‌ని, చుక్కలను బ్లాక్ స్కెచ్ పెన్నుతో వేసి లోపల రంగులు నింపాలి. ఎన్ని చుక్కలు ఎన్ని వరుసలు అనే వివరాలను స్పష్టంగా రాయాలి.

అడ్రసు: లైఫ్ c/o ఆంధ్రప్రభ, 8-2-293/82/ఎ/75, ఫ్లాట్ నెం:75, రోడ్ నెం:9, జూబ్లీహిల్స్, హైదరాబాద్-28
lifepage2012@gmail.com

మనసుకి శాంతి మేనుకి విశ్రాంతి!

గోముఖాసనం

యోగా టైమ్

ముందుగా సుఖాసనంలో కూర్చోవాలి. తరువాత చిత్రంలో చూపినట్టుగా రెండుమోకాళ్లు ఒకదానిపై ఒకటి వచ్చేలా... కుడికాలు ఎడమవైపుకి ఎడమకాలు కుడివైపుకి వెళ్లేలా చేయాలి. పాదాలు పట్టుకుంటే అలా తీసుకువెళ్లటం సులభం అవుతుంది. ఇప్పుడు కుడిచేతిని పైకి చాపి మోచేతి వద్ద మడిచి వీపు వెనుకకు తీసుకువెళ్లి అలాగే చాపి ఉంచాలి. ఆ తరువాత ఎడమచేతిని వీపు వెనక్కు తీసుకుని వెళ్లి...చేతుల వేళ్లను చిత్రంలో చూపినట్టుగా కలిపి ఉంచాలి. తలను కుడిచేతిమీద ఆన్చి ఉంచాలి. ఇలా ఒక నిముషం వరకు సాధారణ శ్వాసలో రిలాక్స్‌గా ఉండాలి. తరువాత రెండవవైపున కూడా ఇలాగే చేయాలి.





మోడల్
స్నేహిత

ప్రయోజనాలు:

- ఈ ఆసనంతో అలసట తొలగిపోయి విశ్రాంతి కలుగుతుంది.
- టెన్షన్, ఒత్తిడి, ఆందోళనలు తగ్గుతాయి.
- కీళ్లనొప్పులు, నడుంనొప్పి, సయాటికా ఉన్నవారికి ఈ ఆసనం చాలా చక్కని విశ్రాంతిని ఇస్తుంది.
- భుజాలు మెడనొప్పులు, బిగుసుకుపోవటం లాంటి సమస్యలు తగ్గుతాయి.



-గాయత్రి (యోగా ట్రైనర్)

సెల్ఫీతో... మణికట్టుకి ముప్పు!

ఎక్కడికి వెళ్లినా ఎవరిని కలిసినా ఒక సెల్ఫీ తీసుకుంటే ఓ పనయిపోతుంది...అనుకుంటున్నారు ఇప్పుడు చాలామంది. ఈ విషయంలో యువతరం మరింత ముందు ఉంది. అయితే పదేపదే ఇలా సెల్ఫీలు తీసుకోవటం వలన మణికట్టు వద్ద నొప్పి వస్తుందని... చాలామంది ఈ సమస్యకి గురవుతున్నారని ఒక అధ్యయనంలో తేలింది. సెల్ఫీలతో మణికట్టువద్ద నొప్పితోపాటు, తిమ్మిరి, ఇతర అసౌకర్యాలు కలుగుతున్నాయని గుర్తించారు.



ఫోన్‌ని తమవైపుకి పెట్టుకోవటం కోసం చేతిని మెలితిప్పటం లేదా ఫోన్‌ని చాలా దూరంగా పెట్టుకోవటం వలన ఇలాంటి సమస్యలు వస్తున్నాయని వైద్యులు అంటున్నారు. ఈ మధ్యకాలంలో 'సెల్ఫీ రిస్ట్' సమస్యలు మరింత ఎక్కువ అవుతున్నాయని తెలుస్తోంది. సెల్ఫీలకోసం కొండలు గుట్టలు ఎక్కడం, దారి సరిగ్గా లేని ప్రదేశాల్లో....ఎక్కడ ఉన్నామనేది చూసుకోకుండా కేవలం సెల్ఫీపైన మాత్రమే దృష్టిపెట్టి నడవటం వలన కూడా మణికట్టుకి గాయాలవుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. ఈ వివరాలను ఐరిష్ మెడికల్ జర్నల్‌లో ప్రచురించారు. తరచుగా సెల్ఫీలు తీసుకునే అలవాటు ఉన్నవారు వాటి వెనుక దాగి ఉన్న ఈ సమస్యలను గుర్తుపెట్టుకోవాల్సిందే.

ఆందోళనకు మూలం



ఒక బలవంతుడు, బలహీనుడి మీద దాడిచేసినప్పుడు ఆ బలహీనుడికీ, తన డబ్బంతా పోగొట్టుకుని బాధతో ఉన్నవాడికీ, విపరీత కామం చేత మనస్సు దహించుకుపోతూ తీవ్రంగా కలత చెందిన వాడికీ నిద్రపట్టదు. ఉన్న దానితో తృప్తి చెందనివాడికి, పక్కవాడి సొమ్ము మీద, కన్నేసిన వాడికి, బలవంతుడితో మూర్ఖంగా శత్రుత్వం పెట్టుకున్నవాడికీ ఆందోళన కలుగుతుంది.

మనిషికి ఆవేదన ఎందుకు కలుగుతుంది? ఎవరు పండితుడు? ఎవరు బుద్ధిమంతుడు? ఎవరు మూర్ఖుడు? పండితుడి లక్షణాలేమిటి? ఇవి చాలా మందికి వచ్చే ప్రాథమిక సందేహాలు. విదురనీతి బోధించిన విదురుడు భారతంలో వీటికి సమాధానాలు చెప్పాడు. ఈ రోజుల్లో నాలుగు శ్లోకాలు తెలిసిన ప్రతివాడూ పండితుడినని చెప్పుకుంటు న్నాడు. ఎవ్వరికైతే తన శక్తియుక్తుల మీద పూర్తి అవగాహన ఉంటుందో, వాటి మీద మాత్రమే ఆధారపడి పనులు చేస్తారో వారు పండితులని పిలువబడతారు. దేనినీ వారు చిన్నచూపు చూడరు. పండితుడు తనకు అందని దాని కోసం ఆరాటపడడు, నష్టమైన దానిని గురించి విచారించడు. ఆపద వచ్చినపుడు వివేకాన్ని కోల్పోడు. నిండు కొండ తొణకదన్నట్టుగా, ప్రశాంతంగా, గంభీరంగా, నిర్మలంగా ప్రవహించే గంగానది మధ్యలో లోతైన ప్రదేశం ఉన్నా ఎటువంటి ఆటుపోట్లులేనట్టుగా పండితుడైనవాడు సన్మానాలకు పొంగిపోడు, అవమానాలకు కృంగడు. ఎంతో సంపద, అధికారం, విద్య ఉన్నప్పటికీ అణిగి మణిగి ఉండేవాడే పండితుడు. అతను స్వంత లాభం కోసం చూడడు. ఇదంతా విదురుడు, ధృతరాష్ట్రుడికి చెప్పాడు. ఒకసారి ధృతరాష్ట్రుడికి అంతులేని ఆవేదన కలిగింది. ఆ ఆవేదన నుంచి బయట పడేయ టానికి విదురుడు కావాల్సి వచ్చింది. ఎందుకంటే ధృతరాష్ట్రుడికి తెలుసు విదురుడు సాక్షాత్తూ సమవర్తి (యమధర్మరాజు) అవతారం. ధర్మాధర్మ విచక్షణా జ్ఞానం కలిగిన పుణ్యమూర్తి. లోకరీతి, లోకజ్ఞానం, లోకనీతి, క్షుణ్ణంగా తెలిసినవాడు. రాజ్యాంగ విధులు నిర్వర్తించడంలో ఆరితేరినవాడు. అందుకే ధృతరాష్ట్రుడు ఆయనను పిలిపిం చుకుంటాడు. ఎలాంటి మర్మం లేకుండా నిజాన్ని నిర్భయంగా చెప్పగలిగినవాడు విదురుడని ఆయనకు బాగా తెలుసు. విదురుడు బుద్ధిమంతుడెవరో, పండితుడెవరో, మూర్ఖుడు ఎవరో చెప్పాడు. తన పనిని పూర్తిగా విడిచి ఇంకెవడికో సహాయం చేయాలంటూ పడి పరుగెత్తి వ్యర్థంగా ప్రవర్తించేవాడు మూఢుడు. చిటికెలో అయ్యే పనిని యుగాలు గడిచినా తెమల్చనివాడు, ఎప్పుడూ వాయిదా పద్ధతులే అవలంబించేవాడు, సర్వత్రా అనుమానాలతో ఉండేవాడే అసలైన మూర్ఖుడు. ఇంకొకసారి కూడా ధృతరాష్ట్రునికి ఇలాంటి ఆందోళనే కలిగింది. సంజయుడు రాయబారానికి వెళ్లి వచ్చిన తర్వాత టూకీగా విషయం తెలియపరిచాడు. సంజయుడు ఒక్క మాటలో విషయం చెప్పి మిగిలినవి రేపు సభలో వివరిస్తానని చెప్పి సెలవు తీసుకున్నాడు. ఏమీ తోచలేదు ధృతరాష్ట్రునికి. తన గుండె దడ తగ్గాలంటే ఆ బాధ తన తమ్ముడితోనే పంచుకోవాలి. విదురుడు రాగానే చెప్పకనే చెప్పాడు, తన మనసులోని ఆందోళనకి కారణం తెలియడం లేదన్నాడు. అందుకు విదురుడు నింపాదిగా సమాధానం చెప్పాడు. 'రాజా! ఎవ్వరికైనా మనసు ఎందుకు ఆందోళన పడుతుంది? ఒక బలవంతుడు, బలహీనుడి మీద పడినప్పుడు ఆ బలహీనుడికీ, తన డబ్బంతా పోగొట్టుకుని బాధతో ఉన్నవాడికీ, విపరీత కామం చేత మనస్సు దహించుకుపోతూ తీవ్రంగా కలత చెందిన వాడికీ నిద్రపట్టదు. ఈ దోషాలలో ఏది నీ మన స్సులో ప్రవేశించింది? అని ప్రశ్నిస్తూనే ఆందోళన ఎవరికి కలుగుతుందో అద్భుతంగా వివరించాడు. ఉన్నదానితో తృప్తి చెందనివాడికి, పక్కవాడి సొమ్ము మీద, ఇతరుల భార్య మీద కన్నేసిన వాడికి, బలవంతుడితో మూర్ఖంగా శత్రుత్వం పెట్టుకున్నవాడికీ ఆందోళన కలుగుతుంది. విదురుడు ధృతరాష్ట్ర మహారాజుకి సాంత్వన కలిగించేందుకు ఈ విషయాలు చెప్పినా ఈ నీతుల్లోని మర్మాన్ని గ్రహించగలగాలి. అయితే ధృతరాష్ట్రుడికి సంజ యుడు ఏమి చెప్పాడో తెలుసుకుందాము. ధర్మరాజు స్వాధీన మనస్కుడు కనుక మహారాజుకి 'నీవే మా బలం, బలగం' అని చెప్పమన్నాడు. దీనిని చాలా వినమ్రంగా చెప్పకనే చెప్పాడు సంజయుడు. ఇంద్ర ప్రస్థాన్ని తిరిగి ఇచ్చేయడమో, లేదా రణరంగంలో కలుసుకోవడమో తేల్చుకోవాలన్నది ధర్మరాజు పంపిన సందేశం.




- డాక్టర్ పులివర్తి కృష్ణమూర్తి

పతంజలి యోగసూత్రాలు చెప్పేదేమిటి?

యోగ శాస్త్రానికి ఒక రూపం ఇచ్చి ప్రచారం చేసిన వారిలో ఒకరిగా భావించే పతంజలి ఆయన యోగ సూత్రాల అసలు అర్థం గురించి సద్గురు వివరణ...

పతంజలి ఒక జ్ఞాని. అంతే కాదు, ఆయన మేధ ఎంత గొప్పదంటే ఈనాటి ప్రముఖ శాస్త్రవేత్తలు కూడా ఆయన ముందు చిన్నపిల్లలలాగా కని పిస్తారు. జీవితంలోని ప్రతి అంశం మీద ఆయనకున్న అవగాహన అంత గొప్పది. పతంజలి కాలంలో, అంటే వేలాది సంవత్సరాలకు పూర్వం, యోగా అనేది, అనేక వందల ప్రత్యేక యోగాలుగా మార్పు చెందింది. అది ఎలా అంటే ఈ కాలంలో వైద్యవిధానంలో వచ్చిన స్పెషాలిటీల లాగ. ఉదాహరణకు ఓ 30 ఏళ్ల క్రితం మీకు ఒక ఫ్యామిలీ డాక్టర్ ఉండేవాడు, కానీ ఈనాడు మీ శరీరంలో ప్రతి దానికి వేరు వేరు డాక్టర్లు ఉన్నారు. బహుశా మరో యాభై ఏళ్లలో ఎలా తయారవుతుందంటే, మీరు ఒక వైద్య పరీక్ష చేయించుకోవాలంటే వందమంది డాక్టర్ల దగ్గరికి వెళ్లవలసి వస్తుంది. మీకు ఇంతమంది వైద్యుల నుంచి అపాయింట్‌మెంట్ దొరికేటప్పటికి, మీకు ఆ జబ్బైనా తగ్గిపోతుంది, లేదా చావైనా మూడుతుంది. ఇటువంటి ప్రత్యేకతలు ఒక స్థాయిని దాటితే అది ఎంతో ఘోరంగా, ఆచరించడానికి అసాధ్యంగా అనిపించవచ్చు. అన్ని వివరాలు పరిశీలించడం ఒక ఎత్తు, కానీ వాటిని ఉపయోగించడమనేది చాలా కష్టతరమవుతుంది. ఆ కాలంలో యోగాలో ఇదే జరిగింది. యోగాలోని రకరకాల పార్శ్వాలను అర్థం చేసుకోడానికి రకరకాల యోగ విధానాలు తయారయ్యాయి. అవి ఆచరణ సాధ్యం కాదని పతంజలి గ్రహించాడు. అందువల్ల ఆయన యోగాలను రెండు వందల సూత్రాలుగా వర్గీకరించాడు.



సద్గురుబోధ

యోగ సూత్రాలు అనేది ఒక సిద్ధాంతం కాదు

ఈ కాలంలో ప్రతి ఒక్కరూ ఒక పుస్తకాన్ని ప్రచురించగలరు కాబట్టి ఈ సూత్రాలకు అనేక వ్యాఖ్యలు తయారయ్యాయి. కానీ యోగ సూత్రాలు వ్యాఖ్య చేయగల ఒక సిద్ధాంతం కాదు. అందులో ఏవిధమైన సాధనలు లేవు. అవి కేవలం శాస్త్ర పరిశోధనా పత్రాలు. ఒక పద్ధతిలో ఏమి జరుగుతుందో అవి చెబుతాయి. అంతవరకే, ఈ పద్ధతిలో, మీకు కావలసినదాన్ని బట్టి మీరు ఒక క్రియను రూపొందించవచ్చు.

సూత్రం అంటే దారము అని అర్థం. ఒక పూలమాలలో దారం ఉంటుంది. కానీ మీరు ఆ మాలను దారాన్ని చూసి ధరించరు. ఆ దారానికి ఎటువంటి పుష్పాలు, ఎటువంటి పూసలు, ఎటువంటి ముత్యాలు, వజ్రాలు గుచ్చారు అనేది చూస్తా రు. వాటిని కూర్చడం వ్యక్తి నైపుణ్యాన్ని బట్టి ఉంటుంది. పతంజలి కేవలం ఒక దారాన్ని అందిస్తున్నాడు. ఎందు కంటే దారాలు లేకుండా మాలను ధరించలేరు. ఆ సూత్రాలు చదవటానికి, అర్థం చేసుకోవడానికే కాదు. మీరు వాటిని మీ తెలివితో వాటిని అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తే, అది అర్థ రహితం అవుతుంది.

ఒక ఉన్నత స్థాయి అనుభవం, అనుభూతి ఉన్న వారికి ఈ సూత్రం అనేది ఎంతో గొప్పది. ఆయన దానితో ఒకమాలను తయారుచేస్తాడు. అందుకే పతంజలి యోగ సూత్రాలూ ఒక పుస్తకం లాగా చదవటానికి కాదు. మీరు ఒక సూత్రాన్ని తీసుకుని, దానిని మీ జీవితంలో వాస్తవం చేసుకోవచ్చు. మీ జీవితంలో మీకు ఒక సూత్రం వాస్తవమైతే, మీరు మిగతా సూత్రాలు చదవవలసిన అవసరం లేదు.

మొదట సూత్రం ...ఇక, ఇప్పుడు యోగ

యోగ సూత్రాలు జీవితం గురించి అతి గొప్ప విషయ పరిజ్ఞానమిస్తాయి. మరి పతంజలి ఆ గొప్ప వ్రాతలను ఒక వింత రీతిలో ఎందుకు మొదలుపె ట్టాడు? పతంజలి యోగ సూత్రాలలోని మొదటి వాక్యం''...ఇక, ఇప్పుడు యోగ''. ఒక రకంగా ఆయన చెప్పింది ఏమిటంటే, మీరు ఇంకా ఒక కొత్త ఇల్లు కట్టుకోవడం వల్లనో, పెళ్లి చేసుకోవడం వల్లనో, డబ్బు సంపాదించడం, ఇటువంటి మిగతా వాటి వల్ల మీ జీవితం బాగుపడుతుందనుకుంటే, ఇంకా మీకు యోగాకు సమయం రాలేదన్న మాట. అవి ఏవీ మీ జీవితాన్ని ఉన్నతం చేయవు. అని మీరు తెలుసుకుంటే, అప్పుడు యోగా ప్రారంభించాలని అర్థం.

రెండవ సూత్రం మనసు కేంద్రీకరించడం

ప్రశ్న: పతంజలి తన రెండవ యోగ సూత్రంలో యోగం 'చిత్తవృత్తి నిరోధకం' అని అన్నారు. దాని అర్థం. ''మీరు మనసును ఏదో ఒక వస్తువుపై కేంద్రీకరించడం, మరి ఏ ఇతర పరధ్యానం లేకుండా ఆ ధ్యాసను అలా ఉంచుకోవడం'' మరి దీని అర్థం ఏమిటి?

సద్గురు: దానిని ధారణ అంటారు. ధారణ అంటే, అక్కడ మీరు, మరో వస్తువు ఉన్నది. మీరు ఆ వస్తువు మీదే పూర్తి ధ్యాసపెడితే, కొంతకాలానికి అక్కడ మీరే ఉంటారు లేక అదే ఉంటుంది. దానిని ధ్యాస అంటారు. అది కేంద్రీకరించటంలోని మరోస్థాయి. మీరు ధ్యానాన్ని అలాగే ఉంచుకోగలిగితే, కొంతకాలానికి అక్కడ మీరు ఉండరు. ఆ వస్తువు ఉండదు. అక్కడ మహత్తరమైన స్థితి ఉంటుంది. దానినే సమాధి అంటారు. సాధనలో ఇవే క్రమంగా వచ్చే ఉన్నత స్థితులు.

మీరు ఒక వస్తువు మీద ధ్యాస పెట్టండి అని మేము అంటే, దేవుడినో, ఏదో వస్తువునో పూజించడం అనుకుంటారు. అలా కానక్కరలేదు. మీరు ఏదో ఒక పుష్పం మీదో, పత్రం మీదో, చివరకు ఒక ఇసుక రేణువు మీదనో, దేనిమీదైనా మీ మనసును కేంద్రీకరించవచ్చు. కాని మీరు దేనిమీదైనా మనసు కేంద్రీకరిస్తే, అది మీ మనోభావాన్ని ఒక ఉన్నత స్థాయికి తీసుకువెళ్లగలగాలి, అప్పుడే మీకు దానిమీద ధ్యాస నిలుస్తుంది. కాని, విద్యార్థులకు తమ పుస్తకాల మీద మనసు పెట్టమంటే అంత కష్టం కావడానికి కారణం అదే. ఆ విద్యార్థికి పక్కింటి పిల్లమీద ఆసక్తి ఉంటే, మీరు అతనికి ఆ పిల్లమీద ధ్యాసపెట్టు అని చెప్పనక్కరలేదు. ఎలాగూ అతను ఆమె మీద ధ్యాసపెట్టే ఉంటాడు. ఎందుకంటే దాని వెనక ఒక రకమైన మనోభావం ఉన్నది.

అనేక రకాల దేవుళ్లు రూపుదిద్దుకోవడానికి ఇదే కారణం. మీరు దేనితో సంబంధం పెట్టుకోగలరో, దానిమీద ధ్యాసపెట్టండి. ఒకవేళ మీరు అప్పటికే ఉన్న ఏ దేవుడి మీద ధ్యాసపెట్టలేకపోతే, మీరు మరో దేవుడ్ని ఎంచుకోవచ్చు. మీకు అది కూడా పని చేయకపోతే, మరో దానిని తీసుకోవచ్చు. అవీ పనిచేయకపోతే, మీ అంతట మీరే ఒక దేవుని తయారుచేసుకోవచ్చు. దానినే మనం ఇష్టదేవత అంటాము. దీనివెనక ఉన్న ఉద్దేశం ఏమిటంటే, మీరు ఒకదానిని చాలా గొప్పగా భావించకలేకపోతే మీరు దానిమీద ధ్యాసపెట్టలేరు. మీరు మీకు ఇష్టంలేని దానిమీద ప్రయత్నం చేస్తే అది మిమ్మల్ని అలసటకు లోనుచేస్తుంది. ఆ వస్తువు మిమ్మల్ని పూర్తిగా ఆకర్షిస్తేనే, మీరు పూర్తిగా ధ్యాసపెట్టగలరు.

మీరు ఒక పుస్తకాన్ని చదవటం, ఒక సినిమాను చూడడం, ఎలా ఉంటుందో, ఇది కూడా అంతే. ఉదాహరణకి మీరు ఒక పాఠ్యపుస్తకాన్ని చదివారు అనుకోండి. ఈ పుస్తకం మామూలు తెలివిగలవారికి ఉద్దేశింపబడింది. అయినా మీరు దానిని పూర్తిగా అర్థం చేసుకోలేరు. అదే మీరు ఒక ప్రేమ కథ, డిటెక్టివ్ పుస్తకం గంటలకు 70పేజీల వేగంతో చదివినా, మీరు ప్రతి పదాన్ని గుర్తుపెట్టుకోగలరు. మీరు ధ్యాస పెట్టిన వస్తువు మీలో ఉత్సాహాన్ని పెంపొందించాలి. లేకపోతే మీకు అది ఒక రకమైన తలనొప్పి అవుతుంది.

ప్రేమాశీస్సులతో...

-సద్గురు జగ్గీవాసుదేవ్


స్త్రీ సన్న్యాస నిరూపణం

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

1946-47 ఆ ప్రాంతంలో కామకోటి పీఠాధిపతులు ప్రచారంగా అరుణాచలం వచ్చి టవునులో వున్న సత్రంలో బస చేశారు. అరుణాచలేశ్వరాలయ ప్రాకారం లోను, తదితర ప్రదేశాలలోను వారి ఉపన్యాసాలు ఏర్పాటయినవి. వారితో ఎంతోమంది పండితులు వచ్చారు. వారంతా ఆశ్రమానికి వస్తూ వుండేవారు. ఇక్కడివారంతా అక్కడికి, అక్కడి వారంతా ఇక్కడికి తిరుగుతూ వుండేవారన్నమాట.

ఒకదినం సంస్కృత విద్వాంసుడూ, ప్రవచన నిరతుడూ, అయిన కల్లూరి వీరభద్రశాస్త్రిగారు, భగవాన్ దర్శనార్థం వచ్చారు. వారు కొన్నాళ్లు మద్రాసులో మా అన్నగారింట్లో గీతా ప్రవచనం చేసి వుండుట వల్ల నాకు బాగా పరిచయం, ఆ పరిచయాన్ని పురస్కరించుకుని వారు ''అమ్మా, కామకోటి స్వాములను చూచి వచ్చారా?''అన్నారు. నాకసలు భగవానుని విడిచి ఎక్కడికీ వెళ్లాలని లేదు. అయినా ఆ మాట బయటపెట్టక ''నావంటి వారిని వారు జూడరు గదా?''(అంటే, సకేశినులగు బ్రాహ్మణ వితంతువులను జూడటం వారికి నిషేధం) అన్నాను. ''అవునది నిజమే. పబ్లిక్ మీటింగులో దూరంగా వుండి చూడవచ్చును''అన్నారు వారు. ''పెద్దలైన వారితో సాంగత్య సంభాషణలు సాధనకు అనుకూలింపవచ్చునుగాని దూరంగా వుండి చూచి ఏం లాభం?''అన్నాను. ''అదీ నిజమేనమ్మా'' అన్నారు వారు.

ఆ వెనుక ఒకదినం ఉదయాన కామకోటి స్వాములు గిరిప్రదక్షిణానికి బయలుదేరాననీ, ఆశ్రమం ముందుగానే దారి గనుక ఇటే వస్తారనీ, లోపలకు వస్తారో రారో అనీ అంతా అనుకుంటూ వుంటే విని, అక్కడకు మనమెందుకని, వెళ్లి, భగవాన్ సన్నిధిలో కూర్చున్నాను. ఎనిమిదీ, తొమ్మిది గంటల మధ్యన అదుగో వారు వస్తున్నారని అంతా లేచి గేటు దగ్గరకు వెళ్లారు. భగవానూ నేనే మిగిలాం. భగవానునన్నుద్దేశించి ''ఏం? నీవు వెళ్లలేదేం?'' అన్నారు. వారికి నావంటి వాళ్లను చూడరాదన్న నియమం వున్నది గదా? వెళ్లి వారి నియమాన్ని ఎందుకు భంగ పరచాలి?''అన్నాను. ''అది సరి'' అంటూ ఆదరపూర్వ కమైన దృష్టితో చూచి మౌనం వహించారు భగ వాన్. తరువాత కొంచెం సేపట్లో అంతా వచ్చి వారు గేటువద్ద కొంచెం సేపు నిలబడి అంతా పరకాయించి చూచి వెళ్లిపోయారని భగవానుతో విన్నవించారు. కామకోటివారల్లా ఆశ్రమం వద్ద నిలబడి చూచి వెళ్లిన వెనుక ఆ సాయంత్రం పబ్లిక్ మీటింగులో అన్ని ఆశ్రమాలకు కట్టుబాట్లున్నవనీ, అవి ఉల్లంఘించేందుకు వీలుకాదనీ అత్యాశ్రమికి ఏమీ వుండవనీ అదే అవధూతాశ్రమమనీ, ఆ భాగ్యం లభించటం చాలా దుర్లభమనీ, రమణ మహర్షి వంటి మహనీయులకే అది సాధ్యమనీ చెపుతూ అనర్గళంగా చాలా సేపు ఉపన్యసించారట.



ఆ వెనుక నాల్గు, అయిదు రోజులకు భగవాన్ సన్నిధిలో వేదపారాయణ చేసేందుకు, అమ్మ కోవెలలో మహాన్యాసం చెప్పేందుకు టవును నుండి వచ్చే రాజు, శాస్త్రి మొదలైన శ్రోత్రియులంతా ఒకదినం సాయంత్రం వేదపారాయణకు కొంచెం ముందే వచ్చి భగవాను సన్నిధిలో కూర్చుని ''భగవానే! కామకోటి పీఠాధిపతులు నిన్న మాకందరకూ నిషేధ పత్రి కలు పంపారు''అని విన్న వించారు. 'ఏమని' అన్నారు భగవాన్. ''స్త్రీ సన్న్యాసం పనికి రాదనీ, అందువల్ల అమ్మ సమాధి, సమాధి మీద లింగం శాస్త్రీయం కాదనీ, అక్కడ మహన్యాసం చెప్పరాదనీ నిషేధించారు'' అన్నారు వాళ్లు.

(తరువాయి భాగం వచ్చే సంచికలో)

- సూరినాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

చింతన


తిరుప్పావై

పాశురం 22

**అజ్గణ్ మాఞాలత్తరశర్, అబిమాన
బజ్గమాయ్ వన్దు నిన్ పళ్లిక్కట్టిల్ కీళే
శజ్గమిరుప్పార్ పోల్ వన్దు తలై ప్పెయ్‌దోమ్
కిజ్గిణివాయ్ చ్చెయ్‌ద తామరైప్పూప్పోలే
శెజ్గణ్ శిఱిచ్చిఱిదే యేమ్మేల్ విళియావో;
తిజ్గళు మాదిత్తియను మెళున్దాఱ్పోల్
అజ్గణిరణ్డుఙ్గొణ్డు ఎజ్గళ్ మేల్ నోక్కుదియేల్
ఎజ్గళ్ మేల్ చాబ మిళిన్దేలో రెమ్బావాయ్**

తాత్పర్యం

అందమైన దేశములతో విశాలమైనట్టి ఈ భూమిని తమ స్వంతమైనదని గర్వించిన చిన్న జీవి నుంచి రారాజులందరున్నూ తమ అభిమానములను వదలుకొని నీవు తప్పవేరు దిక్కులేక వచ్చి నీవు శయనించిన మంచము క్రింద నీ సేవకై చేరి సంఘములుగ పడిగాపులు పడియున్నట్లే మేమున్నూ మా స్త్రీత్వాభిమానమును వదలి అనన్య గతికులమై నిన్ను చేరగల్గితిమి. స్వామీ! చిరు మువ్వలు నోళ్లు తెరచుకుని యుండునట్లున్నూ, అపుడే విచ్చుకొనుచున్న శెందామరలవలెనూ నీ ఎర్రని నేత్రములను, ఒక్క సారిగ తెరువక మెల్లమెల్లగమేము ఓర్చుకొనగల్గునట్టు తెరచి నీ చూపు మాపై ప్రసరింపజేయవా! సూర్యచంద్రులొకతరి ఉదయించినట్లు చల్లని తేజస్సును ప్రసాదించుచున్న సుందరవికసితనేత్ర ద్వయముతో ఒక తరి మమ్ము కటాక్షించితివా ఇక నిన్ను వదలుట యనెడిమేమనుభవించి తీరవలసి యున్న ప్రారబ్ధమంతయు నశించి నీ సంశ్లేషమనే పుణ్యాన్ని పొందగలము.




పాశురం 23

**మారి మలై ముళఞ్జిల్ మన్నిక్కిడన్దుఱజ్గుమ్
శీరియ శిజ్గ మఱివిత్తుత్తీ విళిత్తు
వేరి మయిర్ పొజ్గ వెప్పాడుమ్ పేర్‌న్దు దఱి
మూరి నిమిర్‌న్దు ముళజ్గి ప్పుఱప్పట్టు
పోదరు, మాపోలే; నీ పూవై ప్పూవణ్ణా! ఉన్
కోయిల్ నిన్జిజ్గనే పోన్దరుళి, కోప్పుడైయ
శీరియ శిజ్గాసనత్తిరున్దు, యామ్ వన్ద
కారియమారాయ్ న్దరుళే లో రెమ్బావాయ్**

తాత్పర్యం

వర్షాకాలమునందు పర్వతగుహలో ముడుచుకొని నిశ్చలముగపడి యుండు, నిదురించుచుండు శౌర్యముకల సింహము మేలుకొని, తీక్షణములైన తన చూపులు నలువైపుల ప్రసరింప.ఏసి పరిమళము గల తన జూలు నిక్కబొడవ ఇటునటు దొర్లి, లేచి ఒడలు దులుపుకొని, మెల్లగ దేహము సాగదీయుచు, ఒళ్ళు విరుచుకుని, ఒక్కసారి గర్జించి అడుగులు వేయుచు గుహ నుండి బయల్వెడలినట్లే, ఓ అతసీ పుష్పమును పోలిన దేహ కాంతి కల స్వామీ! నీవు కూడ యిటులనే మమ్ము అనుగ్రహించునట్లు నీ భవనము నుండి విచ్చేసి, సుందరముగ అలంకరింపబడిన జయశీలమగుశ్రేష్ఠమైన సింహాసనమునలంకరించి మేము వచ్చిన కార్యమును పరిశీలించి, మా కోరికననుగ్రహించుమా!



- జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సౌజన్యంతో

దిన ఫలాలు

మేష రాశి: ఆర్థిక లావాదేవీలు అనుకూలం. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. విద్యా ప్రయత్నాలు అను కూలం. మంచి కార్యాలలో పేరు, ప్రఖ్యాతులు లభిస్తాయి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. ఆదాయమార్గాలు సులభతరమవుతాయి.

వృషభ రాశి: ఆర్థిక ప్రయత్నాలు ఊరట కలిగిస్తాయి. స్థిరాస్తి విక్రయాలు వంటివి ఉపకరిస్తాయి. విద్యా విషయాల్లో ప్రాధాన్యత లభిస్తుంది. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ పనికిరాదు. ఆర్థిక విషయాల్లో విస్మయాలు ఉంటాయి. ఆదాయవృద్ధిలో ఆటంకాలు కొనసాగుతాయి.

మిథున రాశి: సాహస నిర్ణయాలు ఊరట కలిగిస్తాయి. కోర్టు వ్యవహారాలలో ఉపశమనం ఉంటుంది. ఆర్థిక వ్యవహారాల్లో అనుకూలత ప్రారంభమవుతుంది. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. పనులలో వేగం పెరుగుతుంది. ఆదాయంలో ప్రయత్నాలు కలసి వస్తాయి.

కర్కాటక రాశి: శ్రమ అధికమవుతుంది. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత ఉంటుంది. అనవసర ఆందోళనలు పెరుగుతాయి. ఆదాయ మార్గాలు అన్వేషించగలుగుతారు.

సింహ రాశి: గృహకార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. ఆర్థిక క్రమశిక్షణ తప్పనిసరి. పెట్టుబడుల ప్రతిబంధకాలు ప్రబలమవుతాయి. ఆరోగ్యం అనుకూలత పెరుగుతుంది. వ్యాపార మోసాలను గ్రహించ లేకపోతారు. ఆదాయంలో అయోమయ పరిస్థితులున్నా అధిగమించగలుగుతారు.

కన్యా రాశి: తెలివైన నిర్ణయాలు తద్వారా విజయాలు చేకూరుతాయి. . ఆహ్లాద పరిస్థితులు గృహరీత్యా ఉంటాయి. వ్యాపార విజ యాలు కొనసాగుతాయి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో చిరాకులు పరిష్కరింపబడతాయి. ఆదాయ మార్గాలు సులభతర మవుతాయి.

తులా రాశి: విదేశీ లావాదేవీలు/సంభాషణలు కలసి వస్తాయి. కోర్టు వ్యవహారాలు లాభిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి. మెరుగైన పరిస్థితులు ఆరోగ్య రీత్యా ఆనందాన్ని కలిగిస్తాయి. అతి తొందర ద్వారా కార్యక్రమాల్లో పొరపాట్లు దొర్లుతాయి. ఆదాయంలో మంచి లాభాలను కూడగట్టుకొనే ప్రయత్నాలు అనుకూలిస్తాయి.


వృశ్చిక రాశి: రాజకీయ నిర్ణయాలు అనుకూలం. నూతన ఒప్పందాలు కలసి వస్తాయి. పరీక్షలు ఆరోగ్యపరంగా ఉపకరిస్తాయి. శ్రమ అధికమవుతుంది. ఆరోగ్యవిషయంలో జాగ్రత్తలు పాటించాలి. పనులలో ఆలస్యం ఉంటుంది. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి: ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన స్నేహాల ద్వారా లబ్ధి చేకూరుతుంది. వ్యాపార ప్రతిబంధకాలను ఎదుర్కోగలుగుతారు. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. గతంలోని తప్పులు సరిదిద్దుకొనే అవకాశాలు లభిస్తాయి. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.

మకర రాశి: సంభాషణల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. కోర్టు వ్యవహారాలు ఊరట కలిగిస్తాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు తప్పని సరి. ఆరోగ్య ప్రతికూలత ఆకస్మికం. బాధ్యతలు పెరుగుతాయి. ఆదాయం గట్టి ప్రయత్నాలతో మాత్రమే సాధ్యం.

కుంభరాశి: నూతన ఉత్సాహం పెరుగుతుంది. విద్యా ప్రయత్నాలు లాభిస్తాయి. శుభవార్తలు వింటారు. శుభ వ్యయం ఉంటుంది. ఆరోగ్య విషయంలో ప్రతికూలత తగ్గుతుంది. పోటీని తట్టుకోగలుగుతారు. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు మాత్రం ఆనందాన్ని కలిగిస్తాయి.

మీనరాశి: రుణ ప్రయత్నాలు లాభిస్తాయి. కోర్టు వ్యవహారాల్లో ఉపశమనం ఉంటుంది. ఆరోగ్య సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. ఆరోగ్యరీత్యా శ్రద్ధ పాటించాలి. ముఖ్యమైన పనుల విషయంలో ఏకాగ్రత తప్పనిసరి. ఆదాయం లో జాగ్రత్తతో కూడిన నిర్ణయాలు ఉపకరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com



సంస్కృతి



ఒక చిత్రకారుడు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపబడాలంటే, ఆ చిత్రకారుడి సృజనలో స్వచ్ఛత వుండాలి. తనదైన శైలి కావాలి. అది సమాజంలో ఒక ప్రత్యేకతను సంతరించుకొనేదిగా కూడా వుండాలి. అప్పుడే వారి చిత్రాలు ప్రముఖంగా పేర్కొనబడతాయి. పైడిరాజుగారి చిత్రాలు పై లక్షణాలన్నీ పుణికి పుచ్చుకున్నాయి కనుకనే ''ఆఫ్టర్‌బాత్''అన్న వీరి చిత్రం ఆఫ్ఘన్ రాజు కొనుగోలు చేయడం జరిగింది.





జానపద చిత్ర రారాజు పైడిరాజు

"Love at first sight"....ఎవరు ఎప్పుడు ఎందుకు ఈ మాటను అన్నారో నాకైతే తెలియదు. కానీ, ఒక్కోసారి అది నిజమే అనిపిస్తుంది. సాధారణ పరిభాషలో అది ఒక సౌందర్యవంతమైన అమ్మాయి లేదా అబ్బాయిల మధ్య ఒకరికొకరికి ఎదురైన ఒక మధురమైన అనుభూతిని తెలిపే పదంగా దీనిని మనం భావిస్తున్నప్పటికీ ఈ పదం మిగిలిన ఎన్నో సందర్భాలకు కూడా వర్తిస్తుంది. అది 1995వ సంవత్సరం. తొలిసారిగా నేను ఉపాధ్యాయుడిగా ముమ్మిడి వరంలో నియమింపబడిన ఏడాది. అక్కడ గ్రామపంచాయితీ లైబ్రరీలో తొలిసారిగా నా కంటపడిన 1960వ దశకం నాటి చలసాని ప్రసాదరావు గారి సంపాదకత్వంలో వెలువడ్డ ''కళ''అనే పుస్తకం. అందులో ప్రచురింపబడ్డ ఒక చిత్రం నాకు అలాంటి అనుభూతినే కలిగించింది. ఒక అచ్చమైన పల్లెపడుచు జడ నిండా పూలు పెట్టుకుని పొడవైన వాలుజడను వయ్యారంగా ముందుకు వేసుకుని ముస్తాబు చేసుకుంటూ చివరిలో నుదుటను తిలకం దిద్దుకుంటున్న దృశ్యం అది. నిజానికి మన భారతీయ శిల్పకళా చరిత్రలో ఇలాంటిది ఒక సాధారణ దృశ్యమే. ఎందుకంటే పదహారవ శతాబ్దం నాటికే హోయసాలుల బేలూరు హళేబీడు శిల్పాలలో నుదుట తిలకం దిద్దుకుంటున్న శిల్పాలను ఆనాటి శిల్పి చెక్కియున్నాడు. అయితే ఈ చిత్రకారుడు శిల్పి కూడా అయినప్పటికీ ఇక్కడ రచించిది శిల్పం కాదు. చిత్రం. అందునా ఆ శిల్పానికి ఈ చిత్రకారుడి చిత్రానికి ఒక్క అలంకరణ అన్న పదం తప్ప మిగిలిన ఏ విషయంలోనూ పోలిక లేదు. ఈ చిత్రంలో అలంకరణ చేసుకుంటున్న అమ్మాయిది కూర్చున్న భంగిమ ముందు పేర్కొన్న కాలం నాటి శిల్పాల్లోలాగా నిల్చున్న భంగిమ కాదు. ఆ కూర్చున్న భంగిమలో కూడా. ఒక అందమైన లయ, రూపంలో అచ్చమైన జానపదం, నిండైన తెలుగుదనం మరియు రంగుల్లో మనసును తాకేటి మట్టివాసన, వెరసి వీక్షకుడి మానసాన్ని హత్తుకునేటి ఒక నవ్యరీతి. అది పూర్తిగా తెలుగు వాడిది అన్నంతగా భావించే ఒక అనుభూతి తొలిసారిగా చూసినప్పుడు నాకు కలిగింది. ఆ తర్వాత మరలా కొన్నాళ్లకు విజయవాడలో మొన్నటివరకు ఉండే విక్టోరియా మ్యూజియంలో అనుకుంటాను ఇదే చిత్రకారుడి వేరొక ఒరిజినల్ చిత్రం ''చేటలో బియ్యం పోసుకుని అందులోని రాళ్లు ఏరుతున్న మరొక పల్లె పడుచును చూసాను. ఈ చిత్రంలో కూడా అదే శైలి, అదే ఆకర్షణ మరలా నాలో ఇప్పటికి ఓ ఇరవై మూడేళ్ల క్రితం తన చిత్రం ద్వారా నన్ను అంతలా ఆకట్టుకున్న ఆ చిత్రకారుడే మనమంతా గర్వపడే ప్రఖ్యాత జానపద చిత్రకారుడు ''అంట్యాకుల పైడిరాజు''గారు.

రంగులతో, రేఖలతో సృష్టింపబడ్డ కళ చిత్రకళ. అయితే, కేవలం రంగుల కలయిక వర్ణ చిత్రం కాదు. అలాగే, కేవలం రేఖల కలయిక కూడా రేఖా చిత్రం కాదు. రంగులు అద్దడంలో ఒక పొందిక ఉన్నప్పుడు రేఖల అమరికలో ఒక లయ కుదిరినప్పుడు మాత్రమే అది ఒక వర్ణచిత్రంగానూ లేదా రేఖాచిత్రంగానూ మారుతుంది. అలా కాకుంటే అవి కేవలం ఒట్టి రేఖలు లేదా శుద్ధ వర్ణాలుగానే మిగిలిపోతాయి.



కేవలం రేఖలతో చిత్రాలు సృష్టించేవాళ్లు కొందరైతే కేవలం రంగులతోనే చిత్రాలను సృష్టించేవాళ్లు ఇంకొందరు. కేవలం రూపాలను మాత్రమే చిత్రించే వాళ్లు కొందరైతే కేవలం నైరూపాలను చిత్రించేవాళ్లు ఇంకొందరు. కేవలం భావ సహిత చిత్రాలను సృష్టించేవాళ్లు కొందరైతే కేవలం భావరహిత చిత్రాలను సృష్టించేవాళ్లు మరికొందరు. రంగు, రేఖ, రూపం, నైరూపం, భావం, అభావం ఏది? ఎలా? ఎందుకు? ఎప్పుడు? ఏవిధంగా? సృష్టించినప్పటికీ, అన్నింటి ఉద్దేశ్యం వీక్షకుడి మనసును రంజింపజేయడమే. అలా అని కేవలం రంజింపజేయడం మాత్రమే కాదు ఆలోచింపజేయడం, ఇంకా ఏదో సందేశం ఆ చిత్రం ద్వారా ఈయడం కూడా ముఖ్యం. ఇలా చూసినప్పుడు పైడిరాజుగారి చిత్రాల్లో కేవలం రేఖలే ఉండవు. అలాగని, కేవలం రంగులే ఉండవు. రంగులు రేఖలు రెండు కూడా పొందికగా అమరి వుంటాయి. ఆ రేఖలలో కొన్ని రూపాలుంటాయి. ఆ రూపాలలో ఒక సాంప్రదాయం వుంటుంది. ఒక జానపద రీతి వుంటుంది. తరతరాల తెలుగు నుడికారం ఉంటుంది. ఒక జాతి గొప్పతనాన్ని సగర్వంగా చెప్పుకునే ఒక రీతి వుంటుంది. ఒక తిలకం, ఒక పేరంటం, ఒక వీణా-పాణి, పూలమాలకట్టే స్త్రీలు, ముంగిట ముగ్గు పెట్టే మగువలు లాంటి చిత్రాల్లో ఎంతటి లలితమైన భావనారీతి మనకు కనిపిస్తుందో! పంటకోసే స్త్రీలు, సంతకేగు మహిళలు, కార్మికులు, కర్షకులు, కృషీవరులు లాంటి చిత్రాలలో పనిపాటలు చేసుకునే జనావళిలో ఉండే ఒక విధమైన మొరటుతనం కూడా కనిపించేలా చేసినప్పటికీ కట్టు-బొట్టు, వస్త్రధారణ అన్నింటా సంప్రదాయాన్ని విస్మరించని ఒక తెలుగుదనాన్ని పైడిరాజుగారి చిత్రాల్లో మనం చూస్తాము. గ్రామాలలోని పూరిపాకలు పైడిరాజుగారి చిత్రాల్లో పాలరాతి భవనాలను మించిన సౌందర్యాన్ని సంతరించుకుంటాయి. పూరిపాకలు లేకుండా ఏ చిత్రాన్ని పూర్తి చేయకపోవడం పైడిరాజుగారి ప్రకృతి చిత్రాల మరొక ప్రత్యేకత.

ఒక చిత్రకారుడు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపబడాలంటే, ఆ చిత్రకారుడి సృజనలో స్వచ్ఛత వుండాలి. తనదే యైన శైలి కావాలి. అది సమాజంలో ఒక ప్రత్యేకతను సంతరించుకొనేదిగా కూడా వుండాలి. అప్పుడే వారి చిత్రాలు ప్రముఖంగా పేర్కొనబడతాయి. పైడిరాజుగారి చిత్రాలు పై లక్షణాలన్నీ పుణికి పుచ్చుకున్నాయి కనుకనే ''ఆఫ్టర్‌బాత్''అన్న వీరి చిత్రం ఆఫ్ఘన్ రాజు కొనుగోలు చేయడం జరిగింది. ఇంకా ఈజిప్ట్ ప్రభుత్వం సేకరించిన ''ఎ న్యూరోడ్'' అన్న చిత్రం మరియు రష్యావారు కొనుగోలు చేసిన ''టుది మార్కెట్'' అన్నచిత్రాలతో పాటు సాలార్‌జంగ్ మ్యూజియం లాంటి సంస్థలతో పాటు ఎందరో పబ్లిక్ అండ్ ప్రైవేట్ వ్యక్తుల సేకరణలో వీరి చిత్రాలు ఉండడానికి కారణం అయ్యింది.



ఇప్పటికి నూరేళ్ల క్రితం అనగా 1919లో బొబ్బిలిలో జన్మించిన పైడిరాజుగారు చిన్నతనమునందే చిత్రకళలో తనదైన శైలిని ఏర్పరుచుకొని ప్రఖ్యాత చిత్రకారుడు మరియు శిల్పి అయిన రాయచౌదరి గారి గురుత్వంలో ఎన్నో దూషణ భూషణలని కష్టనష్టాలను ఎదుర్కొని దిగ్విజయంగా చిత్రకళను అభ్యసించిన వీరు తనలా ఎవ్వరూ చిత్రకళ అభ్యసనకు కష్టాలు పడరాదనే ఉద్దేశ్యంతోతానే స్వయంగా 1949లో స్వంతంగా విజయనగరంలో ఒక చిత్ర కళాశాలను ప్రారంభించి ఎందరో చిత్రకారుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసిన గొప్ప చిత్రకారుడు అంట్యాకుల పైడిరాజుగారు. రాయచౌదరి సాంప్రదాయానికి చెందిన ఈ చిత్రకారుని పై లేపాక్షి అజంతా చిత్రకళల ప్రభావంతో పాటు జామినీరాయ్ ప్రభావం కూడా ఉందని చెప్పవచ్చు. ఆ ప్రభావంతో తనదైన ఒక జానపద శైలిని సృష్టించి ఒక గొప్ప చిత్రకారునిగా కీర్తినార్జించిన పైడిరాజుగారు గొప్ప శిల్పి, కవి, మరియు నటుడు, గాయకుడూ కూడా కావడం ఒక గొప్ప విశేషం. ''అక్షర శిల్పాలు'' అన్న పేరుతో ఎన్నో గేయాలను వీరు రచించడం జరిగింది. జీవితం అశాశ్వతం. కానీ, కళ మాత్రం శాశ్వతం అన్నారు పెద్దలు. పైడిరాజుగారు ఈ భువిపైకి వచ్చి వందేళ్లయ్యింది. ఈ భువిని వీడి దివికేగి కూడా అప్పుడే ఇరవై యేళ్లయ్యింది. కాని ఆయన సృష్టించి మనకు వదిలి వెళ్లిన ఆయన కళ మాత్రం ఇంకా మనతో సజీవంగా వుంది. మన తర్వాత కూడా సజీవంగానే నిలిచి వుంటుంది అనడంలో ఏమాత్రం సందేహం లేదు.

(పైడిరాజు శతజయంతి సంవత్సరం సందర్భంగా)

- వెంటపల్లి సత్యనారాయణ
9491378313







శిల్పకళా వైభవ చిహ్నం రామప్ప దేవాలయం-2




దీనికి కుడివైపున పేరిణీ శివతాండవం చేస్తున్న నర్తకి వుంది. దీని పక్కనే ధనుస్సు, శరములు ధరించి వేటకు సిద్ధముగా వున్న వనమాలిక (బోయకన్య) కిరాతిని విగ్రహం వుంది. ఆమెకుడికాలుకు ముల్లు విరిగి వాచిపోగా మంగళివాడు ముల్లును సూదితో తీయటం, వాచినకాలు సహజత్వముగా కనబడుతుంది. ఈవిధంగా హాస్య, రౌద్ర, భక్తి, శృంగార, వినోదాల హావభావాలూ, అభినయకౌశలం, ఉదాత్తత, నృత్య ప్రతిభావిధానం, ప్రతీమదనికలో స్పష్టంగా సహజంగా కనిపిస్తుంది.

ఇక దేవగిరి ప్రభువు మహాదేవుడిని ఓడించినందుకు తన విజయ చిహ్నాలుగా రాణి రుద్రమదేవి గజకేసరి శిల్పాలను ఆలయకప్పుకు అలరింపజేశారు. ఈ శిల్పాలకు రెండు అర్థాలు వస్తాయి. ఏనుగుల వంటి శత్రువులకు కాకతీయ రాజులు సింహాల లాంటి వారని దీన్నే శత్రుగజకంఠీరవ అని అంటారు. ఇక ఆలయం ప్రదక్షిణా పథం చుట్టూ అలాగే గర్భాలయ, అర్ధమండప, రంగ మండపాలు...అధిష్టానానికి ఉపానం, కుముదం, క పోతము, కాకతీయుల కాలం నాటి ప్రజల జీవన విధానాలకు దర్పణం పడుతూ వారు అలంకార ప్రియులుగా, సంగీత, వాయిద్య కళల ప్రేమికులుగా, వాత్స్యాయన కామసూత్రా లను పాటిస్తూ శృంగార, రతిక్రియలు జరిపే విజ్ఞానానికి మైథున శిల్పాలనూ, ఏనుగులూ, సింహాలూ, హంసలూ, తాండవ గణపతులూ, భైరవగజలక్ష్మీ మొసళ్లు, (మకరాలు) అలాగే కుడ్యశిల్పాలు, శృంగార శిల్పాలు, వివిధ వాయిద్యకారులు, వివిధ నర్తకులు, లతలు, పద్మపట్టికల వరుసలు, అలాగే జైనమహావీరుడు, బుద్ధుడు, ఆంజనేయుడు, మహిషాసురమర్ధని, వీరభద్రుడు, తదితర శిల్పాలు రామప్పదేవాలయ శిల్పకళా వైభవాన్ని మహోజ్వలంగా ప్రకాశింపజేస్తున్నాయి.

జీవకళ లొలుకుతున్న నంది

ఇక రామప్ప దేవాలయానికి మహోజ్వల ప్రకాశంలో శిఖరాగ్ర మాన కళాఖండంగా కాకతీయ శిల్పానికి అగ్ర మణిమకుటంగా రామప్ప మహానంది వుంది. ఇది ఆలయానికి తూర్పున ప్రత్యేక మంటపంలో కాకతీయ నందులలో అగ్రగామిగా భాసిల్లుతూ వుంది. జిలుగువెలుగుల రామప్ప నందీశ్వరుడు భారతీయ ప్రఖ్యాత మైసూరు, లేపాక్షి, తంజావూరు, యాగంటి నందులను మించిన మహోజ్వల ప్రకాశిత శిల్పకళాసౌందర్యాన్ని కలిగి వున్నాడు. బలిష్టమైన శరీర సౌష్టవంతోనే, వృషణాలు, మూపురం కాలిగిట్టలతో పాటు ప్రతీ అవయవం సహజంగా జీవకళలొలుకుతూ వున్నాడు. ముఖ్యంగా మూపురం శివలింగం వలే గోచరిస్తూ భక్తి పారవశ్యాన్ని కలిగిస్తుంది. ముఖంపై ఉబ్బిన నరాలు, విప్పారిన కన్నుల్లో నీటిపొరలు చూపించడంలో రామప్ప శిల్పి తన కళా చాతుర్యాన్ని అద్భుతంగా ప్రదర్శించాడు. మెడపట్టీలు, చిరుగంటల, అలంకారాలు రకరకాల ఆభరణాల అలంకరణలతో నందీశ్వరుడు రామప్ప దేవాలయానికి శిల్పకళా కీర్తికి ప్రతీకగా వున్నాడు. పూర్వం నుంచి ఆలయంలో వున్న మహానందిని 1990లో ఆలయం తూర్పు వైపున వున్న నందిమంటపాన్ని పునరుద్ధరించి అందులోకి తెచ్చారు. అయితే మంటపానికి పై కప్పు నిర్మించకపోవడం వల్ల సుమారు 26 ఏళ్లుగా నందీశ్వరుడు తన సహజమైన జిలుగు వెలుగులను కోల్పోయి ఉనికికే పెద్ద ప్రమాదం ఏర్పడే పరిస్థితి ఏర్పడింది. కేంద్రపురావస్తు శాఖా వెంటనే నందిమంటపం పై కప్పును నిర్మించి నందిని శాశ్వతంగా కాపాడాలి.



రంగమంటపం ఆలయంలో వైభవోపేతంగా అపూర్వ శిల్పకళలో నిర్మించిన నాలుగు స్తంభాల మంటపాన్ని రంగమంటపం, నాట్యమంటపం అంటారు. ఇది ఒక అద్భుత లోకం. వైకుంఠాన్నీ, బ్రహ్మలోకాన్నీ, కైలాసాన్నీ మరెన్నో లోకాలను, సర్వదేవుళ్లనూ ఒక చోటకు తెచ్చి వేదిక చేశారు. రామాయణ, మహాభారత, మహాభాగవత, శివలీలల ఘట్టాలకు శిల్పులు శిల్పాభిషేకం చేశారు. దీంతో ఆలయం మరువరాని మధురానుభూతిని కలిగించే మనోజ్ఞ శిల్పకళా వైభవశాల అయింది. ఈ ఆలయానికి గోడలు తక్కువ, స్తంభాలు ఎక్కువ. కాగా రంగమంటపం స్తంభాల మధ్యలో చతురస్రాకార ఫలకాల మీద దేవదానవుల క్షీరసాగర మధనం, ముగ్గురు నర్తకులను నాలుగు కాళ్లు వుండి ఆరుకాళ్లుగా కనిపించే చమత్కార శిల్ప, శ్రీకృష్ణగోపికా వస్త్రాపహరణం, పేరిణీ నాట్యం, దండ లాస్యం, కుండలాకార నృత్యం, శివుడి మన్మథ సంహారం తదితర ఘట్టాలున్నాయి. ఇక రంగమంపం పై కప్పుకు దశభుజ నాట్యరుద్రుడు, చుట్టూ భార్యాసమేతులై, వాహనారూఢులై అష్టదిక్పాలకులూ, పశ్చిమ, దక్షిణ దూలములకు పశ్చిమ దిశన మేరు పర్వతం కవ్వముగా వాసుకీ సర్పం తాడుగా దేవ,దానవుల పాలసముద్ర మధనం, శ్రీమహావిష్ణువు, మోహినీ అవతారం, దీనికింద శివుని త్రిపురాసుర సంహారం, తారకాసుర సంహారం, ఉత్తరదిశన గజాసుర సంహారం, నాట్యగణపతి, వరాహ మూర్తులు, ఆలయ శిల్పకళా వైభవాన్ని చాటుతున్నాయి. అలాగే ఈశాన్య, వాయువ్య దూలాలకు దక్షసంహారం, శ్రీరాముని అశ్వమేధ యాగము, సీతాబంగారులేడిని గాంచు ఘట్టము తూర్పున నరకాసుర ఘట్టమున్నది. ఇంకా పార్వతీ కళ్యాణం, త్రిముఖ బ్రహ్మ, మరెన్నో ఘట్టాలున్నాయి. ఇక మంటపం తూర్పున ఎడమవైపున దిష్టిదోష స్తంభం వుంది. ఇక స్తంభాలకుచెరుకుగడలు ఉన్నాయి. బాణాలు ధరించి రకరకాల భంగిమల్లో నిలబడిన స్త్రీలు, సింహాల వరుసలు, లతలూ, వివిధ వాయిద్యకారుల శిల్పాలు జీవకళలతో ఆకట్టుకుంటాయి. ఇక స్తంభాలకు మధ్య శిల్ప ఘట్టంలో సన్నని సందులుంటాయి. అందులో సన్నని దారం లేదా గడ్డిపోచలు దూరుతాయి. ఈ సున్నిత, సూక్ష్మ పనితనానికి శిల్పులు ఎంత సూక్ష్మమైన పనిముట్లు వాడారో తెలుస్తుంది. ఇక గర్భగుడి ముఖద్వారంపైన దక్షయజ్ఞము, శివపార్వతీ కల్యాణ ఘట్టాలున్నాయి. ఈ ద్వారబంధాన్నీ ఒకవైపు 9 విభాగాలుగా, మరోవైపు 9 విభాగాల అలంకరణలతో చెక్కారు. కాకతీయ ప్రభువులకు విజయాలు చేకూర్చిన విజయలక్ష్మికి ప్రతీకగా వారికి ప్రతీకరమైన ఇష్టమైన సిరిదేవత గజలక్ష్మీ వుంది. ద్వారబంధాలకు కుడివైపున దర్పణ సుందరి, ఎడమవైపున పొన్న చెట్టు సుందరిశిల్పాలున్నాయి. సుందరిపట్టుకున్న పొన్న చెట్టును మీటినా లోహ శబ్దం వస్తుంది. దీన్ని సప్తస్వర శబ్దంగా భావిస్తారు. అలాగే ప్రవేశ ద్వారమునకు ఎడమవైపున ఖడ్గం మొనను భూమికి ఆనించి పిడిని పట్టుకొని సతీసమేతంగా భక్తి వినమ్రులై ఆలయాన్ని నిర్మించిన రేచెర్ల రుద్రారెడ్డి దంపతులున్నారు. గర్భగుడి ద్వారం పైన కాకతీయ చక్రవర్తులకు, విజయాలనూ, సిరిసంపదలను ఇచ్చిన గజలక్ష్మీ దేవత వుంది. భక్తులకు స్వాగతం పలికే ద్వారపాలికలున్నాయి. అలాగే రుద్రేశ్వరస్వామిని సందర్శించి బయటకు వస్తున్న భక్తులకు అరటి పండును ఒలిచి పెట్టే ద్వారపాలిక వుంది. ఇక గర్భాలయంలోని రుద్రేశ్వరుడు (శివలింగం) వేయి సూర్యుల కాంతితో దేదీప్యమానంగా ప్రకాశిస్తూ తన దివ్యసందర్శన భాగ్యాన్ని భక్తులకు కలిగిస్తూ వుంటాడు. ఈ క్రమంలో రంగమంటప స్తంభాలపై పడే సూర్యకిరణాలు పరావర్తనం చెంది రుద్రేశ్వరుడిపై పడి ప్రాకృతిక వెలుగుల్ని ప్రసరింపజేస్తాయి. ఇక కాకతీయ ప్రభువులకు యుద్ధాల్లో విజయాలు చేకూర్చిన సప్తమాతృకల దేవతలనిలయాలు ఉన్నాయి. ఇవి ఆలయరంగ మంటపంలో వున్నాయి. ఈ సప్తమాతృకలను ద్రావిడ దేవతలని అంటారు. వారు బ్రాహ్మీ, మాహేశ్వరీ, కౌమారీ, వైష్ణవీ, వారాహీ, మాహేంద్రా, చాముండా అనే ఏడుగురు దేవతలను ఆపేర్లతో పిలుస్తారు. ఈదేవతలను తెలంగాణా వ్యవహారంలో రేణుకా ఎల్లమ్మ ముత్యాలమ్మ, అంకమ్మ, బంగారమ్మ, మాతమ్మ, పోచమ్మ, మైసమ్మ వారి సోదరుడు పోతురాజు అని పిలుస్తారు. ఈ దేవతల విగ్రహాల్ని ఒక్కొక్క చిన్న దేవాలయంగా నిర్మించి ప్రతిష్టించారు. అలాగే వినాయకున్ని కూడా ప్రతిష్టించారు. అలాగే భక్తులు కూర్చోడానికి 20 కక్షాసన ఫలకాలున్నాయి. వీటిపైన గోడలకు వివిధ శిల్పాలు వరుసలున్నాయి. ఇక వర్షపు నీరు ఆలయం గోడలపై పడకుండా వెడల్పైన ప్రస్తరకపోతం వుంది. ప్రస్తరం అనగా కప్పు. కపోతం అనగా చూరు.

(తరువాయి భాగం వచ్చే సంచికలో)

- తాళ్లపల్లి యాదగిరిగౌడ్
9949789939

గ్రామీణుల పాటల్లో స్త్రీల స్వభావం

గ్రామీణ వాతావరణం చాలా మనోహరమైంది. కపటం అక్కడక్కడ ఉన్నా ఎక్కువ శాంతిపూరిత వాతావరణమే కన్పిస్తుంది. శ్రమజీవులైన జానపద స్త్రీలు అలుపు సొలుపు లేక పనిచేస్తారు. వారి అమాయకతను ఆసరా చేసుకొని ధనికులు, భూస్వాములు శ్రమను దోచుకుంటారు. అమాయకత కూడా అప్పుడప్పుడు కొన్ని కష్టాల్ని తెచ్చిపెడుతుంది. అయినా స్త్రీలు సహజసిద్ధమైన ఆ గుణాన్ని వదలలేరు. అదే వారి పాటల్లో కూడా కన్పిస్తుంది. తాము చేసిన తప్పుల్ని, ఎదుటివారు చేసిన మోసాల్ని పాటలుగా పాడుకోవడం గమనిస్తే వారి కపటమెరుగని అమాయకత్వం తెలుస్తుంది.



''కక్కాసి రక్కాసి సుబ్బమ్మా
సుబ్బమ్మ కోడాలు అన్నెమ్మా
అత్తమ్మ అంటేను అన్నెమ్మా
హడలై పోతుంది అన్నెమ్మా
ఒకనాటి కాలంలో సుబ్బమ్మా
సంతకెల్లి నాది సుబ్బమ్మా
అత్తలేనిది సూసి అన్నెమ్మా
సందుదొరికెననుచు అన్నెమ్మా
ఉట్టిమీద నేతిబొట్టు అన్నెమ్మా
సడిసెయ్యక తినుచుండె
అన్నెమ్మా
నూతిలోని ఎలుకలైనా అన్నెమ్మా
కిసమంటూ తిరుగుచుండె
అన్నెమ్మా
అదిచూసి రోసపడి అన్నెమ్మా
అత్తకు జెప్తార ఎలుకమ్మలూ
అన్నెమ్మా
ఉండండి మీపని జెప్తా అన్నెమ్మా
మండేటి కొరివెత్తి అన్నెమ్మా
సూరులోన బెట్టినాది అన్నెమ్మా
సావండి సావండి
ఎలుకమ్మలూ''

అత్తకు భయపడిన కోడలు రహస్యంగా నేతిబొట్టు తినింది. ఎలుకలు అత్తతో తన రహస్యాన్ని చెబుతాయని, ఎలుకల్ని శిక్షింపదలచి ఇంటికి నిప్పుపెట్టింది. ఇల్లు కాలుతుంటే అవి ఏ కలుగులో దూరి తప్పుకున్నాయో. కానీ అన్నెమ్మ ఇల్లు మాత్రం ఆమె అమాయకతతో కాలిపోయింది.

- డా॥ కస్తూరి వెంకట రమణమ్మ
7093239555

అతనో అద్భుతంలా ఉండాలి..

తనకంటే తనను ఎక్కువగా ప్రేమించేవాడు కావాలని కోరుకున్నానని, అలాంటి భాగస్వామి దొరికాడని సంతోషాన్ని వ్యక్తం చేస్తోంది అందాల భామ శృతి హాసన్. బంధాన్ని నిలబెట్టుకోవడంలో మగాడే స్తిమితంగా నిలబడాలన్నది ఈ సుందరి మాట. ప్రస్తుతం



శృతి హాసన్


సినిమాలను బాగా తగ్గించేసిన శృతి మ్యూజిక్ ఆల్బమ్స్ చేసే పనిలో పడింది. కళాకారిణిగా అన్ని రంగాల్లో నిరూపించుకోవాలి కదా అంటుంది. ఆమె తండ్రితో కలిసి శభాష్ నాయుడు చిత్రంలో నటిస్తోంది. మూడు భాషల్లో తెరకెక్కుతుందీ సినిమా. ఈ చిత్రంతో పాటు కొత్తగా మహేష్ మంజ్రేకర్ అనే నటుడు దర్శకత్వం వహిస్తున్న ఠాకూర్ దేవదాస్ అనే చిత్రాన్ని అంగీకరించింది. గాయనిగా, నాయికగా ప్రతిభ చూపిస్తూనే..వ్యక్తిగత జీవితానికి తగిన ప్రాధాన్యమిస్తోంది. తన ప్రేమికుడు గాయకుడు మైఖేల్ కోర్సలోతే బంధాన్ని సన్నిహిత బంధాన్ని కొనసాగిస్తోంది. కోర్సలేలో తగిన భాగస్వామిని గుర్తించానని చెప్పుకుంటోంది. శృతి మాటల్లో వింటే...ఒక గొప్ప బంధానికి కావాల్సింది అద్భుతమైన మగాడు. అతను స్తిమితంగా నిలబడితే అనుబంధానికి లోటుండదు. నాకు అలాంటి భాగస్వామి దొరికాడని భావిస్తున్నాను. అతను నన్ను స్వేచ్ఛగా ఉండనివ్వాలి, కోరుకున్నది చేయనివ్వగలగాలి. నన్ను నాకంటే ఎక్కువగా ప్రేమించాలి, నాపై చాలా నమ్మకం ఉంచాలి. అతనెవరో నేనే చెబుతాను. అని చెప్పింది. ఇక నాయికగా తన కోరికను చెబుతూ.. ప్రతి నాయికలా నేనూ సంపూర్ణ నటిగా పేరు తెచ్చుకోవాలనుకుంటున్నాను. కేవలం ఆడిపాడితే ప్రేక్షకుల మనసులో చిరకాలం ఉండలేమన్న విషయం నాకు తెలుసు. ఎప్పుడూ మంచి తారగానే ఉండాలనుకున్నాను. అని చెప్పింది.

చారిత్రక నేపథ్యంతో...!

స్టార్ హీరోల సినిమాలు ఒక్కోటి ఏడాది సమయం తీసుకుంటాయి. ఏడాదిలో ఒకటికి మించి సినిమాలు విడుదలవడం అసాధ్యం. సల్మాన్ ప్రతి ఈద్ పండక్కి ఒక సినిమా విడుదలయ్యేలా చూసుకుంటాడు. అయితే ఈ ఏడాది సల్మాన్ నటించిన రెండు సినిమాలు విడుదలవుండటం, అవీ వేసవిలో నెలకొకటి చొప్పున వస్తుండటం విశేషం. సల్మాన్ అభిమానులకు ఇది సంతోషకరమైన విషయమే. ఈ చిత్రాల వివరాలు చూస్తే ఒకటి భరత్ కాగా..రెండోది దబాంగ్ 3. అలీ అబ్బాస్ జఫర్ దర్శకత్వం వహిస్తున్న భరత్ ఈ జూన్ నెలలో ప్రేక్షకుల ముందుకొస్తుండగా...ప్రభుదేవా దర్శకత్వం వహించిన దబాంగ్ 3 మే నెలలోనే విడుదలవుతోంది. దబాంగ్ వాణిజ్య అంశాలున్న సినిమాగా తెరకెక్కుతోంది. భరత్ మాత్రం దేశ విభజన లాంటి చారిత్రక అంశాల నేపథ్యంతో సాగనుంది. దేశ విభజన ముందు తర్వాత 70 ఏళ్ల కాలాన్ని కథకు ఎంచుకున్నారు. ఈ కాలంలో ఓ వ్యక్తి జీవితం ఎలా సాగింది అనేది తెరకెక్కిస్తున్నారు. ఈ చారిత్రక నేపథ్యాన్ని సాధ్యమైనంత సహజంగా రూపకల్పన చేసేందుకు చిత్ర యూనిట్ ప్రయత్నించింది. ఇలా తన సినిమాలతో తీరిక లేకుండా ఉంటూనే కొత్త నటీనటులకు ప్రోత్సాహం అందించేందుకు సల్మాన్ ముందుకొస్తున్నారు. ఒక టాలెంట్ మేనేజ్‌మెంట్ సంస్థను ఏర్పాటు చేయడం ద్వారా కొత్త వాళ్లకు అవకాశాలు కల్పిస్తానని సల్మాన్ తెలిపారు.



సల్మాన్



కైరా అద్వాని
రామ్ చరణ్

వినయ విధేయ రామ్ చరణ్

సంక్రాంతి సినిమాల్లో పక్కా మాస్ చిత్రం 'వినయ విధేయ రామ'. రామ్ చరణ్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రానికి బోయపాటి శ్రీను దర్శకత్వం వహిస్తున్నారు. వీరిద్దరి తొలి కాంబినేషన్ సినిమా ఇది. ఇప్పటికే అంచనాలు అధికంగా ఉన్నాయి. బోయపాటి సినిమా అనగానే మాస్ ఎలిమెంట్స్ ఎక్కువ. యాక్షన్ సన్నివేశాలకు కొదువే ఉండదు. కుటుంబ నేపథ్యంతో మిళితమైన యాక్షన్ చిత్రంగా పేర్కోవచ్చు. సంక్రాంతి పండుగ సందర్భంగా జనవరి 11న విడుదల చేస్తున్నారు. శనివారం సెన్సార్ జరిగింది. యు/ఏ సర్టిఫికెట్ లభించిందని చిత్ర బృందం తెలిపింది. ఇందులో బాలీవుడ్ నటి కైరా అద్వాని నాయికగా నటించింది. డివివి. దానయ్య నిర్మించారు.

ఒక్కో దశలో ఒక్కోలా...

గతేడాది మూడు చిత్రాలతో దేశవ్యాప్త ప్రేక్షకులను అలరించింది టబు. నిన్నటితరం అందాల తార..ప్రస్తుతం నటనకు ఆస్కారమున్న పాత్రలు చేస్తూ ఆకట్టుకుంటోంది. మిస్సింగ్, సంజూ, అంధదూన్ చిత్రాల్లో ఆమె నటనకు బాగా పేరొచ్చింది. గతేడాది ఉత్తమ సహ నటి అంటూ విమర్శకులు ప్రశంసించారు. ఈ ఏడాది టబూ సల్మాన్ భరత్ చిత్రంతో పాటు దేదే ప్యార్ దే అనే చిత్రంలోనూ నటిస్తోంది. మరికొన్ని సినిమాలూ ఆమెకు దక్కే అవకాశాలున్నాయి. ఇక తన నట ప్రస్థానం గురించి టబు ఎప్పుడూ స్పష్టమైన అభిప్రాయాన్నే వెల్లడిస్తుంటుంది. టబు స్పందిస్తూ... అత్యంత స్వచ్ఛమైంది నటన. ఇదే నా తొలి ప్రాధాన్యమైనప్పుడు మిగతావన్నీ ద్వితీయమే అవుతాయి. నటిగా నేను సమాధానం చెప్పుకోవాల్సింది కేవలం ప్రేక్షకులకే. నేను బాగా నటించినా, నటించకున్నా దానికి తగినట్లు వాళ్లే ఫలితాన్నిస్తారు. నటిగా ఒక్కో దశలో ఒక్కో విషయాన్ని ఎంచుకుంటూ సినిమాలు చేస్తూ వచ్చాను. ఇవి కాలానుగుణంగా మారుతూ వచ్చాయి. అయితే ఎప్పుడూ నేను ఇష్టపడిన చిత్రంలోనే నటించాను. అని చెప్పింది. వెండితెరపై సుదీర్ఘమైన ప్రస్థానం చూసిన టబూ...తెలుగు, తమిళం లాంటి దక్షిణాది చిత్రాలతో పాటు బాలీవుడ్ సినిమాల్లోనూ తనదైన ముద్ర వేసింది. మక్బూల్, హైదర్, ద నేమ్‌సేక్ లాంటి చిత్రాలు టబూను ఇప్పటి ప్రేక్షకులకూ దగ్గర చేశాయి.



టబూ

అమీ నిశ్చితార్థం



అమీ జాక్సన్

బాలీవుడ్‌లో పెళ్లి సందడి నెలకొంటోంది. ఇప్పటికే ప్రముఖ నాయికలు దీపికా పడుకునే, ప్రియాంక చోప్రా పెళ్లి చేసుకుని ఓ ఇంటివారు అయ్యారు. తాజాగా ఈ లిస్టులో హీరోయిన్ అమీ జాక్సన్ చేరింది. ఇటీవలే విడుదలైన 2.ఓ సినిమాలో రజనీకాంత్‌కు జోడీగా నటించిన అమీ కొంతకాలంగా బ్రిటన్‌కు చెందిన పారిశ్రామికవేత్త జార్జ్ పనాయొటోతో డేటింగ్ చేస్తోంది. కొత్త సంవత్సరం తొలిరోజున వీరి నిశ్చితార్థం జరిగింది. ఈ విషయాన్ని అమీ జాక్సన్ స్వయంగా తెలిపింది. అయితే పెళ్లి ఎప్పుడు, ఎక్కడ జరుగుతుందనే విషయాన్ని మాత్రం ఆమె వెల్లడించలేదు. అమీ జాక్సన్ తన పెళ్లి కంటే ముందుగానే ఒప్పుకున్న సినిమాలు పూర్తిచేసే ఉద్దేశంతో ఉన్నట్టు తెలిసింది. దక్షిణాదిలో మహేష్‌బాబుతో సినిమా చేయడానికి ఆమె అంగీకరించినట్టు సమాచారం.



వినాయక్ ఆవిష్కరించిన యమ్6

ప్రముఖ దర్శకుడు వి.వి.వినాయక్ 'యమ్ 6' సినిమా ట్రైలర్ విడుదల చేసి, చిత్ర యూనిట్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో హీరో ధ్రువ, నిర్మాత విశ్వనాథ్ తన్నీరు పాల్గొన్నారు.

నిర్మాత మాట్లాడుతూ ''యమ్ 6 చిత్రం సస్పెన్స్, థ్రిల్లర్ కథాంశంతో రూపొందిస్తున్నాం. ఖర్చు విషయంలో రాజీ పడలేదు. దర్శకుడు జైరాం అద్భుతంగా తెరకెక్కించారు. ప్రతి సన్నివేశం బాగా వచ్చింది. ప్రేక్షకులు ఆస్వాదిస్తారు. హీరో కొత్తవాడు అయినప్పటికీ చక్కటి నటన ప్రదర్శించాడు. హీరోయిన్‌గా మిస్ బెంగళూరు అశ్విని నటించింది. ఈ సినిమాకు యమ్ 6 అనే టైటిల్ ఎందుకు పెట్టామనేది సినిమా చూస్తేనే అర్థమవుతుంది'' అని అన్నారు.

హీరో ధ్రువ మాట్లాడుతూ ''అందరినీ అలరించే చిత్రం అవుతుంది. ఓ మంచి సినిమా ద్వారా పరిచయం అవుతున్నందుకు ఆనందంగా ఉంది'' అన్నారు.

ఈ చిత్రానికి సంగీతం: విజయ్ బాలాజీ, ఛాయాగ్రహణం: మహ్మద్ రియాజ్, కో ప్రొడ్యూసర్: సురేష్.

రెండు జోనర్స్ కథ

వైవిధ్యమైన కథతో రూపొందుతున్న చిత్రం 'ధీవర'. నాగసాయి, విదా చైతన్య హీరో హీరోయిన్లుగా నటిస్తున్నారు. సస్పెన్స్ థ్రిల్లర్‌గా రాబోతోంది. ఈ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను సీనియర్ దర్శకుడు బాబీ చేతుల మీదుగా విడుదల చేశారు.


చిత్ర దర్శకుడు విజయ్ జిక్కి మాట్లాడుతూ ''ధీవర సినిమాలో స్క్రిప్ట్ హైలెట్‌గా ఉంటుంది, లవ్ సస్పెన్స్ మిళితమైన చిత్రమిది. ఒకేసారి రెండు జోనర్స్‌లో కథనం జరుగుతుంది'' అని చెప్పారు. నిర్మాత హరనాథ్ బాబు మాట్లాడుతూ ''యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా నిర్మిస్తున్నాం. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే పాటలను, ట్రైలర్‌ను విడుదల చేస్తాం. ఫిబ్రవరి నెలాఖరున సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తాం'' అని చెప్పారు.

ఈ చిత్రానికి సంగీతం: అద్దంకి వెంకటేష్, ఛాయాగ్రహణం: సాగర్ గొళ్లా.



నాగసాయి
విదా చైతన్య

యదార్ధ సంఘటనల వనవాసం



నూతన తారాగణంతో రూపొందుతున్న చిత్రం 'వనవాసం'. నవీన్ రాజ్, శశికాంత్, బందెల కరుణ, శ్యావ్య, శృతి హీరో హీరోయిన్లుగా నటిస్తున్నారు. భరత్ కుమార్‌పి. నరేంద్ర దర్శకుడు. సంజయ్ కుమార్. బి. నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి. ఈ చిత్రం టైటిల్, పోస్టర్‌ను ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ ఆవిష్కరించారు. టైటిల్ లాగే సినిమా కూడా బావుంటుందని ఆశిస్తున్నట్టు ఈ సందర్భంగా ఆయన అన్నారు. దర్శక, నిర్మాతలు మాట్లాడుతూ ''కొన్ని యదార్ధ సంఘటనల ఆధారంగా ఈ సినిమా తీయడం జరిగింది. ప్రేక్షకులు మెచ్చే అంశాలు ఉన్నాయి. అందరినీ ఆకట్టుకుంటుందనే నమ్మకం ఉంది'' అని అన్నారు.